తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM తిరుపతి : fb.com/vaartha Digital

Published from Tirupathi, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

11-9-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 223 పేజీలు: 10+4 వెల: 6.50




**SHOWROOMS: ANDHRA PRADESH:** RENAULT **KURNOOL** Ph: 8527234838. RENAULT **NANDYAL** Ph: 9289357267. **TAMIL NADU: CHENNAI:** RENAULT **AMBATTUR** Ph: 9103781804, RENAULT **AVADI** Ph: 8130309672, RENAULT **CHROMPET** Ph: 9311700662, RENAULT **KATTUPAKKAM** Ph: 8527234359, RENAULT **MOUNT ROAD** Ph: 7428881087, RENAULT **OMR** Ph: 8527240381, RENAULT **KILPAUK** Ph: 8448989109, RENAULT **GUDUVANCHERY** Ph: 9289631446.

11-09pg2exHMNWJQEOV:11-09pg2exHMNWJQEOV.qxd 9/10/2026 11:56 PM Page 1





ఇజ్రాయెల్ వైమానిక దాడితో గాజా నగరంలో భారీ పేలుడు సంభవించిన దృశ్యం

# జిల్లాలే చోదక శక్తులు

>> 14.19 శాతానికి పెరిగిందని, పరిశ్రమల రంగంలో 14.81 శాతం, సేవల రంగంలో 12.70 శాతం వృద్ధి నమోదైందని వివరించారు. ఆక్వా రంగంలో 6.61 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తితో 31.77 శాతం వృద్ధి నమోదైందన్నారు.

**14.28 శాతం పెరిగిన విద్యుత్ వినియోగం:**

విద్యుత్ ఉత్పత్తి 24,248 మిలియన్ యూనిట్ల నుంచి 28,664 మిలియన్ యూనిట్లకు పెరిగిందని, విద్యుత్ వినియోగం 14.28 శాతం పెరిగిందని అధికారులు తెలిపారు. ఇక పారిశ్రామిక ఉత్పత్తిలో తొలి త్రైమాసికంలో రూ.1,13,638 కోట్ల జీవిఎ నమోదైందని, సేవల రంగంలో 2026-27 తొలి త్రైమాసికానికి రూ.1,60,107 కోట్ల జీవిఎ నమోదైందని వివరించారు. జీఎస్టీ ఆదాయంలోనూ 18 శాతం మేర పెరుగుదల నమోదైందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టాస్క్‌ఫోర్స్ కలిగిన తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని తెలిపారు. ఇప్పటివరకు జరిగిన 20 రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశాల్లో 359 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపామని, రూ.13.85 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు, 10.6 లక్షల ఉద్యోగాలు వచ్చేలా ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చామని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఎస్ఐపిబి సమావేశాల్లో ఆమోదం పొందిన ప్రాజెక్టుల్లో ఇప్పటికే 160 ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయని, రూ.4.03 లక్షల కోట్ల పెట్టుబడులతో 5.9 లక్షల మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఎస్ఐపిబిలో అనుమతులు పొందిన ప్రాజెక్టులను వేగంగా గ్రౌండ్ చేసేలా జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని సిఎం సూచించారు. ప్రాజెక్టుల ప్రారంభ తేదీలను కూడా ఖరారు చేయాలని, ప్రాజెక్టుల గ్రౌండ్ కావడంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని ఆదేశించారు.

**ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహం:**

రాష్ట్రంలో ప్రస్తుతం తయారీ, సేవలు, వాణిజ్య రంగాల్లో 23.85 లక్షల ఎంఎస్ఎంఇలు ఉన్నాయని అధికారులు తెలిపారు. 175 ఎంఎస్ఎంఇ పార్కులకు గాను ఇప్పటికే 138 పార్కులకు ఆమోదం లభించిందని, 22 పార్కులు ప్రారంభమయ్యాయని, మిగతా 116 పార్కులు నిర్మాణంలో ఉన్నాయని వివరించారు. వీటి ద్వారా రూ.2,036 కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉండగా, 31,163 మందికి ఉద్యోగాలు లభించే అవకాశం ఉందన్నారు. ఈ యేడాది పెట్టుబడుల సదస్సులో భాగంగా విశాఖ, కాకినాడ, అమరావతి, అనంతపురం, తిరుపతిలో సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. విదేశ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు అక్టోబరులో ప్రాంతీయ కాన్ఫరెన్సులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పెట్టుబడులను మరింతగా ఆకర్షించేలా నవంబరులో 2026 భాగస్వామ్య సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న హెలిప్యాడ్‌లను నోటిఫై చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వీటిని పర్యాటక రంగంతోనూ అనుసంధానించే అవకాశం ఉంటుందని సూచించారు. జిల్లా కేంద్రాల్లో నైట్ ల్యాండింగ్ ఫెసిలిటీలను ప్రారంభించేలా కేంద్రం నుంచి అనుమతులు పొందేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. అర్బన్, ఆర్యూబిల నిర్మాణానికి యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని సిఎం ఆదేశించారు. జిల్లాల్లో అభివృద్ధి, పెట్టుబడులు, మౌలిక వసతుల పురోగతిని సమన్వయం చేస్తూ లక్ష్యాలను వేగంగా సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# ఫలితాలు సాధించాలి

>> స్తున్నాం. ఇప్పటి వరకూ 1.50 కోట్ల కోర్సులను సామర్థ్యాలను పెంచేందుకు నిర్వహించాం. డీప్ టెక్ గవర్నెన్స్ ఉంటే అనూహ్యమైన ఫలితాలను సాధించేందుకు అవకాశం ఉంది. టెక్నాలజీని వినియోగించడం ద్వారా డేటా లేక్, అవేర్ లాంటి వ్యవస్థలతో నిర్ణయాల్లో వేగం పెరగాలి... సేవల్లో నాణ్యత పెంచాలి. గతంలో 50 యేళ్లలో చేసే అభివృద్ధిని ఇప్పుడు 10-15యేళ్లలోనే సాధించేందుకు ఆస్కారం ఉంది. మనకు వనరులు ఉన్నాయి. టెక్నాలజీ అందుబాటులో ఉంది. రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగంగా 27 నెలల్లో రాష్ట్ర ఆర్థికవ్యవస్థను గాడిన పెట్టాం. రూ.1.40 లక్షల కోట్లు సంక్షేమానికి, రూ.1.50 లక్షల కోట్లు అభివృద్ధికి ఖర్చు చేశాం. రాయలసీమ రైజింగ్, కోస్తాంధ్ర భవిష్యత్ కొత్త పుంతలు, ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు పేరిట ప్రగతి కార్యక్రమాలు చేపట్టాం. హంద్రీ-నీవా, వెలిగొండ ఫేజ్-1, పోలవరం ఎడమ కాలువ, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రాజెక్టులు పూర్తిచేశాం. పోలవరం ప్రాజెక్టును 2027 మార్చి నాటికల్లా పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. అమరావతిలో సీడ్ యాక్సెస్ రోడ్డును పూర్తి చేసి గుంటూరు, విజయవాడకు రాజధానిని కనెక్ట్ చేశాం. ఎకనామిక్ టైమ్స్ పత్రిక "సిఇఒ టూ వాటర్‌మాన్" అంటూ కథనం రాసింది. సంతోషం కలిగింది. గ్లోబల్ డ్రీమ్ కేబినెట్‌లో నా పేరు వచ్చినప్పుడు, 'సిఇఒ సిఎం' అన్నప్పుడు కూడా నేను ఇంత ఆనందించలేదు. రాష్ట్రంలోని భౌగోళిక అసమానతల కారణంగా కొన్ని ప్రాంతాల్లో నీటి ఒత్తిడి ఉంది... దానిని సరిచేస్తూ నీటిని ఆయా ప్రాంతాలకు నీటిని ఇవ్వగలిగితే కలిగే సంతోషం వేరు. గోదావరి కావేరీ మహానది గంగా లాంటి నదులు అనుసంధానమై వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేస్తే భారత అభివృద్ధి అన్‌స్టాపబుల్. ఈ నీటి భద్రత, సంరక్షణా చర్యల్ని గుర్తించి వాటర్ మాన్‌గా పేరు పెట్టినందుకు సంతోషంగా ఉంది. 36 ప్రాజెక్టులు చేపట్టేందుకు క్యాలెండర్ కూడా ఇచ్చాం. వాటిని పూర్తి చేయాల్సిన బాధ్యత అందరి మీద ఉంది. ప్రధాని మోడీ, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ సహకారం అధికారుల తోడ్పాటుతో ఈ విజయాలను సాధించగలిగాం. ఇప్పటి దాకా సాధించిన ఏ ఒక్కరి వల్లో సాధ్యం కాలేదు.. మంత్రులు, అధికారులు, ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు.. ఇలా అందరి వల్ల సాధ్యమైంది.. ఈ విజయం టీమ్ సక్సెస్" అని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు.

**అవకాశాలను అన్ లాక్ చేయండి... అభివృద్ధి సాధించండి:**

"మనకు ఉన్న అవకాశాలను అన్‌లాక్ చేయగలిగాం. ప్రతి శాఖలోనూ సంస్కరణలు తీసుకువచ్చాం. ప్రతి జిల్లాలోనూ 25 టాప్ ప్రాజెక్టులను గుర్తించాలి... నియోజకవర్గానికి 10-15 ప్రాజెక్టులను ప్రాధాన్యతగా గుర్తించి అభివృద్ధి చేయాలి. జిల్లాల్లో గ్రోత్ ఇంజన్లను గుర్తించి దానికి అనుగుణంగా సంపద, ఆదాయాన్ని పెంచేలా చర్యలు చేపట్టాలి. కోనసీమ కొబ్బరికి, వరికి ఫేమస్ కానీ ఇప్పుడు ఆదాయంలో వెనుకపడింది. నూతన ఆదాయ మార్గాల్ని అన్వేషించాలి. కొత్త అవకాశాలను అందిపుచ్చుకుని ఏలూరు జిల్లా ఇప్పుడు అత్యుత్తమ జిల్లాగా మారింది. అందుకే అవకాశాలను అన్ లాక్ చేయాలని పదేపదే చెబుతున్నాను. ప్రతిస్పందించే పాలన ద్వారా సుపరిపాలన అందించాలి. క్షేత్రస్థాయిలో ప్రజలను కలవాలి. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్య పరిష్కారంపై సత్వరం స్పందించాలి. జిల్లా కలెక్టర్లుగా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.. మంచి జ్ఞాపకాలను మిగుల్చుకోవాలి. మా హయాంలో పలానా జిల్లాలో ఈ పని చేశామని ప్రతి కలెక్టర్ గర్వంగా చెప్పుకునేలా పనిచేయాలి. రియాక్టివ్ గవర్నెన్స్ కంటే ప్రో యాక్టివ్ గవర్నెన్స్ ఉండాలి. ఫైళ్ల పెండింగ్‌లో ఉన్నాయంటే అంటే అభివృద్ధిపాలన పెండింగ్‌లో ఉన్నట్టే. ప్రభుత్వ సేవలు సక్రమంగా అందినప్పుడే ప్రజల నుంచి సానుకూల స్పందన ఉంటుంది. నాకు పరిపాలన కంటే సుపరిపాలన ముఖ్యం. మంత్రులు, అధికారులు, కలెక్టర్లు ప్రభుత్వ సేవలు అందించే విషయంలో.. అభివృద్ధి సాధించే విషయంలో పోటీ పడాలి" అని ముఖ్యమంత్రి వివరించారు.

**నెలవారీ నివేదికలతో అభివృద్ధి ప్రయాణం:**

"ప్రతి నెలా ఆర్థిక నివేదికను విడుదల చేసి ఎప్పటికప్పుడు లక్ష్యాలను బేరీజు వేసుకుంటున్నాం. ప్రతి మూడు నెలలకూ జిఎస్‌డిపిని కూడా లెక్కించి ప్రగతిలో ఎక్కడ ఉన్నామో చూస్తున్నాం. 2022-23 బేస్ ఇయర్‌గా ప్రస్తుత ధరలకు అనుగుణంగా 13.44 శాతం వృద్ధి రేటు నమోదైంది. తయారీ రంగంలోనూ అభివృద్ధి నమోదు అయ్యింది. జీఎస్టీ వసూళ్లుకూడా గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది రూ.25,450 కోట్ల మేర పెరిగాయి. రెవెన్యూ శాఖలో సంస్కరణల్ని అమలు చేస్తున్నాం. 120 యేళ్ల నాటి భూ సమస్యల్ని కూడా పరిష్కరిస్తున్నాం. 1908 నుంచి అమలాపురంలో గ్రౌండ్ రెంట్ భూముల విషయంలో నిర్ణయం తీసుకుని 1,416 మందికి పట్టాలు ఇచ్చాం. 2027 నాటికి భూ వివాదాలు లేని రాష్ట్రంగా ఎపిని తయారు చేసే బాధ్యత మనందరిది. పాలన అంటే గుడ్డిగా పనిచేయటం కాదు. వినూత్న ఆలోచనలు చేయాలి. బెస్ట్ ప్రాక్టీసెస్ అనుసరించాలి. బెస్ట్ పాలసీలు తెచ్చి ప్రభుత్వ సేవలను సులభతరం చేయాలి. కొత్త ఆలోచన కొత్త ఆవిష్కరణలతో అంతా కలిసి పనిచేద్దాం. ప్రస్తుతం 13.44 శాతం వృద్ధి నమోదైంది. దీనిని 15 శాతం దిశగా తీసుకెళ్దాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

# సాదిక్ విచారణలో ట్విస్ట్.. ప్రో షూటింగ్ అకాడమీలో కీలక ఆధారాలు!

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,సెప్టెంబర్10, ప్రభాతవార్త:** కాకినాడ జిల్లా పిఠాపురం పంచాయతీ ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య, ఆయన అల్లుడు జగదీశ్‌రెడ్డి అనుమానాస్పద మృతి కేసుల్లో నిందితుడైన సాదిక్‌ఖాన్ విచారణలో భాగంగా 3వ రోజు సర్పవరం సీఐ ప్రకాష్ పోలీసులు ముమ్మరంగా విచారిస్తున్నారు.మూడో రోజు విచారణలో భాగంగా సాదిక్‌ను కాకినాడలోని ప్రో షూటింగ్ అకాడమీకి తీసుకెళ్లి గంటపాటు తనిఖీలు నిర్వహించారు.అక్కడ పలు కీలక ఆధారాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. అలాగే సాదిక్ ఖాన్ నుంచి ఖరీదైన వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.అనంతరం ఎఇ నూకరాజు, ఆయన కుమార్తె సౌజన్య నివాసాలకు తీసుకెళ్లి వివరాలు సేకరించారు. జగదీశ్‌రెడ్డి మృతికి సంబంధించి హానికారక రసాయనం వ్యవహారం, సాదిక్‌కు అందిన పార్సిల్, అతడికి సహకరించిన వ్యక్తులపై కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సాదిక్ పోలీస్ కస్టడీ శుక్రవారం ఉదయం 10.30 గంటల వరకు కొనసాగనుంది. పోలీసుల విచారణలో నిందితుడు సాధిక్ ఖాన్‌ను కస్టడీకి తీసుకున్న సర్పవరం పోలీసులు అతడి న్యాయవాది సమక్షంలో అదనపు ఎస్పీ మహంతి కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో రూరల్ పీఎస్ ఆవరణలో ఉన్న ప్రత్యేకగదిలో అతన్ని విచారిస్తున్నారు. ఉదయం ప్రారంభమైన విచారణ, రాత్రి 9.30 సమయానికి కూడా కొనసాగుతోంది. పోలీసు వర్గాల నుంచి తెలిసిన సమాచారంమేరకు.. సాధిక్‌ను విచారించేందుకు 200 ప్రశ్నలతో జాబితాను సిద్ధం చేసుకున్న పోలీసులు తొలిరోజు 60 ప్రశ్నలు అడిగారు. అందులో ఎక్కువ మేరకు తెలీదు, గుర్తులేదు, మర్చిపోయా అంటూ సాధిక్ సమాధానం ఇవ్వడం గమనార్హం. సాంకేతిక ఆధారాలతో సాధిక్‌ను అడిగిన ప్రశ్నలకు వాస్తవ సమాధానాలు కనిపెట్టే యోచనలో పోలీసులు ఉన్నారు. విచారణకు పూర్తి స్థాయి సహకారం లేకపోవడం వల్ల సాంకేతిక అంశాలపై ఆధారపడి కేసు విచారణ కొనసాగించే అవకాశం ఉందని సమాచారం. సాధిక్ మీరట్ వెళ్లడం వెనుక కారణాలను పోలీసులు ఆరా తీస్తున్నారు. నేరుగా ఆంధ్రా పోలీసులకు చిక్కకుండా సాధిక్ అక్కడి పోలీసుల ద్వారా అరెస్టయ్యాడని తెలిసింది. స్థానిక పోలీసులు అరెస్టు చేయడం వల్లే ఆంధ్రా పోలీసులు వెళ్లి ట్రాన్సిట్ వారెంట్ ద్వారా తీసుకురావలసి వచ్చిందని స్పష్టమైంది.

ఆంధ్ర పోలీసులకు చిక్కే సమయానికి సాధిక్‌కు చెందిన స్థానికులు మీరట్ పోలీసులకు సమాచారం అందించి కావాలనే అరెస్టు చేయించారని, నేరుగా ఆంధ్రా పోలీసులకు చిక్కితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ముందే గుర్తించిన సాధిక్ తన మార్గదర్శి ద్వారా ఈ పన్నాగం పన్నాడని చెబుతున్నారు. అతడి వెనకున్నదెవరు అన్న విషయాలపై ఆరా తీస్తున్నారు. సాధారణంగా దేశంలో ఏ మూల ఉన్నా నిందితులను పోలీసులు ఆయా ప్రాంతాలను వెళ్లి అరెస్టు చేసి జిల్లాకు తీసుకువస్తారు. కాని సాధిక్ విషయంలో అలా జరగలేదు. ట్రాన్సిట్ వారెంట్ తప్పనిసరి అయింది. సౌజన్య భర్త జగదీశ్వర్ రెడ్డి హత్యకు వినియోగించాడని చెబుతున్న ప్రాణాంతక రసాయనం ఏంటి, ఎక్కడి నుంచి తెచ్చావన్న ప్రశ్నకు రసాయనం తేవడం నిజమేనని అంగీకరించినట్టు తెలిసింది. అయితే, ఆ రసాయనం ఉపయోగించి తాను చంపలేదని చెబుతున్నాడు. ఈ విషయాన్ని నిరూపించడం పోలీసులకు ఓ సవాల్‌గా మారింది. ఇప్పటికే జగదీశ్వర్‌రెడ్డి చికిత్స పొందిన ఆసుపత్రుల నుంచి ఆరోగ్య నివేదికలు సేకరించారు. వాటిని నిపుణుల పరిశీలనకు పంపారు. ఈ విచారణలో పోలీసులు కీలక విషయం రాబట్టారు. మోసం చేయడం ఆది నుంచి సాధిక్‌కు ఓ అలవాటైన విషయమని మరోసారి నిర్ధారించుకున్నారు. ఇంత డాబు, దర్పాన్ని ప్రదర్శిస్తున్న సాధిక్ కనీసం డిగ్రీ కూడా పూర్తి చేయలేదు. నకిలీ సర్టిఫికెట్ ఒకటి తయారు చేయించుకొని వివిధ పోటీలలో పాల్గొనడం దగ్గర నుంచి, కోచ్‌గా పాఠశాలల్లో చేరడం వరకు చేశాడని పోలీసులు నిర్ధారించుకున్నారు. ఈ విషయాన్ని స్వయానా సాధిక్ అంగీకరించాడు.

**ఇద్దరు సెంటు వ్యాపారస్తుల విచారణ...**

సాధిక్ ఖాన్‌ను కస్టడీకి తీసుకొచ్చే కొద్ది రోజుల ముందు కీలక పరిణామం చోటుచేసుకుంది. జగదీశ్వర్‌రెడ్డిని హతమార్చేందుకు సాధిక్ సర్వ ప్రయత్నాలు చేశాడన్న విషయం రూఢీ అయింది. అందులో భాగంగా రాజమహేంద్రవరం గాందీపురంలో ఉన్న ఓ సెంటు వ్యాపారస్తుడు అబ్దుర్ రెహమాన్ సాధిక్ సంప్రదించాడు. తనకు హానికారక రసాయనం కావాలని, ఒక వ్యక్తిని హతమార్చాలని చెప్పాడు. అది ప్రస్తుతం తన వద్ద లేదని చెప్పిన రెహమాన్ హైదరాబాద్‌కు చెందిన అబ్దుల్ ఖాదిర్‌ను సంప్రదించాలని చెప్పి ఫోన్ నంబర్ ఇచ్చాడు. పోలీసులు వీరిద్దరినీ విచారిస్తుండగా వారి న్యాయవాది వచ్చి విడుదల చేయించారని, విచారణకు అన్ని విధాలా సహకరిస్తామని చెప్పి తీసుకెళ్లారని తెలిసింది. సాధిక్ విచారణ కొనసాగుతుండడంతో వారిద్దరినీ మరో మారు పిలిపించే అవకాశం ఉంది.

# రాలని చినుకు... రైతుకు లేదు కునుకు!

>> ఆశించిన స్థాయిలో దిగుబడి వచ్చే పరిస్థితి కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొక్కజొన్నను 31,557 ఎకరాల్లో, చిరుధాన్యాలను సుమారు వెయ్యి ఎకరాల్లో సాగు చేసినప్పటికీ వర్షాలు లేకపోవడంతో ఆశించిన ఫలితం రావడం లేదని అధికారులు తెలిపారు. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో వర్షాలు కురిస్తే ఉలవలు వంటి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు విత్తనాలను సిద్ధంగా ఉంచినట్లు వ్యవసాయ శాఖ పేర్కొంటోంది.

**బోర్లు ఎండిపోతుండటంతో ఉద్యాన పంటలకూ దెబ్బ**

వర్షాధార పంటలతో పాటు బోరుబావుల ఆధారంగా సాగు చేస్తున్న టమోటా, అరటి, బత్తాయి తదితర ఉద్యాన పంటలపై కూడా కరువు ప్రభావం పడుతోంది. భూగర్భ జలాలు క్రమంగా అడుగంటడంతో బోర్లు ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. నీరు అందుబాటులో లేకపోవడంతో పంటలను కాపాడుకోవడం కూడా కష్టంగా మారింది. కూరగాయలు, ఆకుకూరల సాగుపైనా వర్షాభావం తీవ్ర ప్రభావం చూపుతోంది. స్థానికంగా ఉత్పత్తి తగ్గడంతో మార్కెట్లపైకూడా దాని ప్రభావంపడే అవకాశం ఉంది. పౌష్టికాహారంలో కీలకమైన ఆకుకూరలు, కూరగాయల ధరలు పెరిగితే సామాన్య కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడనుంది.

**సాగునీటి ప్రాజెక్టుపై రైతుల ఆశలు:**

కరువు పరిస్థితులకు శాశ్వత పరిష్కారంగా భావిస్తున్న కుందుర్పి బ్రాంచ్ కెనాల్ ద్వారా 114 చెరువులకు సాగునీరు అందించే పథకంపై ఈ ప్రాంత రైతులు ఎన్నో యేళ్లుగా ఆశలు పెట్టుకున్నారు. అయితే ఈ ప్రాజెక్టు పనులు పూర్తి స్థాయిలో ముందుకు సాగకపోవడంపై రైతుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. 2028లో బిటిపి-కుందుర్పి బ్రాంచ్ కెనాల్ పనులకు ప్రాధాన్యం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో మరో రెండేళ్లు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు అంటున్నారు. ప్రాజెక్టు ఎప్పుడు పూర్తవుతుందో, తమ పొలాలకు ఎప్పుడు సాగునీరు అందుతుందోనన్న అనిశ్చితి వారిని వెంటాడుతోంది.

ఎన్నికల ముందు హామీలు.. ఎన్నికల తర్వాత వాయిదాలు కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.

పంటలు పండకపోవడం, పెట్టుబడులు తిరిగి రాకపోవడం, సాగునీటి కొరత వంటి సమస్యలు రైతు కుటుంబాల ఆర్థిక పరిస్థితిని దెబ్బతీస్తున్నాయి. వ్యవసాయంపై ఆధారపడిన కూలీలకు కూడా పనిదినాలు తగ్గుతున్నాయి. దీంతో కొందరు రైతులు, వ్యవసాయ కూలీలు జీవనోపాధి కోసం పట్టణాలు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఒకవైపు పంటలు పండక ఆదాయం తగ్గుతుండగా మరోవైపు కుటుంబ అవసరాల కోసం ఖర్చులు పెరుగుతున్నాయి. ఫలితంగా గ్రామీణ కుటుంబాలపై ఆర్థిక ఒత్తిడి మరింత పెరుగుతోంది. స్థానికంగా వ్యవసాయ ఉత్పత్తి తగ్గితే దాని ప్రభావం మార్కెట్‌పై పడే అవకాశం ఉంది. ఇప్పటికే బియ్యం వంటి నిత్యావసర సరుకుల ధరలు సామాన్యుడికి భారంగా మారుతున్నాయి. ప్రస్తుతం 25 కిలోల సోనా మసూరి బియ్యం బస్తా సుమారు రూ.1,800కు చేరిందని వినియోగదారులు చెబుతున్నారు. ధాన్యాల ఉత్పత్తి కూడా తగ్గితే రానున్న రోజుల్లో బియ్యం, గోధుమలు, జొన్నలు, రాగులు తదితర ఆహార ధాన్యాల ధరలు మరింత పెరిగే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కళ్యాణదుర్గం వంటి వర్షాధార ప్రాంతాల్లో కరవు పరిస్థితులను కేవలం వర్షాలు పడే వరకు ఎదురుచూసే సమస్యగాకాకుండా దీర్ఘకాలిక వ్యవసాయ సంక్షోభంగా చూడాల్సిన అవసరం ఉంది. పంట నష్టాలపై శాస్త్రీయ అంచనాలు రూపొందించడం, రైతులకు ప్రత్యామ్నాయ పంటలు-విత్తనాలు అందించడం, తాగునీటి భద్రత కల్పించడం, పశువులకు మేత-నీటి కొరత రాకుండా చర్యలు తీసుకోవడం అత్యవసరం. అదే సమయంలో భూగర్భ జలాల పరిరక్షణ, చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి సంరక్షణ, సాగునీటి ప్రాజెక్టుల వేగవంతమైన పూర్తిపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని రైతులు కోరుతున్నారు. కరవు తీవ్రతను ముందుగానే గుర్తించి గ్రామీణ ప్రజలకు ఆహార భద్రత, ఉపాధి, వ్యవసాయ సహాయం అందేలా సమగ్ర కార్యాచరణ చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# భూప్రకంపనలు

>> బయటకు పరుగులు తీసి రోడ్లపైకి చేరుకున్నారు. ఏం జరుగుతుందో తెలియక ప్రజలు కొంతసేపు తీవ్ర గందరగోళానికి లోనయ్యారు. అయితే, తీవ్రత తక్కువగా ఉండటంతో ఎక్కడా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదని తెలుస్తోంది. ఎవరూ ఆందోళన చెందవద్దని, పుకార్లను నమ్మవద్దని అధికార యంత్రాంగం విజ్ఞప్తి చేసింది.

## వారం - వర్జ్యం

11-09-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణం మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, కృష్ణపక్షం, పుబ్బ కార్తె,
తి. అమావాస్య ఉ.8.58. న. పూర్వఫల్గుణి మ.1.19
వ.రా.8.25 - రా.9.59
దు.ఉ.8.23 - ఉ.9.12
2) మ.12.29 - మ.1.18
రాహు. ఉ.10.30-12.00. శుభ స. లేదు.

## వార్తాఫలం

**మేషం :** వృత్తి, ఉద్యోగాల పరంగా అదనపు బాధ్యతలను స్వీకరిస్తారు. మీ భావజాలంలో మార్పులు చోటు చేసుకుంటాయి.

**వృషభం :** అధిక ధనవ్యయాన్ని కలిగి ఉంటారు. కొత్త వర్గం ఆత్మీయ వర్గంగా పరిణమిస్తుంది.

**మిథునం :** చిరు పరిచయాలు మరింతగా బలపడతాయి. అవరోధాలను అవలీలగా అధిగమించగలుగుతారు.

**కర్కాటకం :** ఆర్థికంగా మెరుగైన ఫలితాలను సాధించగలుగుతారు. మీ ఆంతర్యం అర్థం చేసుకోవడం కష్టం.

**సింహం :** అభిరుచి కలిగిన పనులను పూర్తి చేయగలుగుతారు. ఋణాలు లభిస్తాయి. వ్యక్తిగత గౌరవం పెంపొందుతుంది.

**కన్య :** శక్తి సామర్థ్యాలు, పట్టుదల, ఓర్పు నేర్పు కలిగి ఉంటారు. దీర్ఘసంబంధమైన ఇబ్బందులు ఏర్పడవచ్చు.

**తుల :** వ్యక్తిగత గౌరవం పెంపొందుతుంది. పొగడ్తలకు ఏమాత్రం లొంగరు. సొంత నిర్ణయాలనే అమలు చేస్తారు.

**వృశ్చికం :** ఇతరుల నుండి సలహాలను ఎక్కువగా తీసుకుంటారు. స్థిరాస్తి విషయమై అభిప్రాయ భేదాలు చోటు చేసుకుంటాయి.


**ధనుస్సు :** దైనందిన కార్యక్రమాలతో హడావుడిగా కాలాన్ని గడుపుతారు. స్పెక్యులేషన్లు దూరంగా ఉండటం మంచిది.

**మకరం :** జీవితం ఒకే చట్రంలో సాగుతున్నట్టుగా భావిస్తారు. కోర్టు వ్యవహారాలు వాయిదాలలో ఉంటాయి.

**కుంభం:** మీ ఆలోచనలకు విలువనిచ్చే టటువంటి ఆత్మీయవర్గం యొక్క సహాయ సహకారాలు నేడు అందుకోగలుగుతారు.

**మీనం :** ఎదుటివారు చెప్పేది ఆసాంతం విని ప్రత్యుత్తరం ఇవ్వండి. దురభ్యాసాలకు దూరంగా ఉంటారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



గణేశ్ చతుర్థి సందర్భంగా ముంబయిలో వేరుశెనగ గింజలతో వినాయకుడి విగ్రహాన్ని తయారు చేస్తున్న ఓ కళాకారుడు

# స్పేస్ సెంటర్ ఏర్పాటు లక్ష్యం!

>> తెలిపారు. అంతరిక్ష రంగంలో భారత్ చేపడుతున్న ప్రతి కార్యక్రమం ద్వారా లభించే ప్రయోజనాలు కేవలం ఒక దేశానికే పరిమితం కాకుండా మానవాళి మొత్తానికి చేరాలని తమ మార్గదర్శక సూత్రం అని మోడీ పేర్కొన్నారు.

**ప్రైవేట్ స్పేస్ రంగానికి ప్రోత్సాహం:**

ఇస్రోతో పాటు భారత్‌లోని ప్రైవేట్ అంతరిక్ష రంగం కూడా వేగంగా అభివృద్ధి చెందుతోందని ప్రధాని మోడీ తెలిపారు. ప్రైవేట్ సంస్థల వ్యాపార సామర్థం, ఇస్రో శాస్త్రీయ నైపుణ్యంతో కలిసి భారత అంతరిక్ష రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్తున్నాయని చెప్పారు. భారత అంతరిక్ష కార్యక్రమం ప్రారంభమైన 1960ల నుంచే ఫ్రాన్స్ విశ్వసనీయ భాగస్వామిగా కొనసాగుతోందని మోడీ తెలిపారు. ప్రస్తుతం ఇరు దేశాల సహకారం భూ పరిశీలన నుంచి అత్యాధునిక సాంకేతికతల వరకు విస్తరించిందన్నారు. భారత్ అంతరిక్ష రంగంలో ప్రారంభించబోయే తదుపరి దశ ప్రయాణంలో ఫ్రాన్స్‌తో పాటు ప్రపంచ దేశాలు కూడా భాగస్వాములు కావాలని మోడీ ఆహ్వానించారు.

**కలిసి రక్షిద్దాం:**

పారిస్‌లో జరుగుతున్న స్పేస్ సమ్మిట్ ప్రపంచానికి స్పష్టమైన సందేశాన్ని ఇవ్వాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆకాంక్షించారు. అంతరిక్షాన్ని కలిసి అన్వేషించడం, కలిసి కొత్త ఆవిష్కరణలు చేయడం, భవిష్యత్ తరాల కోసం అంతరిక్షాన్ని కలిసి రక్షించడం లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు, అంతరిక్ష సంస్థలు, ప్రైవేట్ కంపెనీలు, శాస్త్రవేత్తలు ఈ సమ్మిట్‌లో పాల్గొంటున్నారు. సమాజ అభివృద్ధికి అంతరిక్ష కార్యకలాపాలను దీర్ఘకాలికంగా కీలకమైన శక్తిగా మార్చే దిశగా ఈ సమావేశంలో చర్చలు జరుగుతున్నాయి.

# భూములకు రిజిస్ట్రేషన్ అవకాశం

>> ఫ్రిహోల్డ్ భూముల్లో అక్రమాలు చోటుచేసుకున్నట్లు గుర్తించిన 4 లక్షల ఎకరాలపై పూర్తిస్థాయి విచారణ తర్వాత తగు నిర్ణయం తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వం కక్షపూరితంగా 22ఏ (నిషేధిత) జాబితాలో చేర్చిన 28 లక్షల ఎకరాలను ఇప్పటికే తొలగించామని తెలిపారు. 22ఏ తొలగింపు ప్రక్రియను సులభతరం చేస్తూ జిఒ నెం.444 జారీ చేశామని, దీని ద్వారా వచ్చిన 28,790 ఎకరాల దరఖాస్తుల్లో ఇప్పటికే 1,100 ఎకరాలను జాబితా నుంచి తొలగించామని, మిగిలిన వాటిపై కూడా త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ఇకపై ఏదైనా ప్రైవేట్ భూమిని 22ఏ జాబితాలో చేర్చాలంటే సంబంధిత అధికారే ఆ భూమి స్వభావాన్ని నిరూపించాల్సి ఉంటుందని, అందుకు స్పష్టమైన విధివిధానాలతో జిఒ నం.445 తెచ్చామని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ భూములను నిషేధిత జాబితాలో పెడితే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వట్టిచెరుకూరు, శెట్టిపల్లి, పుల్లడిగుంట, కంగుంది, అవులపల్లి, గూటుపల్లి సహా కోనసీమ జిల్లాలోని నాలుగు ప్రాంతాల్లో వేలాది మందికి ఆస్తులపై హక్కులు పునరుద్ధరించామని చెప్పారు. కైకలూరు నియోజకవర్గంలోనూ స్థానిక ఎమ్మెల్యే చొరవతో నాలుగు గ్రామాల్లోని రెండు వేల ఎకరాలకు పైగా నిషేధిత జాబితా నుండి తొలగించినట్లు చెప్పారు. శాశ్వత పరిష్కారానికై "మీ భూమి- బ్లాక్‌చైన్ టెక్నాలజ్జీ ప్రాజెక్ట్‌ను అమలు చేస్తున్నామని ప్రకటించారు. ఈ ప్రాజెక్ట్‌ను విజయవంతం చేసేందుకు కలెక్టర్లు నిరంతరం ప్రాజెక్టు అమలు తీరును పర్యవేక్షి ంచాలన్నారు. గత ప్రభుత్వంలో మాదరి తప్పులకు ఆస్కారం లేకుండా రీ సర్వే 2.0ను సమర్థవంతంగా చేస్తున్నామని, సర్వే శాఖ పట్ల ప్రజల్లో విశ్వాసం పెరగడం సంతోషకరమని, అయితే వందశాతం తప్పుల్లేకుండా రీ సర్వే చేయాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశించారు.

# ప్రపంచ పర్యాటక గమ్యస్థానంగా ఎపి

>> రామ్మోహన్ నాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐఏటీఓ మాన్యువల్ బుక్‌ను ఆవిష్కరించడంతో పాటు, 2027లో జరగనున్న గోదావరి పుష్కరాల ప్రత్యేకతను ప్రపంచానికి చాటేలా ఏపీ పర్యాటక శాఖ రూపొందించిన 'ది గోదావరి కాల్స్' పోస్టర్‌ను మంత్రి దుర్గేష్ ఆవిష్కరించారు. దేశ, విదేశాల నుంచి వచ్చిన టూర్ ఆపరేటర్లు ఆంధ్రప్రదేశ్‌ను సందర్శించి రాష్ట్రంలోని ప్రకృతి, ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైవిధ్యాన్ని అనుభూతి చెందాలని మంత్రి పిలుపునిచ్చారు. ఏపీ పర్యాటకాన్ని ప్రపంచ వేదికపై ప్రచారం చేసేందుకు భాగస్వాములు కావాలని కోరారు.

రాష్ట్రానికి వచ్చే పర్యాటకుల కోసం 2, 3, 4, 7 రోజుల ప్రత్యేక టూర్ ప్యాకేజీలను రూపొందించాలని సూచించారు.పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించడంతో పాటు 2024-29 నూతన పర్యాటక పాలసీ ద్వారా పెట్టుబడిదారులకు భారీ రాయితీలు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. క్యారవాన్, హోమ్‌స్టే, ల్యాండ్ అలాట్‌మెంట్, ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ తదితర విధానాల ద్వారా గత రెండేళ్లలో రాష్ట్రానికి రూ.20 వేల కోట్ల పర్యాటక పెట్టుబడులు వచ్చినట్లు వెల్లడించారు.పాలసీ, ప్రాసెస్, పార్ట్‌నర్‌షిప్, ప్రాజెక్ట్స్, ప్రమోషన్, ప్రొడక్ట్స్ అనే ఆరు సూత్రాలతో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. వెల్‌నెస్, ఎకో, అడ్వెంచర్, హెలీ, సీప్లేన్ టూరిజాన్ని ప్రోత్సహిస్తున్నామని, 1,058 కిలోమీటర్ల సుదీర్ఘ సముద్రతీరంతో పాటు అరకు, లంబసింగి, మారేడుమిల్లి వంటి ప్రాంతాల్లో పర్యాటక మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు.

# ఫలితం అందే వరకూ పర్యవేక్షణ ఉండాలి

>> సమీక్ష నిర్వహించారు. ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడే పనులను ప్రాధాన్యత క్రమంలో వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమీక్ష సందర్భంగా అధికారులు వివిధ శాఖల పరిధిలో జరుగుతున్న పనుల పురోగతిని ఉప ముఖ్యమంత్రికి వివరించారు. ఏ పనులు పూర్తయ్యాయి, ఏవి పురోగతిలో ఉన్నాయి, తదుపరి కార్యాచరణ ఏ చర్యలు తీసుకోవాల్సి ఉంది లాంటి అంశాల గురించి ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లోఉన్న పనులను గుర్తించి, అవసరమైన పరిపాలనా, సాంకేతిక ప్రక్రియలను పూర్తిచేసి నిర్ణీత గడువులోగా పనులను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు.

# కుప్పకూలిన నిర్మాణంలో ఉన్న చర్చి

>> సాయంత్రం చర్చి నిర్మాణానికి సంబంధించి మోల్డింగ్ వేసిన మేస్త్రీలు కూలీలు, చర్చి భవనం పైభాగం నుండి కిందికి వచ్చి నిలబడ్డారు. ఈ క్రమంలో మోల్డింగ్ వేసిన భాగం ఒక్కసారిగా కుప్పకూలడంతో కింద నిలబడ్డ మేస్త్రీలు, కూలీలపై మోల్డింగ్ మెటీరియల్ పూర్తి స్థాయిలో పడిపోయింది. ఈ ఘటనలో మేస్త్రీలు, కూలీలు మోల్డింగ్ శిథిలాల్లో చిక్కుకుని పోవడంతో పరిసరాల్లో వున్న ప్రజలు ఒక్కసారిగా హాహాకారాలు చేశారు. చర్చి నిర్మాణంలో ఏదో అపశృతి జరిగిందని భావించిన స్థానికులు పెద్దసంఖ్యలో గుమిగుడటం, శిథిలాల్లో చిక్కుకున్న మేస్త్రీలు కూలీలను రక్షించడానికి స్థానికులు ప్రయత్నించారు. సంఘటన జరిగిన క్షణాల్లోనే అక్కడికి చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్త ఎంసి విజయానందరెడ్డిలు సంఘటనా స్థలం చేరుకుని క్షతగాత్రులను స్థానికుల సహకారంతో తమిళనాడు రాష్ట్రం అడుకుంబారై ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అలాగే సంఘటనా స్థలంకు చిత్తూరు డిఎస్పీ వెంకట నారాయణ, చిత్తూరు వెస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శ్రీధర్‌నాయుడు, గుడిపాల ఎస్ఐ శ్రీకాంత్‌లు సిబ్బందితో చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించడానికి చర్యలు చేపట్టారు. అలాగే తమిళనాడు రాష్ట్రం తిరువలం పోలీస్ స్టేషన్ పోలీసులు సంఘటనా స్థలం చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాల్లో చిక్కుకున్న కూలీలను రక్షించి వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించడానికి చర్యలు తీసుకుంటున్నారు. మృతి చెందిన వారి మృతదేహాలను తిరువలం పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికితరలించారు. తిరువలంపోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

11-09Pg3exHMNWJQEV:11-09Pg3exHMNWJQEV.qxd 9/11/2026 12:04 AM Page 1

సాహిత్యం గత వారంలోని ప్రత్యేక విశేషాలు
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

తిరుపతి

: fb.com/vaartha Digital

Published from Tirupathi, Kadapa, Nellore, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nalgonda, Tadepalligudem, Srikakulam

11-9-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 223 పేజీలు: 10+4 వెల: 6.50

నీటి ప్రాజెక్టులతోనే కరవుకు చెక్ 5లో
ఇళ్లపట్టాల జాబితా సిద్ధం చేయండి : సిఎం

## రాష్ట్ర ఆర్థిక వృద్ధికి జిల్లాలే చోదక శక్తులు

● అవకాశాలను అన్ లాక్ చేస్తేనే జిఎస్‌డిపి లక్ష్యం సాధ్యం ● పెట్టుబడుల్ని ఆకర్షించేలా అక్టోబరులో ప్రాంతీయ సదస్సులు ● 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు ● 2026-27 వృద్ధిరేటు అంచనా 13.44 శాతంగా నమోదైందన్న అధికారులు

**విజయవాడ, సెప్టెంబరు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** జిఎస్‌డిపి లక్ష్యాన్ని చేరుకునేలా జిల్లాల్లో ఉన్న అవకాశాలను అన్‌లాక్ చేయాలని, స్థానిక వనరులను సమర్థంగా మార్కెటింగ్ చేసుకుని సంపద సృష్టించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. జిల్లాల వారీగా వృద్ధి సమాచారాన్ని మంత్రులు, కలెక్టర్లకు అందించేలా ఆర్‌టిజిఎస్ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెట్టుబడుల గ్రౌండింగ్, జిఎస్‌డిపి సహా వివిధ అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ధరల సూచీ సహా వివిధ అంశాలను పరిగణించేందుకు 2022-23ను బేస్ ఇయర్‌గా కేంద్రం నిర్ధారించిందని అధికారులు తెలిపారు.

ప్రస్తుతధరలమేరకు 2026-27 వృద్ధిరేటుఅంచనా 13.44 శాతంగా నమోదైందని వెల్లడించారు. వ్యవసాయ అనుబంధరంగాల జివిఎ వృద్ధి రేటు 2026-27 తొలి త్రైమాసికంలో >>2

## 9 లక్షల ఎకరాల ఫ్రి హోల్డ్ భూములకు రిజిస్ట్రేషన్ అవకాశం



అక్రమాలు జరిగిన 4 లక్షల ఎకరాలపై విచారణ తర్వాత నిర్ణయం

దీర్ఘకాలిక భూసమస్యలకు శాశ్వత పరిష్కారం

28 లక్షల ఎకరాలు 22ఏ జాబితా నుండి తొలగింపు

కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో మంత్రి అనగాని సత్యప్రసాద్

**విజయవాడ, సెప్టెంబరు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో శతాబ్దాల కాలంగా కొనసాగుతున్న భూ సమస్యలకు చరమగీతం పాడుతూ, భూయజమానులకు వారిఆస్తులపై సంపూర్ణ హక్కులు కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలో నిర్వహించిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఫ్రి హోల్డ్ చేసిన భూముల్లో నిబంధనల ప్రకారం ఉన్న 9 లక్షల ఎకరాలకు రిజిస్ట్రేషన్లకు అవకాశం ఇస్తున్నట్లు చెప్పారు. అయితే >>2



గురువారం అమరావతి సచివాలయంలో రెండు రోజుల కలెక్టర్ల సదస్సులో ప్రసంగిస్తున్న సిఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రులు లోకేష్, అనగాని, ఫరూక్, రవీంద్ర, సిఎస్ సాయిప్రసాద్, డిజిపి హరీష్ గుప్తా

# సమీక్షలు కాదు, ఫలితాలు సాధించాలి

ప్రజా సేవకులుగా ఉందాం... ఇగోలు వద్దు

కలెక్టర్లు, అధికారులు, మంత్రుల మధ్య పోటీ ఉండాలి

ఆలోచనలతో పాటు... అమలూ ఉండాలి

వన్ స్టేట్.. వన్ విజన్.. వన్ టీమ్.. వన్ మిషన్.. అదే స్వర్ణాంధ్ర

కరవు ప్రాంతాలకు నీళ్లిస్తేనే నాకు సంతృప్తి

రియాక్టివ్ నుంచి ప్రో యాక్టివ్ దిశగా అధికారులు పనిచేయాలి

జిల్లాకు 25, నియోజకవర్గానికి 10నుంచి 15 ప్రాధాన్యతాంశాలను గుర్తించాలి

8వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం

సాగునీటి రంగంలో విశేష కృషి చేసి వాటర్ మ్యాన్‌గా నిలిచిన సిఎం చంద్రబాబుకు కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో స్టాండింగ్ ఓవేషన్

**అమరావతి, సెప్టెంబరు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** శాఖలు, అంశాలపై గంటల తరబడి సమీక్షలు చేయడంకాదు. ఫలితాలు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రతి పథకం కార్యచరణ దిశలో సాగాలని ఆయన జిల్లా కలెక్టర్లను అధికారులను నిర్దేశించారు. రాష్ట్ర సచివాలయంలో 8వ జిల్లా కలెక్టర్ల రెండు రోజుల సదస్సు సిఎం చంద్రబాబు అధ్యక్షతన ప్రారంభమైంది. గురువారం తొలిరోజు సమావేశంలో జిల్లా కలెక్టర్లకు, అధికారులకు వివిధ అంశాలపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ప్రజా సేవకులుగా ఉందాం... ఇగోలు వద్దు అంటూ కలెక్టర్లకు సూచించారు. గత సమావేశంలో నిర్ణయాలపై యాక్షన్ టేకెన్ రిపోర్టులు ఇక నుంచి తప్పనిసరి కావాలన్నారు. ఓనర్షిప్ తీసుకోగలిగితేనే లీడర్షిప్ ఇవ్వగలరంటూ అంటూ మంత్రులకు, అధికారులకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ "27 నెలల్లో అనేక వ్యవస్థాగత మార్పులుచేశాం. ఆ ఫలితాలు కనిపిస్తున్నాయి. 28 కొత్త పాలసీలతో అవకాశాలను అన్ లాక్ చేశాం. రియాక్టివ్ గవర్నెన్స్ నుంచి ప్రో యాక్టీవ్ గవర్నెన్స్‌కు వెళ్లాలి. ఫైల్ పెండింగ్ అంటే అభివృద్ధి పెండింగే. ఫిర్యాదు పెండింగ్ అంటే ప్రజలకు న్యాయం పెండింగ్. విజన్ ఉన్నా.. దాన్ని అమలు చేయకుంటే.. అవి నెరవేరని ఆశలుగానే మిగిలిపోతాయి. ఇప్పుడు కాలం మారింది... పనిచేస్తేనే సరిపోదు.. ఫేక్ ప్రచారాలకు కౌంటర్ కూడా ఇవ్వాలి. ఫేక్ ప్రచారం చేస్తుంటే లీడ్ తీసుకుని రియాక్ట్అవ్వాలి. ప్రభుత్వాన్ని మభ్యపెట్టే నివేదికలు వద్దు... వాస్తవాలు చెప్పాలి. రెండు రోజుల కలెక్టర్ల కాన్ఫరెన్స్ మొత్తంగా 12 గంటలు జరుగుతుంది... ఇది చాలా కీలకం. సమస్యను దాచిపెడితే పెద్దది అవుతుంది... ఓపెన్‌గా చర్చిస్తే పరిష్కారం లభిస్తుంది. సాధారణ పరిపాలన కాదు... ప్రజలు మెచ్చే సుపరిపాలన కావాలి. శాఖలు పోటీ పడాలి. జిల్లాలు పోటీ పడాలి. సెక్రటరీలు పోటీ పడాలి, కలెక్టర్లు పోటీ పడాలి. బెస్ట్ ప్రాక్టీసెస్ షేర్ చేసుకుందాం...బెస్ట్ పాలసీలు అమలు చేద్దాం. వన్ స్టేట్.. వన్ విజన్.. వన్ టీమ్.. వన్ మిషన్... అదే స్వర్ణాంధ్ర" అని ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు.

**టీమ్ సక్సెస్‌తోనే అభివృద్ధి:**
"ఈసారి లీడర్షిప్ అంశంపై కలెక్టర్ల సదస్సులో ప్రత్యేకంగా చర్చించాలి. కొన్ని చోట్ల లీడర్షిప్ లోపం ఉంది. ఉద్యోగుల సామర్థ్యం పెంపు కోసం వివిధ కోర్సులు కూడా నిర్వహి >>2



సదస్సులో పాల్గొన్న కలెక్టర్లు, సెక్రటరీలు, అధికారులు



## స్పేస్ సెంటర్ ఏర్పాటు లక్ష్యం!

● 2035లో భారత్ కల నెరవేరుతుంది ● 2040లో చంద్రుడిపైకి భారతీయుడు ● చంద్రయాన్3తో చరిత్ర సృష్టించాం ● ప్రధానమంత్రి నరేంద్రమోడీ స్పష్టీకరణ ● పారిస్ ఇంటర్నేషనల్ స్పేస్ సమ్మిట్‌లో మోడీ వర్చువల్ ప్రసంగం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 10:** భారత్ అంతరిక్ష రంగంలో మరో కీలకమైలురాయిని చేరుకునే దిశగా అడుగులు వేస్తోం దని ప్రధాని మోడీ తెలిపారు. పారిస్‌లో జరుగుతున్న ఇంటర్నేషనల్ స్పేస్ సమ్మిట్‌లో విడియో కాన్ఫరెన్స్ ద్వారా మోడీ కీలక ప్రసంగంచేశారు. 2035నాటికి భారతీయ అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నా మని, అలాగే 2040 నాటికి ఒక భారతీయుడిని చంద్రుడిపైకి పంపాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు.

**చంద్రయాన్-3తో చరిత్ర సృష్టించిన భారత్**
భారత అంతరిక్ష ప్రయాణంలో సాధించిన విజయాలను ప్రధాని మోడీ ప్రస్తావించారు. చంద్రయాన్-3 మిషన్ ద్వారా చంద్రుడి దక్షిణ ధ్రువప్రాంతానికి సమీపంలో సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన తొలి దేశంగా భారత్ చరిత్ర సృష్టించిందన్నారు. అలాగే ఆదిత్య ఎల్1 మిషన్ ద్వారా సూర్యుడి రహస్యాలను తెలుసుకునే దిశగా కీలక పరిశోధనలు జరుగుతున్నాయని చెప్పారు. గత యేడాది ఒక భారతీయుడు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని సందర్శించిన విషయాన్ని కూడా మోడీ గుర్తుచేశారు. భవిష్యత్ అంతరిక్ష ప్రణాళికలను వెల్లడిస్తూ ప్రధాని మోడీ కీలక ప్రకటన చేశారు. 2035 నాటికి భారత అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, 2040 నాటికి ఒక భారతీయుడిని చంద్రుడిపైకి పంపేందుకు కృషి చేస్తున్నామని >>2

## రాలని చినుకు... రైతుకు లేదు కునుకు!

వర్షాభావంతో వెలవెలబోతున్న పల్లెలు

ఎండిపోతున్న పంటలు.. అడుగంటుతున్న భూగర్భ జలాలు

కూరగాయలు, ఆకుకూరల సాగుపైనా తీవ్ర ప్రభావం

పెరుగుతున్న నిత్యావసర ధరలతో సామాన్యుడిపై మరింత భారం



వర్షాభావంతో పొలంలోనే ఎండిపోయిన వేరుశనగ పంట

**కళ్యాణదుర్గం, సెప్టెంబరు 10 ప్రభాతవార్త:** కరవుకు కాణాచిగా పేరున్న కళ్యాణదుర్గం ప్రాంతాన్ని మరోసారి వర్షాభావ పరిస్థితులు వెంటాడుతున్నాయి. నైరుతి రుతుపవనాలకాలం గడుస్తున్నా ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో పల్లెల్లో వ్యవసాయ పరిస్థితులు ఆందోళనకరంగా మారాయి. పొలాల్లో పంటలు ఎండిపోతుండగా.. మరోవైపు బోరుబావుల్లో నీరు అడుగంటుతోంది. దీంతో రైతులు సాగుచేయాలా.. వద్దా అనే అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. వర్షాలు కురుస్తాయనే ఆశతో వేరుశెనగ విత్తనాలు వేసిన రైతులకు కూడా ఈసారి నిరాశే ఎదురవుతోంది. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం వ్యవసాయ డివిజన్ పరిధిలో సుమారు 1.84 లక్షల ఎకరాల సాగు భూమి ఉండగా, అందులో వేరుశెనగ సాధారణ సాగు విస్తీర్ణం 1,16,470 ఎకరాలు. అయితే ఈ యేడాది ఇప్పటివరకు కేవలం 35,165 ఎకరాల్లోనే వేరుశెనగ సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎల్లప్ప వెల్లడించారు. అంటే సాధారణ వేరుశెనగ విస్తీర్ణంలో సుమారు 70శాతానికి పైగా భూమి సాగుకు దూరంగా ఉండిపోయింది. వేరుశెనగకు ప్రత్యామ్నాయంగా కంది పంటపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. సాధారణంగా 15,237 ఎకరాల్లో సాగయ్యే కంది ఈసారి 30, 837 ఎకరాల్లో సాగు చేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే వర్షాభావం కారణంగా కందిపంటకు కూడా >>2

## ప్రపంచ పర్యాటక గమ్యస్థానంగా ఏపి

టూర్ ఆపరేటర్లే టూరిజానికి అసలైన స్తంభాలు

గోదావరి పుష్కరాలకు ఏడు ప్రత్యేక సర్క్యూట్లు

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

పర్యాటక ప్రాంతాలకు విమాన అనుసంధానాన్ని మరింత బలోపేతం చేస్తున్నాం: కేంద్ర మంత్రి రామ్మోహన్

విశాఖలో ఐఎటిఓ వార్షిక సదస్సు ప్రారంభం



గురువారం విశాఖలో నిర్వహించిన ఐఎటిఒ సదస్సులో అధ్యక్షుడికి మెమెంటో అందజేస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్రమంత్రి కందుల దుర్గేష్

**విశాఖపట్నం, సెప్టెంబరు 10 ప్రభాతవార్త:** భారత దేశ పర్యాటకచిత్రపటంలో ఆంధ్రప్రదేశ్‌ను అత్యంత కీలకమైన పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీమంత్రి కందుల దుర్గేష్అన్నారు. విశాఖలోని నోవాటెల్ హోటల్‌లో గురువారం సాయంత్రం 41వ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ (ఐఎటిఒ) వార్షిక సదస్సు ఘనంగా ప్రారంభమైంది. 'ఇండియా-ది వరల్డ్స్ నెక్స్ట్ టూరిజం ఆపర్చునిటీ' థీమ్‌తో నిర్వహిస్తున్న ఈ సదస్సుకు మంత్రి కందుల దుర్గేష్, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు >>2

## కర్నూలు జిల్లాలో భూప్రకంపనలు

ఆదోని పరిసర ప్రాంతాల్లో తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 3.6గా నమోదు

భయంతో ఇళ్లల్లో నుంచి వీధుల్లోకి పరుగులు తీసిన ప్రజలు

**ఆదోని, సెప్టెంబరు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** కర్నూలు జిల్లా పరిధిలో గురువారం రాత్రి స్వల్ప భూకంపం సంభవించింది. జాతీయ భూకంప శాస్త్ర కేంద్రం నివేదిక ప్రకారం, రాత్రి సుమారు 7:50 గంటల సమయంలో భూమి కంపించింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 3.6గా నమోదు కాగా, భూకంప కేంద్రం భూమికి 8 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ ప్రకంపనల ప్రభావం ఆదోని పట్టణంతో పాటు పలు గ్రామీణ ప్రాంతాల్లో స్పష్టంగా కనిపించింది. ఆదోనిలోని ఎస్కెడి కాలనీ, కార్బన్‌పేట, ఎంఐజీ కాలనీ, ఆర్ట్స్ కాలేజ్ పరిసరాలు, అలాగే సమీపంలోని సదాపురం, ధనాపురం, నారాయణపురం, చాగి, హనుమాన్ తదితర ప్రాంతాల్లో ఒక్కసారిగా భూమి కంపించడంతో ఇళ్లలోని వస్తువులు కదిలిపోయాయి.

తీవ్ర భయాందోళనకు గురైన స్థానికులు, ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఇళ్ల నుంచి >>2

## పని పూర్తయి, ప్రజలకు ఫలితం అందే వరకూ పర్యవేక్షణ ఉండాలి



పిఠాపురం ప్రగతిపై డి.సిఎం పవన్ సమీక్ష

నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశాలు

**విజయవాడ, సెప్టెంబరు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** పిఠాపురం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేకదృష్టి సారించారు. నియోజకవర్గవ్యాప్తంగా చేపట్టిన వివిధ అభివృద్ధి, మౌలిక వసతుల పనుల స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేరళంలో చికిత్స పొందుతున్న పవన్‌కల్యాణ్ అక్కడి నుంచి >>2

## చిత్తూరు జిల్లాలో విషాదం కుప్పకూలిన నిర్మాణంలో ఉన్న చర్చి

ముగ్గురు కూలీలు మృతి, ఆరుగురికి గాయాలు

**చిత్తూరు, సెప్టెంబరు 10 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా గుడిపాల మండలం మండికృష్ణాపురం హరిజనవాడకు సమీపంలో తమిళనాడుకు సరిహద్దులోని కాట్పాడి కెకె నగర్‌లో గురువారం నిర్మాణంలో వున్న చర్చి ఒక్కసారిగా కూలిపోవడంతో తీవ్రవిషాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురు మేస్త్రీలు మృతి చెందగా మరో ఆరుగురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలో తమిళనాడుకు చెందిన జాన్, శామ్యూల్, ఇమాన్యుల్‌లు మృతిచెందినట్లు పోలీసులు నిర్ధారించారు. వివరాలిలా వున్నాయి. గుడిపాల మండల సరిహద్దులో తమిళనాడు కాట్పాడి కెకె నగర్‌లో డేవిడ్ అను మేస్త్రీ 48 మంది కూలీలతో ఒక చర్చి నిర్మాణం చేపడుతున్నారు. ఈ చర్చి నిర్మాణంకు సంబంధించి కీలకమైనమోల్డింగ్ వేయడం గురువారం చేపట్టారు. గురువారం >>2

11-9pg4:11-9pg4.qxd 9/11/2026 12:07 AM Page 1



మనుషుల్ని యథాతథంగా అంగీకరించాలి. ఫలానా రకంగా ఉంటేనే అంగీకరించాలి అనేలా ఉండకూడదు.

న- ఫ్రాంజ్ స్క్యూబర్ట్

# సన్నగిల్లుతున్న శిక్షల భయం!


కులం,మత, వర్గ, లింగ, బేధాలు లేకుండా అందరికీ సమానంగా వర్తించే విధంగా మన పెద్దలు శాసనాలను రూపొందించారు. అవి నిస్పక్షపాతంగా అమలు చేస్తారని ఆశించారు. కానీ అమలు చేయాల్సిన కొందరు అధికారుల రాజకీయ ఒత్తిడుల లొంగో, లేదా దక్షిణలకు ప్రలోభపడో చట్టాన్ని తమకు అనుకూలంగా మలుకుంటారని రాజ్యాంగ నిర్మాతలు ఊహించలేకపోయారేమోననిపిస్తున్నది. ఫలితంగా వందలాది కరుడుగట్టిన నేరస్తులు ప్రజలను వంచించి కోట్లాది రూపాయలు దోచుకుంటూ తప్పించుకోగలుగుతున్నారు. ప్రధానంగా వైట్ కాలర్ నేరాలు అంతకంతకు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తున్నది. సమర్థవంతంగా దర్యాప్తు జరిపి పటిష్టంగా రికార్డులు తయారు చేసి అవసరమైన సాక్ష్యాలను కోర్టు ముందు నిలబెట్టి నేరాలను రుజువు చేయడంలో విఫలమవుతున్నారు. కొన్నిసార్లు పరిస్థితుల ప్రభావం వల్ల దర్యాప్తు సక్రమంగా ముందుకు నడవకపోతే మరికొన్ని సందర్భాల్లో అధికారులే కేసులు వీగిపోయేలా రికార్డులు తయారు చేస్తున్నారనే ఆరోపణలు ఎంతోకాలంగా వినిపిస్తున్నాయి. అయితే గతంలో కంటే ఇప్పుడు పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో శిక్షల శాతం కొంత పెరిగిన లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారు. ఇంకొన్ని సందర్భాల్లో అధికారులు సకల అవస్థలుపడి కోర్టులముందురుజువుకు సర్వం సిద్ధం చేసినప్పుడు కొందరు రాజకీయ నేతలే మోకాలొడ్డుతుండడంతో దర్యాప్తు చేసే అధికారుల్లో నిస్పృహ పెంచుతుంది. దీంతోపాటు ఊహాతీత పరిస్థితులకు అనుగుణంగా తయారు చేసిన సిఆర్‌పిసి, ఐపిసి నిబంధనలు కాలానుగుణంగా సవరించాలనే పోలీసు అధికారుల వాదన కూడా సమంజసమే. కేంద్రప్రభుత్వం ఇటీవల కొన్ని సంస్కరణలు చేసింది. మరికొన్నింటిని ప్రవేశపెట్టడంకు సిద్ధం చేస్తున్నది. అయితే ఈ విషయాన్ని అలా ఉంచితే ఉన్న నిబంధనలను, చట్టాలను ఏ మేరకు నిస్పక్షపాతంగా అమలు చేస్తున్నారన్నదే ప్రశ్న. ధనిక, పేద అని తేడాలు లేకుండా ఎంత దీక్షతో వ్యవహరించగలుగుతున్నారనేదే ముఖ్యం. ఏ అండలేని నిరుపేదలు పోలీసుస్టేషన్‌కు వస్తే ఎలా వ్యవహరిస్తున్నారో ప్రత్యేకంగా చర్చించాల్సిన అవసరం లేదు. దేశంలో బోగస్ ఫైనాన్స్ కంపెనీలు పెట్టి కోట్లాది మంది అమాయకుల కష్టార్జితాన్ని కోట్లల్లో కొల్లగొట్టి బోర్డులు తిప్పేస్తే జీవితాలను సంపాదించుకున్న డబ్బు పోగొట్టుకొని న్యాయం చేసేవారు లేక బాధితులు వేదన అరణ్య రోదనగా మారి కొందరు ఆత్మహత్య చేసుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో గత పదేళ్లలో దాదాపు యాభై, అరవై కోట్ల రూపాయాలకుపైగాఫైనాన్స్ కంపెనీలు ప్రజలను మోసం చేసి దోచుకున్నట్లు అనధికార లెక్కలు వెల్లడిస్తున్నాయి. ఇందులో కొన్ని మాత్రమే పోలీసుల దృష్టికి వస్తున్నాయి. రికార్డ్ మాట ఎలా ఉన్నా నిందితుల్లో పది శాతం మందిపైకూడాపటిష్టమైన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఐదేపది లక్షలు మొదలు రెండువందల యాభై కోట్లవరకు మోసం చేసిన ఫైనాన్స్ కంపెనీలు యజమానులపై చర్యలుతీసుకోవడంలో నిందితులను పట్టుకొని బాధితులకు న్యాయం చేయడంలో విఫలమవుతున్నారనే ఆరోపణలను కొట్టివేయలేం. రోజురోజుకు గ్రామస్థాయిలో కూడా చీటీలు పెట్టడం, కోట్లాది రూపాయలు కూడబెట్టుకొని తెల్లవారేసరికి బోర్డులు తిప్పేస్తున్నారు. ఇక ఐక్షర్లలాలు, కాల్‌మొంట్ల ఆమ్మకాల్లో ఘరానా మోసం చేసిన పెద్దలెందరో నిర్భయంగా తిరుగుతున్నారు. అందుకే ఒకరిని చూసి ఒకరు పోటీ పడి ప్రజలను మోసం చేసి కోటీశ్వరులు అవుతున్నారు. ఈ విషయంలో బాధితులు కొందరు పోలీసు స్టేషనుకు వెళ్లితే న్యాయం సంగతి ఎలాఉన్నా కేసు నమోదు చేసికోవడానికి ఇష్టపడడం లేదు. మమ్మల్ని అడిగి ఇచ్చావా? ఇచ్చేటప్పుడు తెలిసి లేదా? లాభం వస్తే మా వద్దకు వచ్చేవాడివా?అంటూ మళ్లీ పోలీసుస్టేషన్ మెట్లెక్కకుండా చేసి పంపుతున్నారు. అంతేకాదు కొన్ని సందర్భాల్లో ఇది పూర్తిగా సివిల్ తగాదా అని జోక్యం చేసుకోవడానికి వీల్లేదని కోర్టుకువెళ్లి కేసులుపెట్టి వసూలు చేసుకొమనిసలహా ఇస్తున్నారు. ఒకవేళ ఏదైనా కారణాలతో కేసు నమోదు చేయాల్సి వస్తే సాక్ష్యాధారాలున్నాయా? లేవా? రికార్డులు, రసీదులు అన్నీ పరిశీలించి సంతృప్తి చెందితేనే కేసు నమోదు చేసే దర్యాప్తు చేపడుతున్నారు. ఇలాంటి ఫిర్యాదులన్నీ నమోదు చేస్తే పోలీసులు వేరే పని చేయలేరనే వాదనను తోసిపుచ్చలేం. పెరిగిన నేరాలతోపాటు పోలీసుల బాధ్యతలు కూడా పెరిగిపోయాయనడంలో ఎంత మా లేదు. ముఖ్యంగా వివిధ బందోబస్తుల్లో ఎక్కువ సమయం గడుపుతున్నారు. ఆయా ప్రాంతాల్లో దోపిడీలు జరుగుతున్నా, అరాచక శక్తులు విజృంభించడంతో శాంతి భద్రతలు క్షీణించినా సర్వాలేద కాని, ఒక్క వివిఐపి పర్యటనలో ఏమాత్రం పొరపాటు జరిగినా తమ ఉద్యోగానికే ముప్పు తప్పదన్న భావనతో ప్రజాసమస్యలను విస్మరించి నేతల వైపు మొగ్గుచూపుతున్నారు. అందుకే సాధ్యమైనంతవరకు ఇలాంటి ఫిర్యాదులను నమోదు చేసుకోవడానికి ఇష్టపడడంలేదు. నేరగాళ్లలో పోలీసులన్న భయభక్తులు సన్నగిల్లిపోతున్నాయి. నిరుద్యోగులను మోసం చేసే దళారులు ఎక్కువైపోతున్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని లక్షలాది రూపాయలు వసూలు చేసుకుంటూ పరారు అవుతున్న దగాకోరులు పెరిగిపోతున్నారు. మానవజాతికి ముప్పుగా పరిణమిస్తున్న మాదకద్రవ్యాల వ్యాపారం,వినియోగం కేసుల్లో అధికశాతం వీగిపోయి నిందితులబయట పడి మళ్లీ మళ్లీ అదే వ్యాపారంలో కొనసాగుతున్నారు. ఒకటని కాదు ఎన్నో నేరాలకు సంబంధించిన కేసుల్లో వీగిపోవడానికి కారణాలేమిటో, కారకులెవరో సమగ్రంగా పరిశీలించి నిర్దిష్టమైన చర్యలు చేపట్టాలి.

ప్రపంచం మొత్తం మన నుండి తొలగిపోయినప్పుడు, మన ప్రపంచంలోకి అడుగుపెట్టినవాడే నిజమైన మిత్రుడు.



నేతాజీ

గొప్ప మేధ నలుగురు నడిచిన దారిలో నడవదు. అది ఇంతవరకూ అవిష్కరించని మార్గాలను అన్వేషిస్తుంది.



అబ్రహాంలింకన్

## ప్రజావాక్కు



### హక్కుల రక్షణతోనే ఆదివాసీల అభివృద్ధి

భారత రాజ్యాంగం పూచీపడిన మేరకు ఆదివాసీలకు ప్రత్యేక రక్షణలు, హక్కులు చట్టాల రూపంలో అమలౌతున్నాయి.వాటి అమలుపై ప్రభుత్వం చిత్తశుద్ధి చూపడం ద్వారానే వారి ప్రగతి సాధ్యం. అయితే ఆ చట్టాల స్ఫూర్తి ఏమిటన్నది చూడాల్సిన ప్రభుత్వం, బదులుగా అందులో తనబాధ్యత తప్పించుకోగల మార్గాలేమిటన్నవి వెతుకుతూ ఉంటే మాత్రం కష్టం. దేశంలో ఆదివాసీ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు మందగించడానికి ఏకైక కారణం అక్కడి చట్టాలే అని ఒక దురభిప్రాయం. అటవీ హక్కుల చట్టం నిబంధనల మేరకు ఒక ప్రాజెక్ట్ కోసం భూమిని సేకరించాల్సి వస్తే, ఆ ప్రాజెక్ట్ పరిధిలోని అన్ని గ్రామాలగ్రామసభలూ అంగీకరించాలి.ఈమధ్య పార్లమెంటరీ కమిటీ ఒకసూచన చేసింది.అలాంటి స్థితిలో వందకి 75శాతం గ్రామసభలు సరేనంటేసరిపోతుంది. అందరూ అక్కర్లేదని. ఈ విషయమై కేంద్ర గిరిజన శాఖని కేంద్ర విద్యుత్‌శాఖ వివరణ కోరగా గ్రామసభల నుండి నిరభ్యంతర పత్రాలు తీసుకోవాలనే ఎలాంటి నిబంధనా లేదు.

- డా.డి.వి.జి.శంకరరావు, విజయనగరం

### ఏసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పిచ్చి ఆలోచన

ఈ రోజు ముఖ్యమంత్రి చంద్రబాబు గారు కోనసీమ సభలో మాట్లాడుతూ మహిళలకు ఏసీ బస్సులలో ఉచిత ప్రయాణం' అన్నారు.. ఎవరి సొమ్ము...అసలు మహిళలకు ఫ్రీ బస్ కాకుండా ఛార్జీలో 50శాతం రాయితీ ఇస్తే బాగుండేది. అవసరం ఉన్నవాళ్లు ప్రయాణం చేస్తారు. ఇప్పుడు నేరుగా ఏసీ బస్సులు? పిచ్చి ఆలోచన. ఫ్రీ బస్సు వలన పనిలేకపోయినా మహిళలు ప్రయాణం చేస్తున్నారు. ఇదంతా ఎవరు భరించాలి?పైగా ఏసీ బస్సులా! గతంలో లాగాపురుషులు బస్సులు ఎక్కలేకపోతున్నారు. పల్లె వెలుగు బస్సులు వేకుజామున నాలుగు గంటలకే ఫుల్ రష్ అవుతున్నాయి. సూపర్ లగ్జరీ బస్సులో పోవాలంటే చాలా ఎక్కువ ఛార్జీ.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### ఆడంబరాలకు పోవద్దు

మధ్యతరగతి జీవితంలో ఒక్కొక్కసారి విపత్కర పరిస్థితులు ఎదురుకావచ్చు.జీవితంలో పక్కవాళ్లతో పోల్చుకొని ఆడంబరాలకు పోవద్దు. వాళ్లఆర్థిక పరిస్థితుల ఆధారంగా వాళ్ళు జీవించవచ్చు. మన ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా మనం ముందుకుసాగాలి కాని ఆడంబరాలకు పోవద్దు.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం అవసరం

భారత అంతరిక్ష రంగంవేగంగా కొత్తదశలోకి అడుగుపెడుతోంది. ప్రైవేటు రంగానికి మరిన్ని అవకాశాలు కల్పించడం ద్వారా పెట్టుబడులు, సాంకేతిక ఆవిష్కరణలు, పరిశోధన, ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశంఉంది.అయితే ఈ మార్పు దేశ అంతరిక్ష కార్యక్రమాన్ని దశాబ్దాలుగా నిర్మించిన శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సిబ్బందిలో అనిశ్చితికి దారితీయకుండా స్పష్టమైన విధాన సమాచారంతో ముందుకు సాగాలి.భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ సాధించిన విజయాల వెనుక దశాబ్దాల ప్రజాపెట్టుబడి,శాస్త్రీయనైపుణ్యం,సంస్థాగత అనుభవం ఉన్నాయి. అందువల్ల ప్రైవేటు రంగం విస్తరణను ప్రభుత్వ రంగానికి ప్రత్యామ్నాయంగా కాకుండా,దేశఅంతరిక్ష సామర్థ్యాన్ని విస్తరించే భాగస్వామ్యంగా చూడాలి. ప్రైవేటు సంస్థల ప్రవేశంతో ప్రయోగ వాహనాల తయారీ,ఉపగ్రహ నిర్మాణం, అంతరిక్ష ఆధారిత సేవలు వంటి రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడవచ్చు. అయితే సంస్థ భవిష్యత్ బాధ్యతలు, ప్రభుత్వ రంగ సంస్థల పాత్ర, ప్రైవేటు సంస్థలతో బాధ్యతల విభజన, ఉద్యోగుల భవిష్యత్ అవకాశాలపై స్పష్టత అవసరం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### నిజమైన పూజ

మనలోని అహంకారం, కోపం, అసూయవంటి చెడు గుణాలను దేవుని పాదాల చెంత వదిలేసి,నిర్మలమైన మనస్సుతో ఉండటమే నిజమైనభక్తి. పూజచేయడం ద్వారా మన మనస్సు చెల్లాచెదురు కాకుండా ఒకే అంశంపై లగ్నం అవుతుంది. ఇది మానసిక ప్రశాంతతను, క్రమశిక్షణను పెంచుతుంది. కేవలం దేవుడి ముందు కూర్చుంటేనే పూజకాదు. ఎదుటి వారిని గౌరవించడం, మూగజీవుల పట్ల దయచూపడం, ప్రకృతిని కాపాడటం కూడా పూజతో సమానమే!అలా కాకుండా మన సంతా విషం నింపుకొని ఎన్నిపూజలు చేసినా వృధానే. భగవంతుడిని హృదయంలో నింపుకొని పూజించాలి. అంతేకాని తమ కోరికలు నెరవేరాలని ఆడంబరం చేయకూడదు.

- కాయల నాగేంద్ర, హైదరాబాద్

### కొత్త మార్కెట్ల వైపుగా అడుగులు వేయాలి

సెప్టెంబర్ రెండోవారంలో ఢిల్లీలో జరగబోయే సదస్సు పలు విధాలుగా ప్రత్యేకమైంది. మనకున్న భౌగోళిక ప్రాధాన్యత, వ్యూహాత్మక పరిణామాలవల్ల భారత్ విదేశాంగ విధానం అవలంబిస్తుంది.అలాగే ఫ్రీ ట్రేడ్‌దిశగా అన్ని దేశాలతో సాయోధ్య కుదిరేలా చూడాలి. బ్రిక్స్ విస్తరణ దిశలో ఉన్న నేపథ్యంలో చిన్న దేశాలు లేక ఆఫ్రికా దేశాలకు మన నిపుణులను పంపి కొత్త మార్కెట్స్ వైపుగా అడుగులు వేయాలి.

- భారత అవినాష్, జనగామ

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# చుట్టూ పర్యావరణ దీపాలు వెలిగిద్దాం

**వాతావరణ మార్పులు పెనుభూతమై ప్రపంచాన్ని వణికిస్తున్న నేటి తరుణంలో అడవుల సంరక్షణ మానవ మనుగడకు జీవన్మరణ సమస్యగా మారింది. అడవిని కాపాడటం అనేది అటవీశాఖ అధికారుల బాధ్యత మాత్రమే కాదని, ఈ నేలపై జన్మించిన ప్రతి పౌరుడి పవిత్ర ధర్మమని సమాజం గుర్తించాలి. మనఇంటి ప్రాంగణంలో నాటే ప్రతి మొక్క, కాపాడే ప్రతి వృక్షం, నిలిపే ప్రతి నీటిబొట్టు ప్రకృతి సమ తుల్యతకు తోడ్పడతాయి. అమృతాదేవి, 363 మంది బిష్ణోయీ వీరులు తమప్రాణాలను పణంగా పెట్టి వెలిగించిన పర్యావరణ దీపం తరతరాలగుండెల్లో నిరంతరం ప్రజ్వరిల్లాలి.**



రామ కిష్టయ్య సంగన భట్ల

వృక్షో రక్షతి రక్షి తః' అన్నది కేవలం ఒక సూక్తి కాదు మానవాళి మనుగడకు ప్రాణాధారమైన పర్యా వరణ వేదవాక్యం. మన సంస్కృతి లో చెట్టు ఒక దేవత, అడవి ఒక జీవధాత్రి, ప్రకృతి ఒక పరమేశ్వరుడి ప్రతిరూపం.అరణ్యాలు లేనిదేమానవ జాతికి ఉనికి లేదు. భారతదేశం ప్రకృతి ప్రసాదించిన అపారమైన అరణ్య సంపదతో, అనన్యమైన జీవ వైవిధ్యంతో, సహ్యాద్రి, వింధ్య, హిమాలయ పర్వత సాను వుల నుంచి నదీ పరీవాహక ప్రాంతాల వరకు పచ్చని చీర కట్టిన పుణ్యభూమిగా ప్రపంచ పటంలో విలసిల్లుతోంది. అడవి అంటే కేవలం నిశ్శబ్దంగా నిలబడే వృక్షాల సముదా యం మాత్రమే కాదు, సమస్త ప్రాణికోటికి ప్రాణవాయువు ను అందించే ఊపిరితిత్తులు, నేలకు జీవం పోసి ఎడారీక రణను నిలువరించే రక్షాకవచం, నదీనదాలకు జన్మనిచ్చే జలభాండాగారం, కోట్ల సంఖ్యలోని జీవరాశులకు మాతృ సమానమైన ఆశ్రయం. అలాంటి ప్రకృతి వరప్రసాదాన్ని, అపురూపమైన వన్యప్రాణులను, అమూల్యమైన అటవీ సంపదను కాపాడే పవిత్ర యజ్ఞంలో తమ రక్తమాంసాలను ధారపోసి, ప్రాణాలనే మూల్యంగా చెల్లించిన అటవీయోధుల నిరుపమాన త్యాగాలను స్మరించుకునే మహత్తర సందర్భమే సెప్టెంబర్ 11న దేశమంతటా అత్యంత భక్తిప్రపత్తులతో నిర్వహించుకునే జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం. ఈ దినోత్సవం వెనుక ఉన్ననేపథ్యం సాధారణమైనదికాదు, అది మనిషికి, ప్రకృతికి మధ్య గల విడదీయరాని ఆత్మీయ బంధాన్ని లోకానికి చాటిచెప్పిన రక్తతర్పణ గాథ. దాదాపు మూడు శతాబ్దాల క్రితం, 1730 సెప్టెంబర్ 11న రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ సమీపానగల ఖేజర్లీ అనే పల్లెసీమలో జరిగిన మహోజ్వల ఘట్టం భారత పర్యావరణ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడింది. అప్పటి మార్వార్ సంస్థాన పాలకుడు మహారాజా అభయ్‌సింగ్ తన నూతన రాజప్రాసాద నిర్మాణంలో సున్నం కాల్చడానికి కలప అవసరమై, సైనికులను పచ్చని చెట్లను నరికి తీసుకురమ్మని ఆదేశించాడు. సైనికుల గొడ్డళ్లు ఖేజర్లీ గ్రామంలోని పవిత్రమైన ఖేజ్రీ (జమ్మి) చెట్లవైపు దూసుకొచ్చాయి. ప్రకృతిని ప్రాణసమానంగా ఆరాధించే బిష్ణోయీ సమాజానికి ఆ చెట్లను నరకడం దేవాలయ విధ్వంసంతో సమానం. ఆ విషమ ఘడియల్లో అమృతాదేవి అనే సాహస వనిత శిరస్సు తెగిపడినా సరే, ఒక్క చెట్టు ప్రాణమైనా దక్కితే అది చౌకైన బేరమే" (సిర్ సాంటే రూఖ్ రహేతో భీ సస్తో జాణ్) అంటూ గొడ్డలి వేటుకు ఎదురొడ్డి వృక్షాన్ని తన గుండెలకు హత్తుకుంది. క్రూరమైన సైనికుల గొడ్డలి ఆమె ప్రాణాలను బలిగొన్నప్పటికీ, ఆ త్యాగజ్వాల చల్లారలేదు. ఆమె వెంటే ఆమె ముగ్గురు కుమార్తెలు, వారిని చూసి గ్రామానికి చెందిన బిష్ణోయీ వీరులు ఒక్కొక్కరుగా పచ్చని చెట్లను తమ శరీరాలతో కౌగిలించుకుని రక్షణ కవచాలుగా నిలిచారు. అలా 363 మంది అమాయక అమరజీవులు మూగచెట్ల పరిరక్షణ కోసం తమ నిండు ప్రాణాలను నవ్వుతూ తృణప్రాయంగా అర్పించారు. ఒక చెట్టు కోసం వందలాది మానవ దేహాలు నేలకొరిగిన ఈ అపూర్వ త్యాగమే తర్వాతి కాలంలో సుందర్‌లాల్ బహుగుణ, చండీప్రసాద్ భట్ వంటి మహనీయుల నేతృత్వంలో సాగిన ప్రఖ్యాత చిప్కో ఉద్యమానికి మూలస్తంభంగా, అంతర్జాతీయ పర్యావరణ పోరాటాలకు ఆద్యంగా



నిలిచింది. ఖేజర్లీ వీరుల బలిదానానికి గుర్తుగా సెప్టెంబర్ 11ను జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవంగా అధికారికంగా పరిగణించడం వెనుక సరైన చారిత్రక స్పష్టత అవసరం. చాలాచోట్ల ఈ దినోత్సవాన్ని కేంద్రప్రభుత్వం 2001 నుంచే అమలులోకి తెచ్చిందన్న ప్రచారం ఉన్నప్పటికీ, భారత ప్రభుత్వ పర్యావరణ, అటవీ,వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ 2013 మే 7న జారీ చేసిన అధికారికగెజిట్ నోటిఫికేషన్ ద్వారానే సెప్టెంబర్ 11ను జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవంగా అధికారికంగా ప్రకటిస్తూ ఉత్తర్వు ఇచ్చింది. దేశవ్యాప్తంగా దుర్భరమైన అటవీ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తూ కలప దొంగలు, స్మగ్లర్లు, వేటగాళ్లు, నక్సలైట్లు, అడవి జంతువుల దాడుల్లో ప్రాణాలు కోల్పోతున్న అటవీ సిబ్బందికి జాతీయ స్థాయిలో అత్యున్నత గౌరవం కల్పించాలనే సమున్నత లక్ష ్యంతో ఈనిర్ణయం తీసుకున్నారు. డెహ్రాడూన్‌లోని ప్రఖ్యాత అటవీ పరిశోధనా సంస్థ (ఎఫ్.ఆర్.ఐ) ప్రాంగణంలోని ఫారెస్టర్ మెమోరియల్ వద్ద ప్రతి ఏటా అమరవీరుల శిలాఫలకం ముందు రక్షణ దళాల మాదిరిగానే గాల్లోకి కాల్పులుజరిపి గౌరవ వందనంసమర్పించడం ఒక పవిత్ర సంప్రదాయంగా వస్తోంది. సరిహద్దుల్లో శత్రువుల నుంచి దేశాన్ని కాపాడే సైనికుడి త్యాగం ఎంతటి పవిత్రమైనదో, దేశ అంతర్గత సహజ సంపదను, భవిష్యత్ తరాల ప్రాణవాయువును కాపాడేందుకు రాత్రింబవళ్లుశ్రమించే ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, సెక్షన్ ఆఫీసర్లు, రేంజర్లు,వాచర్లు చేసే ప్రాణార్పణ కూడా అంతే దేశభక్తి పూరితమైనది. నిప్పు లు చెరిగే దావానలాలు, విషసర్పాలు, క్రూరమృగాలు, ఏకే47 తుపాకులతో తిరిగే ఎర్రచందనం, టేకు స్మగ్లర్ల వంటి ముఠాలను కనీస ఆయుధాలు లేకుండానే ఒట్టి చేతులతో, లాఠీలతో ఎదుర్కొంటూ విధి నిర్వహణలో నెత్తురు చిందిస్తున్న అటవీ అమరుల త్యాగనిరతి అసాధారణమైనది.ప్రస్తుత ఆధునిక యుగంలో పర్యావరణ సంక్షోభం తీవ్రతరమవుతున్న వేళ అటవీ విస్తీర్ణ గణాంకాలను నిశితంగా విశ్లేషించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. భారత అటవీ సర్వే సంస్థ విడుదల చేసిన భారత అటవీ స్థితి నివేదిక 2023 ప్రకారం దేశంలో మొత్తం అటవీ కవచం,వృక్ష కవచం కలిపి దేశ భౌగోళిక విస్తీర్ణంలో 24శాతానికి పైగా నమోదైంది. ఇందులో కేవలం అటవీ కవచం సుమారు 21.76 శాతంగా విస్తరించి ఉండగా, చెట్ల కవచం మిగిలిన భాగాన్ని ఆక్రమిస్తోంది.గత నివేదికలతో పోల్చినప్పుడు దేశవ్యాప్తంగా అటవీ కవచంలో 156.41 చదరపు కిలోమీటర్లు, వృక్ష కవచంలో 1,289.40 చదరపు కిలోమీటర్ల మేర వృద్ధి నమోదై, మొత్తంగా 1,445.81 చదరపు కిలోమీటర్ల పెరుగుదల కనిపించినట్లు కేంద్ర నివేదికలు స్పష్టంచేస్తున్నాయి.అయితేజాతీయ అటవీ విధానం నిర్దేశించిన 33శాతం లక్ష్యాన్ని చేరుకోవడానికి మనం ఇంకా ఎంతో దూరం ప్రయాణించాల్సి ఉంది. కేవలం లెక్కల్లో విస్తీర్ణం పెరిగినంత మాత్రాన సంబరపడిపోతే సరిపోదు. ఆ పెరుగుదల పచ్చని సాంఘిక అడవుల రూపంలోనో లేదా వాణిజ్య తోటల రూపంలోనో కాకుండా, సహజ సిద్ధమైన దట్టమైన అరణ్యాల రూపంలోవిస్తరిస్తోందా లేదా అన్నదే ప్రాథమిక ప్రశ్న. సహజ అరణ్యాల్లో విలసిల్లే వృక్ష, లతా,గుల్మ, పక్షి , జంతు, కీటక జాలాల సమతుల్య త ఏకజాతి వృక్ష పెంపకాల్లో లభించదు. స్థానిక వృక్షజాతు లను రక్షి స్తూ, అడవుల క్షీ ణతను అరికట్టి, అటవీ కారిడార్ల ను పునరుద్ధరించినప్పుడే నిజమైన పర్యావరణ భద్రతసాధ్యమవుతుంది. వాతావరణ మార్పులు పెనుభూతమై ప్రపంచాన్ని వణికిస్తున్న నేటి తరుణంలో అడవుల సంరక్షణ మానవ మనుగడకు జీవన్మరణ సమస్యగా మారింది.అడవిని కాపాడటం అనేది అటవీశాఖ అధికారుల బాధ్యత మాత్రమేకాదని, ఈ నేలపై జన్మించిన ప్రతి పౌరుడి పవిత్ర ధర్మమని సమాజం గుర్తించాలి. మనఇంటి ప్రాంగణంలో నాటే ప్రతిమొక్క, కాపాడే ప్రతి వృక్షం, నిలిపే ప్రతి నీటిబొట్టు ప్రకృతి సమ

# ప్రభుత్వ బడుల్లో ప్రమాణాలు పెరగాలి

డాక్టర్ మోటె చిరంజీవి

ప్రభుత్వ పాఠశాలలు పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాల్సిన ప్రధాన వేదికలు. కానీ నేడు అనేక ప్రభుత్వ బడులలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో వెలవెలబోతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఒకవైపు పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత, మరోవైపు ఉపాధ్యాయుల కొరత, ఇంకోవైపు ప్రైవేటు విద్యాసంస్థల ఆకర్షణ ఇవన్నీ ప్రభుత్వ విద్యావ్యవస్థకు సవాళ్లుగా మారాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోవడం ఆందోళన కలిగించే పరిణామం. కొన్ని చోట్ల తరగతి గదులు ఉన్నా విద్యార్థులు కనిపించని పరిస్థితి ఏర్పడుతోంది. పాఠశాలల్లో చేరికలు తగ్గడానికి కేవలం తల్లిదండ్రుల ప్రైవేటు విద్యపై మోజును కారణంగా చూపడం సరైంది కాదు. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన బోధన, ఇంగ్లిష్ మీడియం, డిజిటల్ విద్య, పరిశుభ్రమైన వాతావరణం, తాగునీరు, మరుగుదొడ్లు, క్రీడా సదుపాయాలు వంటి అంశాలపై తల్లిదండ్రుల్లో నమ్మకం పెంచాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి పలు కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ వాటి అమలులో వేగం, నాణ్యత కీలకం. పాఠశాల భవనాలు నిర్మించడం ఒక్కటే సరిపోదు. ప్రతి బడిలో విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించాలి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలల పరిస్థితిని అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షి ంచాలి.పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడటం అత్యంత





ప్రాధాన్యమైన అంశం. విద్యార్థుల సంఖ్య తగ్గుతున్న పాఠశాలలను మూసివేయ డం లేదా విలీనం చేయడం మాత్రమే పరిష్కారం కాదు. ఎందుకు విద్యార్థులు తగ్గుతున్నారు అనే ప్రశ్నకు సమా ధానం వెతకాలి. పాఠశాలపై తల్లిదండ్రులకు విశ్వాసం కల్పించాలి. స్థానిక ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రుల కమిటీలు,ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు కలిసి ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి చేయాలి. 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించిన కేంద్ర విద్యాశాఖ ఏకీకృత జిల్లా విద్యా సమాచార వ్యవస్థ ప్లస్ గణాంకాల ప్రకారం తెలంగాణలో 2,081 ప్రభుత్వ పాఠశాలల్లో జీరో ఎన్‌రోల్‌మెంట్ నమోదైంది. దేశవ్యాప్తంగా 5,149 ప్రభుత్వ పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా లేకపోగా,వాటిలో సుమారు 40 శాతం తెలంగాణలోనే ఉన్నాయి. నల్లగొండలో 315, మహబూబాబాద్‌లో 167, వరంగల్‌లో 135,రంగారెడ్డిలో 99,సూర్యాపేటలో 94,సిద్దిపేటలో 84,నాగర్‌కర్నూల్‌లో 81,ఇలా తెలంగాణలో జీరో ఎన్‌రోల్‌మెంట్ పాఠశాలలు 2,081వున్నాయి. ప్రభుత్వ విద్య బలపడితేనే సామాజిక సమానత్వం సాధ్యమవుతుంది. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల పిల్లలకు ప్రైవేటు విద్య భారంగా మారకుండా ప్రభుత్వ బడులే నాణ్యమైన ప్రత్యామ్నాయంగా నిలవాలి. అందుకు 'బడికి విద్యార్థి రావాలి'అనే లక్ష ్యంతోపాటుబడిపై తల్లిదండ్రులకు నమ్మకం రావాలి'అనేదిశలో ప్రభుత్వంచర్య లు చేపట్టాలి.ప్రభుత్వ పాఠశాల అనేది కేవలం ఒకభవనం కాదు,అదిసమాజ భవిష్యత్తును నిర్మించే పునాది.ఆ పునాది బలహీనపడితే దాని ప్రభావం రేపటి తరాలపైపడుతుంది. కాబట్టి

# బొగ్గు గ్యాసిఫికేషన్‌పై రైతుల అభ్యంతరాలు



రుద్రరాజు శ్రీనివాసరాజు

చింతలపూడి-రేచర్ల ప్రాంతంలో భూగర్భ బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుపై ఇప్పుడు జరుగుతున్న చర్చ కేవలం ఒక పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించిన విషయం కాదు. ఇది ఒక ప్రాంత భవిష్యత్తును నిర్ణయించే అంశంగా మారింది. ఒకవైపు దేశానికి ఇంధన భద్రత, పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి అవసరం. మరోవైపు తరతరాలుగా భూమిని నమ్ముకుని జీవిస్తున్న రైతులు, వారి భూముల్లో సాగవుతున్న పామ్ ఆయిల్ తోటలు, వాటిపై ఆధారపడి జీవిస్తున్న వేలాది మంది కార్మికులు, వ్యవసాయానికి ప్రాణాధారమైన భూగర్భ జలాలు ఉన్నాయి.ఈ నేపథ్యంలో రైతులు అధికారుల అవగాహన సదస్సులో వ్యక్తం చేస్తున్న ప్రధాన అభ్యంతరాలను నిర్లక్ష ్యం చేయడం సరికాదు. ఈ విషయంలో రైతుల ప్రశ్నలు చాలా సూటిగా ఉన్నాయి. మా భూముల్లో ప్రయోగం చేయడానికి ముందు, ప్రభుత్వానికి చెందిన భూముల్లో ప్రయోగాత్మకంగా గ్యాసిఫికేషన్ చేసి చూపండి. దాని వల్ల పర్యావరణానికి, భూగర్భ జలాలకు, జీవ వైవి ధ్యానికి హాని లేదని నిరూపించండి. ఆ తర్వాత మా భూముల గురించి మాట్లాడమని రైతులు డిమాండ్ చేస్తు న్నారు. ఇది అభివృద్ధిని పూర్తిగా తిరస్కరించే డిమాండ్‌గా చూడాలా? లేక శాస్త్రీయంగా పరీక్షి ంచదగిన, ప్రజల భయా లను నివృత్తి చేసే సహేతుకమైన సూచనగా చూడాలా? ఈ రెండింటిలో ఒక విషయం మాత్రం స్పష్టంగా ఉండాలి.ఈ ప్రాజెక్టును కేవలం ఒక ఊహగా కాకుండా, వాస్తవ విధాన ప్రక్రియలోకి వచ్చిన ప్రాజెక్టుగా చూడాలి. అయితే ఇప్పుడు అసలు చర్చ అనేది ప్రాజెక్టు ఉండాలా? వద్దా? అనే దాని కంటే,'ప్రాజెక్టును ఎలా అమలు చేయాలి? ఎవరి భద్రతకు ఏ హామీలు ఉండాలి? ప్రమాదాలను ముందుగానే ఎలా నిరూపణాత్మకంగా పరీక్షి ంచాలి?' అనే దిశగా సాగాలి.ఈ ప్రాజెక్ట్ ద్వారా భూమిని కోల్పోయే రైతుకు ఇచ్చే నష్టపరిహా రం కేవలం భూమి మార్కెట్ విలువతో ముగిసిపోదు.ఒక రైతుకు భూమి అంటే ఆస్తి, ఉపాధి, కుటుంబ తరాలకు వారసత్వం, సామాజిక గుర్తింపుగా చూడాలి. ప్రత్యేకించి చింతలపూడి రేచర్ల ప్రాంతంలో పామ్ ఆయిల్ వంటి దీర్ఘకాలిక పంటల సాగు ఎక్కువగా ఉండటం వలన ఈ సమస్య మరింత సంక్లిష్టమవుతుంది. ఒక పామ్ ఆయిల్ తోటను తొలగించి, రైతుకు నగదు పరిహారం ఇచ్చి, మరో చోట భూమి కొనుగోలు చేసుకోండి అని చెప్పడంకూడా అంత సులభంకాదు. మరోచోట అదే పరిమాణంలో, అదే నాణ్యత కలిగిన, నీటి వసతిఉన్న భూమి దొరుకుతుందనే నమ్మకం లేదు. అది దొరికినా అదే సామాజిక వాతావరణం, అదే మార్కెట్, అదే రవాణా సౌకర్యం, అదే జీవన విధానం లభిస్తాయనే గ్యారంటీ లేదు. ఇవన్నీ పరిహారంలో లెక్కించాల్సిన అంశాలే. దీనితోపాటు ఈ ప్రాజెక్ట్ వలన రైతులు మాత్రమే కాదు రైతు కూలీలు రవాణా కార్మికులు,



చిన్న వ్యాపారులు, ఎరువులు, పురుగుమందుల వ్యాపారులు, వ్యవసాయ యంత్రాల నిర్వాహకులు కూడా బాధితులు కావచ్చు. అందువల్ల రైతుల భూమి స్వాధీనం ప్రభావం, భూమి యజమానుల సంఖ్యతో లెక్కించడం ఖచ్చితంగా తప్పే అవుతుంది. ఈ ప్రాజెక్ట్ వలన ప్రభావిత కుటుంబాల సంఖ్య కంటే చాలా ఎక్కువగానే ఉండవచ్చు. 'రైతులు ఈ ప్రాజెక్టు ఎప్పటికీ వద్దు'అనడం లేదు.ప్రభుత్వ భూమిలో ముందుగా ప్రయోగం చేయండి' అనే డిమాండ్‌లోని శాస్త్రీయతతో కూడిన డిమాండ్ చేస్తున్నారు. ప్రపంచంలోని యూ.సీ.జీ చరిత్రను పరిశీలిస్తే చిన్నస్థాయిప్రయోగాలు, పైలట్ మాడ్యూల్స్ ద్వారా సాంకేతికతను పరీక్షి ంచి న ఉదాహరణలు కూడా లేకపోలేదు. ఒక సమీక్ష ప్రకారం 20వ శతాబ్దం నుంచి యూరప్, ఆస్ట్రేలియా, చైనా, మాజీ సోవియట్ ప్రాంతం, అమెరికా, దక్షి ణాఫ్రికా తదితర ప్రాం తాల్లో 50కిపైగా పైలట్‌స్థాయి ఆపరేషన్లు జరిగాయి. దీనిని బట్టి రైతుల సూచనను శాస్త్రీయ ఆధారాలతో పరిశీలించదగిన ప్రతిపాదనగా తీసుకోవచ్చు.అయితే ఒక పైలట్ ప్రాజెక్టు అన్నింటినీ నిరూపించగలదా అనే సందేహం కూడా ఉంది. ఎందుకంటే ఒక ప్రభుత్వ భూమిలో చేసిన చిన్న ప్రయోగం విజయవంతమైతే, చింతలపూడి రేచర్ల మొత్తం ప్రాంతంలో ఎటువంటి ప్రమాదం ఉండదని వెంటనే నిర్ధారించలేం. ఎందుకంటే భూగర్భ నిర్మాణం ప్రతి ప్రాంతంలో ఒకేలా ఉండదు. అందువల్ల పైలట్ ప్రయోగానికి ముందు,భూగర్భ పొరల నిర్మాణం, బొగ్గు పొరల స్థానం,భూగర్భ జలాల ప్రవాహ దిశ, జలధారల మధ్య సంబంధం,రాళ్ల పగుళ్లు, పీడన పరిస్థితులు వంటి అంశాలను విపులంగా అధ్యయనం చేయాలి. అప్పుడు మాత్రమే పైలట్ ఫలితాలకు శాస్త్రీయ విలువ ఉంటుంది. రాబోయే కాలంలో భూగర్భజలాలు అనేవి ఏ విధంగా మారే అవకాశం ఉంది అనేదే రైతుల ఆందోళనల్లో అత్యంత తీవ్రమైన అంశంగా ఉంది. ఎందుకంటే ఈ ప్రక్రియలో బొగ్గు భూమి అడుగునే గ్యాసిఫై అవుతుంది. దీనివలన వేడి, వాయువులు, బూడిద అవశేషాలు, వివిధ రసాయన సమ్మేళనాలు ఏర్పడతాయి. గతంలో జరిగిన వివిధ పరిశోధనలు కూడా ఈ ప్రక్రియ వలన భూగర్భ జలాల నాణ్యతలో మార్పులు సంభవించే అవకాశాన్నికూడా నమోదు చేశాయి. అదే సమయంలో ఈ అధ్యయనం పరిసర భూగర్భ నిర్మాణంలోని కొన్నిపొరలు ఈ కాలుష్య కారకాలను కొంతవరకు శోషించగలవని కూడా పేర్కొంది.దీనిని బట్టి ప్రమాదం ఉంది అని చెప్పడం ఎంత తప్పో,ప్రమాదం అసలు ఉండదు అని ముందే చెప్పడం కూడా అంతే తప్పు అవుతుందని చెప్పాలి. ఆస్ట్రేలియా ఇచ్చిన ముఖ్యమైనపాఠం యూ.సీ.జీ విషయంలో ఆస్ట్రేలియా అనుభవాన్ని చింతలపూడి చర్చకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. క్వీన్స్‌లాండ్‌లో ఒక ప్రాంతంలో నిర్వహించిన యూ.సీ.జీ ప్రాజెక్టులో భూగర్భ జలాలలో బెంజీన్ సంబంధించిన రీడింగులు నమోదయ్యాయి.ఈ కారణంగా ప్రభుత్వం ఈ ప్రాజెక్టును నిలిపివేసే చర్య తీసుకుంది.ఉజ్బెకిస్తాన్ మరో రకమైన పాఠంఉజ్బెకిస్తాన్‌లో యూ.సీ.జీ ఆపరేషన్ ద్వారా ఉత్పత్తి చేసిన గ్యాస్‌ను విద్యుత్ ఉత్పత్తికి ఉపయోగించినట్లు శాస్త్రీయ సమీక్షలు పేర్కొంటున్నాయి. అయితే అక్కడ సాధించిన విజయం చింతలపూడిలో కూడా అదే ఫలితాలు వస్తాయని హామీ ఉండకపోవచ్చు.ఎందుకంటే భూగర్భ శాస్త్రం వేరు నీటి వ్యవస్థ వేరు వ్యవసాయ పరిస్థితులు వేరు.అందుకే "అక్కడ జరిగింది కాబట్టి ఇక్కడ కూడా జరుగుతుంది" అనే వాదన కూడా శాస్త్రీయంగా సరైంది కాదు. దీనిని బట్టి చింతలపూడి యూ.సీ.జీ విషయంలో మనం పర్యావరణ

11-9pg5exHMNWJQE:11-9pg5exHMNWJQE.qxd 9/11/2026 12:08 AM Page 1



# ఇళ్ల పట్టాల జాబితా సిద్ధం చేయండి

- 10 రోజుల్లో సమగ్ర ప్రణాళికతో రండి
- కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు

**సచివాలయం, సెప్టెంబరు 10 ప్రభాతవార్త:** రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు లేదా ఇంటి పట్టాలు అందేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఇళ్ల పట్టాల పంపిణీ, గృహ నిర్మాణాలపై పరిమిత సమయం పెట్టుకుని పనిచేయాలని స్పష్టం చేశారు. ఇళ్ల పట్టాలు, గృహ నిర్మాణాలకు సంబంధించి 10 రోజుల్లో సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో రావాలని సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. 8వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో గృహ నిర్మాణం, పేదల ఇళ్ల పట్టాలు, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణపై చర్చించారు. ప్రస్తుతం 1.43 లక్షల మందిని ఇళ్ల పట్టాలకు అర్హులుగా గుర్తించినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మరో 1.26 లక్షల దరఖాస్తులను పరిశీలిస్తున్నామని, వచ్చే నెల 15వ తేదీ నాటికి వాటి పరిశీలన పూర్తి చేస్తామని తెలిపారు. రాష్ట్రంలోని 1,692 గ్రామాల్లో 18 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు అవసరమైన భూమిని గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. ఇళ్ల పట్టాల పంపిణీ ప్రక్రియను ఏడాదిలోపు పూర్తి చేయాలని సిఎం ఆదేశించారు. ఎంతమందికి కొత్తగా ఇళ్ల పట్టాలు ఇవ్వాలి.. ఎంతమందికి పట్టాలను క్రమబద్ధీకరించాలనే అంశాలపై స్పష్టమైన జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. రాష్ట్రంలో గృహ నిర్మాణాల పురోగతిపైనా ముఖ్యమంత్రి సమీక్షించారు. ఇప్పటివరకు 5.92 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయిందని అధికారులు తెలిపారు. మరో 5.32 లక్షల ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని వివరించారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లన్నింటినీ వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేసి లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకురావాలని సిఎం ఆదేశించారు. ప్రతి ఒక్కరికీ ఇల్లు లేదా ఇళ్ల పట్టా అందేలా చూడాలని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో జాప్యానికి తావులేకుండా నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని సూచించారు. ఇళ్ల పట్టాల పంపిణీ, గృహ నిర్మాణాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సిఎం చంద్రబాబు ఆదేశించారు. జిల్లా ఇంఛార్జ్ మంత్రులు ప్రత్యేక చొరవ తీసుకుని జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అర్హుల గుర్తింపు నుంచి పట్టాల పంపిణీ, గృహ నిర్మాణాల పూర్తి వరకు ప్రతి దశను నిర్దేశిత కాలపరిమితిలో పూర్తి చేసేలా పర్యవేక్షించాలని ఆదేశించారు.

## సిసిఎల్ఎలో స్ట్రక్చర్డ్ ల్యాండ్ బ్యాంక్ పోర్టల్

**విజయవాడ, సెప్టెంబరు 10 ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులో ఉన్న భూములకు సంబంధించి స్ట్రక్చర్డ్ ల్యాండ్ బ్యాంక్ పోర్టల్‌ను తయారు చేయాలని రెవెన్యూ శాఖను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. 8వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్సులో యాక్షన్ టేకెన్ రిపోర్టులపై చర్చ సందర్భంగా వేర్వేరు అంశాలపై దిశానిర్దేశం చేశారు. యేళ్ల తరబడి నిరుపయోగంగా ఉండిపోతున్న భూముల్ని గుర్తించి వాటి వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలని సిఎం స్పష్టం చేశారు. రీసర్వే పూర్తయ్యాక ప్రభుత్వ భూములపై పూర్తి స్పష్టత వస్తుందని సిఎం అన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల వద్ద ఏళ్లుగా వినియోగం లేని భూముల్ని గుర్తించాలన్నారు. వాటి వివరాలను కామన్ ల్యాండ్ బ్యాంక్ పోర్టల్ కిందకు తీసుకు రావాలన్నారు. జిల్లాలు, శాఖల వారీగా ప్రభుత్వ భూముల వివరాలను నమోదు చేయాలని సిఎం దిశానిర్దేశం చేశారు. ఏ ప్రభుత్వ శాఖకు భూమి అవసరమైనా ఈ పోర్టల్ ద్వారా కేటాయించే పరిస్థితి ఉండాలని అన్నారు. భూమి కొరత అభివృద్ధికి అడ్డంకి కాకూడదని సిఎం స్పష్టం చేశారు. ప్రాజెక్టు మంజూరు అయిన తర్వాత భూమి కోసం వెతకకుండా ముందుగానే పారిశ్రామిక, అభివృద్ధి ప్రాజెక్టులకు అవసరమైన భూమిని గుర్తించాలని సూచించారు.

## నాయకత్వంలో కొత్త ఆలోచన.. పాలనలో సరికొత్త వేగం

**సచివాలయం, సెప్టెంబరు 10 ప్రభాతవార్త:** నాయకత్వంలో కొత్త ఆలోచనా విధానంతో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లకు దిశా నిర్ధేశం చేశారు. అమరావతిలో నిర్వహించిన 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో లీడర్‌షిప్-న్యూ ఏజ్ గవర్నెన్స్ అంశంపై ఆయన మాట్లాడారు. ప్రస్తుతం తాము లీడర్‌షిప్ ట్రాన్సిషన్ ఉన్నామని, న్యూ లీడర్‌షిప్ అప్రోచ్‌తో పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. నాయకత్వం అనేది సెల్ఫ్ మోటివేషన్‌తో ముడిపడి ఉంటుందని పేర్కొన్నారు. టెక్నాలజీ అందుబాటులోనికి వచ్చిన నేపథ్యంలో ఆన్‌లైన్‌లో ఫైల్స్, డేటా లేక్ వంటి వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని సిఎం సూచించారు. ఏఐ ద్వారా డేటాను విశ్లేషించుకొని ఎక్కడా పొరపాట్లు జరగకుండా చూసుకుంటూ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ఉండాలని చెప్పారు. టెక్నాలజీ యుగంలో నేర్చుకోవడం నిరంతర ప్రక్రియగా మారిందని,నైపుణ్యానికి ఎంత పదును పెడితే అంత ముందుకు వెళ్ళే అవకాశం ఉంటుందన్నారు.

**అత్యుత్తమంగా భారతీయ ఎంట్రర్‌ప్రెన్యూయర్స్:** మహిళలు-పురుషులు అనే వ్యత్యాసం గత కాలపు నినాదమని, ఇప్పుడు ఆ తేడా లేదని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. బ్యూరోక్రసీకి, రాజకీయ నేతలకు వేర్వేరు నైపుణ్యాలు ఉండాల్సిందేనని పేర్కొన్నారు. ప్రతి నాయకుడు తన బృందాన్ని ఎంత ప్రభావవంతంగా నిర్మిస్తారన్నదే ఫలితాలను నిర్ణయిస్తుందని తెలిపారు. ప్రతి రంగంలోనూ సంతృప్తి అనేదే ముఖ్యమన్నారు. ప్రపంచంలోనే భారతీయ ఎంట్రర్‌ప్రెన్యూయర్స్ అత్యుత్తమంగా ఉన్నారని, ప్రతిష్టాత్మక కంపెనీలకు వారే సారథ్యం వహిస్తున్నారని సిఎం చెప్పారు. ఏ వ్యవస్థలో అయినా ఇమిడిపోయే తత్వం భారతీయులదని, దానికి అనుగుణంగా మనం కూడా ఉండాలని సూచించారు. ప్రస్తుతం ఉద్యోగ వ్యవస్థలే మారిపోతున్నాయని, అంతిమంగా క్రెడిబిలిటి అనేదే కీలకమని స్పష్టంచేశారు. సమాజంలోని ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా జిల్లా కలెక్టర్లు తమను తాము మార్చుకోవాలని సిఎం సూచించారు. గతంలో చాలా అంశాలపై దృష్టి పెట్టామని, ఇప్పుడు నాయకత్వంపైనే ఆలోచన చేయాలని నిర్ణయించామని తెలిపారు. నూతన నాయకత్వ విధానంతో పనిచేయడం ద్వారా వేగంగా ఫలితాలను సాధించడంతోపాటు స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యాలను చేరుకునేందుకు ఆస్కారం ఉంటుందని సిఎం అన్నారు.

## ఇద్దరు మహిళా అధికారులకు సిఎం ప్రశంసలు

**అమరావతి, సెప్టెంబరు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** ఇద్దరు మహిళా అధికారులకు సిఎం చంద్రబాబు ప్రశంసించారు. వారు ప్రత్యర్థుల తప్పుడు ప్రచారాన్ని కచ్చితమైన వివరాలతో తిప్పికొట్టారన్నారు. జిల్లా కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. కొందరు వ్యక్తులు ఫేక్ ప్రచారంతో సమస్యలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. వేగంగా స్పందిస్తే దానికి కౌంటర్ ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. సరైన సమయంలో స్పందించకపోతే ఆ శిక్ష ప్రభుత్వానికి పడుతుంది. కొందరు రాజకీయాలు చేస్తూ తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోంది. డిఎస్సీ 2025లో ఎక్కడా తప్పు జరగలేదు. స్పోర్ట్స్ కోటాలో నిబంధనల ప్రకారమే ఉద్యోగాలిచ్చాం. కానీ కొందరు అదే పనిగా ప్రభుత్వంపై బురద జల్లుతున్నారు. దీనిపై ఇద్దరు మహిళా అధికారులు చక్కగా స్పందించి కౌంటర్ ఇచ్చారు... వారిని అభినందిస్తున్నా.. అని పేర్కొన్నారు. ఉద్యోగాలు వచ్చిన ఉపాధ్యాయులు కొండారెడ్డి బురుజు, విజయవాడ అంబేద్కర్ విగ్రహం, విశాఖ బీచ్ రోడ్డులో ఆరోపణలకు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టారు. దుష్ప్రచారం ఆపకపోతే వారి పార్టీని బంగాళాఖాతంలో కలుపుతామని నినదించారు. అయినా, ఆ పార్టీ నేతల్లో మార్పురాలేదని సిఎం చంద్రబాబు మండిపడ్డారు.

## రైల్వే ప్రాజెక్టుల భూసేకరణ వేగవంతం చేయాలి

**విజయవాడ, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర సమగ్ర ఆర్థికాభివృద్ధికి కీలకమైన మౌలిక వసతుల రంగంలో ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్టులను నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేసి, పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని మరింత బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు రాష్ట్ర మౌలిక వసతులు, పెట్టుబడుల శాఖ కార్యదర్శి కోన శశిధర్ తెలిపారు. రాష్ట్రంలోని మారిటైమ్, విమానయాన, జాతీయ, రాష్ట్ర రహదారులు, రైల్వే ప్రాజెక్టుల పురోగతిని వివరిస్తూ భూసేకరణ, భూముల బదలాయింపు, న్యాయపరమైన అంశాలు, స్థానిక స్థాయి సమస్యలను జిల్లా కలెక్టర్లు ప్రాధాన్యతతో పరిష్కరించి ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయాలని సూచించారు.

**మారిటైమ్ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత:** రాష్ట్ర తీర ప్రాంతంలో గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు, ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు, షిప్ బిల్డింగ్, పోర్ట్ క్లస్టర్ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రామాయపట్నం, మూలపేట, మచిలీపట్నం, కాకినాడ గేట్‌వే తదితర పోర్టు ప్రాజెక్టులతో పాటు దుగ్గరాజపట్నం షిప్ బిల్డింగ్- పోర్ట్ క్లస్టర్, నిజాంపట్నం, జువ్వలదిన్నె, మచిలీపట్నం, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్లు వంటి ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు.



గురువారం రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో ఎల్ నినో ప్రభావం.. తీసుకోవాల్సిన చర్యలపై ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేస్తున్న సిఎం చంద్రబాబు, చిత్రంలో మంత్రులు, అధికారులు

# నీటి ప్రాజెక్టులతోను కరవుకు చెక్

- ఎల్‌నినో ప్రభావం రైతులు, వినియోగదారులపై పడనివ్వొద్దు
- నిత్యావసరాల ధరల నియంత్రణకు యాక్షన్ ప్లాన్ రూపొందించండి
- డిమాండ్ ఉన్న పంటల సాగుకు ప్రోత్సాహం... రైతులకు రాయితీపై విత్తన భరోసా
- అవసరమైతే కొన్ని పంటలకు కనీస మద్దతు ధర
- పంటల బీమా లబ్ది రైతులకు దక్కేలా చర్యలు
- విపత్తులను ఆపలేం... ప్రభావాన్ని మాత్రం తగ్గించడం ప్రభుత్వం బాధ్యత
- ఎల్ నినో ప్రభావంపై జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్సులో సిఎం చంద్రబాబు దిశానిర్దేశం

**విజయవాడ, సెప్టెంబరు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** కరవు నుంచి రాష్ట్రాన్ని కాపాడేది ఇరిగేషన్ ప్రాజెక్టులేనని, అందుకే తాను సాగునీటి ప్రాజెక్టులకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన తొలి రోజు 8వ కలెక్టర్ల సమావేశంలో ఎల్ నినో ప్రభావం తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులకు సిఎం చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. ఎల్ నినో వేళ రైతులకు అవగాహన కల్పించడంతోపాటు ధరల పెరగకుండా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఎల్ నినో కారణంగా పంటలు నష్టపోతే రైతులకు బీమా డబ్బులు వచ్చేలా చూడాలని, ఎట్టిపరిస్థితుల్లో రైతు నష్టపోకూడదని సీఎం సూచించారు. ఎల్ నినో విపత్తు కాలంలో ఎలాంటి నిరక్ష్యం వహించవద్దన్నారు. తాను ఇకపై ప్రతి వారం ఎల్ నినో ప్రభావంపై సమీక్షిస్తానని... క్షేత్ర స్థాయి పర్యటనలు ఈ అంశంపై చేపడతానని తెలిపారు. అలాగే మంత్రులు, అధికారులు, కలెక్టర్లు నిరంతరం క్షేత్ర స్థాయిలో ఉంటూ ఎల్ నినోపై రైతుల్లో, ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ "ఎల్ నినో ప్రభావం రాష్ట్రంపై తీవ్రంగా ఉంది. తాగునీటికి, పశుగ్రాసానికి ఇబ్బంది లేకుండా చూసుకోవాలి. వర్షాధార పంటలను ప్రోత్సహించాలి. ఎల్ నినో సమయంలో నీటి ఇబ్బందులే కాదు.. ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉంది. పంటలు సరిగా పండవు కాబట్టి... నిత్యావసరాల ధరలు పెరిగే అవకాశం ఉంటుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ధరలను అదుపులో పెట్టేలా మంత్రులు, అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలి. ఈ మేరకు ఓ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి. భవిష్యత్తులో ఏ పంటలకు డిమాండ్ ఉంటుందో అంచనా వేయాలి.. ఆ పంటలు వేసేలా రైతులను ప్రోత్సహించాలి. అవసరమైతే ఆ మేరకు రైతులకు సదురు పంటలకు సంబంధించిన విత్తనాలను రాయితీపై సరఫరా చేయాలి. భవిష్యత్తులో డిమాండ్ ఉన్న పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించే అంశాన్ని కూడా పరిశీలించండి. డిమాండ్ ఉన్న పంటలను ప్రోత్సహిస్తే... ఇతర ప్రాంతాల నుంచి దిగుమతులు చేసుకునే అవస్థలు తప్పుతాయి. ఉల్లి, పప్పుధాన్యాలు, చిరుధాన్యాల వంటి పంటలను ప్రోత్సహించాలి. మల్టీ క్రాప్స్ వేసేలా చూడాలి. రైతు బజార్లను యాక్టివేట్ చేయాలి.. కేంద్ర ప్రభుత్వం ఏయే పంటలను కొనుగోలు చేస్తోందోననే అంశాన్ని పరిశీలించాలి" అని సిఎం చంద్రబాబు చెప్పారు.

**బీమానే రైతులకు ధీమా:** "రైతులకు ఏ రకమైన పంటలకు బీమా చేయించారో తెలుసుకుని ఆ రకమైన పంటలు వేయించడం ద్వారా రైతులు బీమా మొత్తాలు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలి. రైతులు ఏయే పంటలకు బీమా చేసుకున్నారోననే అంశంపై జిల్లా కలెక్టర్లు స్పష్టమైన జాబితాలను సిద్ధం చేసుకుని దానికి అనుగుణంగా రైతుల్లో అవగాహన కల్పించాలి. ఓ రకమైన పంటకు బీమా చెల్లించి వేరే పంటలు వేస్తే బీమా వర్తించకుండా పోయే ప్రమాదం ఉంది. ఈ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. ఎల్ నినో విపత్తు కాలంలో ప్రకృతి వ్యవసాయాన్ని పిఎండిఎస్ విధానాన్ని ప్రోత్సహించాలి. పచ్చదనం తగ్గకుండా చర్యలు తీసుకోవాలి. వర్షాధార పంటలు వేయడం.. పశుగ్రాసం పండించడం.. చివరి అంశంగా మల్చింగ్ కోసం విత్తనాలు వేసి పచ్చదనం తగ్గకుండా చూడాలి. విత్తనాలను డ్రోన్ల ద్వారా చల్లించే విధానంపై విస్తృతంగా ప్రోత్సహించాలి. తాగునీటికి, పశుగ్రాసానికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలి. వాతావరణ పరిస్థితులను అంచనా వేసుకోవాలి... వ్యవసాయ శాస్త్రవేత్తలతో నిరంతరం చర్చించాలి. ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేలా.. రైతులు, వినియోగదారులపై భారం పడకుండా చూసేలా ఓ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి" అని ముఖ్యమంత్రి ఆదేశించారు.

**క్షేత్ర స్థాయిలో ఉండాలి... రైతుల్లో అవగాహన పెంచాలి:** "ఎల్ నినో ప్రభావం మీద ఇకపై ప్రతి వారం సమీక్షిస్తాను.. నేనూ ఫీల్డుకు వెళ్తాను. మంత్రులు, కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులు అందరూ క్షేత్ర స్థాయికి వెళ్లాలి.. రైతులకు అవగాహన కల్పించాలి. ఎల్ నినో ప్రభావం రైతుల మీద పడకుండా చూడడంతోపాటు వినియోగదారుల మీద పడకుండా చూసుకోవాల్సి ఉంటుంది. ఈ రెండు అంశాలకు హై ప్రయార్టీ ఇవ్వాలి. ఎల్ నినో విపత్తును సవాల్‌గా తీసుకుని ఉత్తమ పద్దతులను అవలంభించేలా చర్యలు తీసుకోవాలి. విపత్తులను ఆపలేం. కానీ ప్రజలపై ఆ విపత్తుల ప్రభావం పడకుండా చూడడమే ప్రభుత్వాల బాధ్యత. 2019 తర్వాత వచ్చిన ప్రభుత్వం నిరక్ష్యం వల్ల రాష్ట్రంలో చాలా ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి కాలేదు. ప్రాజెక్టులు పూర్తై ఉంటే.. ఇప్పుడు ఎల్ నినో లాంటి విపత్తుల్లోనూ ఇబ్బందులుండేవి కావు. పట్టిసీమ 8100 క్యూసెక్కుల నీరు డిశ్చార్జి ఉంది. ప్రకాశం బ్యారేజీకి 6700 క్యూసెక్కులు వస్తోంది. ఈ సీజన్ లో పట్టి సీమ నుంచి ఇప్పటి వరకూ 39.5 టీఎంసీల గోదావరి నీరు కృష్ణా డెల్టాకు తీసుకువచ్చాం. ఈ నీటితోనే తీవ్రమైన ఎల్ నినో పరిస్థితుల్లోనూ డెల్టాలోని లక్షల ఎకరాల సాగును కాపాడగలిగాం" అని సిఎం చంద్రబాబు చెప్పారు.

**వచ్చే వేసవి వరకూ ప్రణాళికలు:** "36 ప్రాధాన్యతా ప్రాజెక్టులను మూడేళ్లలోగానే పూర్తి చేయాలి. వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ, హంద్రీనీవా కాలువను వేగంగా పూర్తి చేశాం. ఇదే స్ఫూర్తితో 36 ప్రాజెక్టులను పూర్తి చేయాలి. కరవు నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవటంలో ఈ ప్రాజెక్టులే కీలకం. గోదావరి కావేరి అనుసంధానంతో పాటు జెజెఎం ద్వారా ఇంటింటికీ నీళ్లు ఇచ్చేందుకు ఆస్కారం ఉంటుంది. నిర్దేశిత గడువులోగా నెల ముందే ఆ ప్రాజెక్టులు పూర్తి కావాలి. పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు, అధికారులకు ప్రోత్సాహకాలు ఇస్తాం. సంకల్పం తీసుకుని పనులు చేస్తే ప్రాజెక్టులు పూర్తి చేయటం సులభం అవుతుంది. కరవు నివారణ పనుల్లో భాగంగా షెడ్లు, పశువుల దాణాకు కొరత రాకుండా చూడాలి. ఈ నెలలోనే గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కు శంకుస్థాపన చేస్తాం. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా చూడాలి. సాధ్యమైనంత మేర చెరువులను నింపి తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోండి. వచ్చే వేసవి వరకూ ఇబ్బంది లేకుండా నీటి సరఫరా ప్రణాళికల్ని సిద్ధం చేసుకోవాలి. నీటి లభ్యత లేని ప్రాంతాలకు సమీపంలోని నీటి వనరుల నుంచి వివిధ ప్రాంతాలకు నీటిని తరలించేందుకు చర్యలు చేపట్టాలి. గతంలో తిరుమలకు నీటి ఎద్దడి వచ్చినప్పుడు వంద రోజుల్లోనే పైపు లైన్ వేసి నీటి సంక్షోభాన్ని నివారించాం. ఇప్పటి నుంచే ప్రణాళిక చేస్తే నీటి సంక్షోభాన్ని సులువుగా ఎదుర్కొనే అవకాశం ఉంటుంది. నీటి సరఫరాతో పాటు రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి. జలధార పనులు నిరంతరం కొనసాగాలి. ట్రెంచ్ లు తవ్వకాలు స్ట్రక్చర్ల నిర్మాణం జరగాలి. అన్నమయ్య జిల్లా తరహాలో అంతర్గత బేసిన్లను అనుసంధానించి భూగర్భ జలాలను పెంచండి. చెరువులు నింపే అంశంపై ఓ బ్లూప్రింట్ ను సిద్ధం చేయండి. ఎల్ నినో సంక్షోభ సమయంలో శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలి."అని ముఖ్యమంత్రి సూచించారు. కరవు నివారణ చర్యల్లో భాగంగా పశువుల షెడ్లు, పశువుల దాణాకు కొరత రాకుండా చూడాలి. వ్యవసాయ శాఖతోపాటు పశుసంవర్ధక, జలవనరులు, గ్రామీణాభివృద్ధి తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలి. హార్టికల్చర్ రంగానికి మరింత ప్రోత్సాహం కల్పించే చర్యల్లో భాగంగా ఈ నెలలోనే గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శంకుస్థాపన చేస్తాం.

## అవకాశాలను ఒడిసి పట్టుకుని ప్రతి శాఖలో సంస్కరణలు



- ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

**అమరావతి, సెప్టెంబరు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రానికి ఉన్న అన్ని అవకాశాలను ఒడిసి పట్టుకుని ప్రతి శాఖలో సంస్కరణలు తీసుకొచ్చామని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. ఇది సిఎం చంద్రబాబు కృషితో సాధ్యమైందన్నారు. ఆర్థిక ప్రగతిని ప్రతి నెలా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు 2022-23ను బేస్ ఇయర్‌గా తీసుకుంటే ప్రస్తుత ధరల ప్రకారం 13.44 శాతం వృద్ధి నమోదైందన్నారు. జిఎస్‌టి వసూళ్లు గతేడాదితో పోలిస్తే రూ.25,450 కోట్లు పెరిగాయని వెల్లడించారు. అధికారుల ఆర్థిక పురోగతిపై ప్రతినెల నివేదిక ఇవ్వాలన్నారు. సాగునీటి రంగంలో సిఎం చంద్రబాబు చేస్తున్న కృషిని అభినందిస్తూ కలెక్టర్ల కాన్ఫరెన్సులో స్టాండింగ్ ఓవేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ నీటి వనరుల రంగంలో సిఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం సాధించిన విజయాలను దేశం గుర్తించింది. వెలిగొండ, పోలవరం ఎడమ కాలువల ద్వారా నీటి విడుదల గురించి వివిధ రాష్ట్రాల్లో చర్చ జరుగుతోంది. ఈ నిశ్శబ్ద పురోగతి వెనుక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్నారు. మొదటి కలెక్టర్ల కాన్ఫరెన్సులోనే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు నీళ్లు ఇవ్వాలని దిశానిర్దేశం చేశారు. అందుకే హంద్రీ-నీవా, వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ ద్వారా నీళ్లు ఇవ్వగలిగాం. ఉమ్మడి రాష్ట్రంలో ఇజ్రాయెల్ నుంచి డ్రిప్ టెక్నాలజీని తీసుకువచ్చి రాష్ట్రంలో అమలు చేశాం. గతంలో రూ.16 మీటరు డ్రిప్ పైప్ ఖరీదు. ఇప్పుడు 30 ఏళ్ల ద్రవ్యోల్బణం తర్వాత రూ.1.60 పైసలకే దొరుకుతోంది. రాయలసీమ జిల్లాల్లో డ్రిప్ ద్వారా చేసిన సాగు, సృష్టించిన సంపదే దీనికి ఉదాహరణ. పట్టిసీమ ప్రాజెక్టును కొందరు వ్యతిరేకించారు. కానీ ఆదే ప్రాజెక్టు నుంచి ఇప్పటి వరకూ 500 టిఎంసిల నీటిని తరలించగలిగాం. ప్రకాశం బ్యారేజీని 200 సార్లు ఇప్పటి వరకూ నింపగలిగాం. డెల్టా ప్రాంతానికి నీరు ఇచ్చాం. ముఖ్యమంత్రి చంద్రబాబు సృష్టించిన నిశ్శబ్ద నీటి ప్రయాణాన్ని రాష్ట్ర ప్రజలు, దేశం కూడా గుర్తించింది. రైతుల గురించి సీఎం పడుతున్న నిరంతర తపనను ఎకనమిక్ టైమ్స్ పత్రిక వాటర్ మాన్‌గా ఆయన్ను కీర్తిస్తూ కథనం రాసింది. ఇది సిఎం సాధించిన విజయం.. ముఖ్యమంత్రి విజయంలో ఎపి అభివృద్ధి ఉంది" అని మంత్రి అన్నారు. కలెక్టర్ల కాన్ఫరెన్సులో మంత్రులు, సిఎస్ సాయిప్రసాద్, డిజిపి హరీష్‌కుమార్ గుప్తా, కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఎపి రైల్వే కనెక్టివిటీకి కేంద్రం ప్రోత్సాహం

- ప్రధాని మోడీకి కృతజ్ఞతలు తెలిపిన సిఎం చంద్రబాబు

**విజయవాడ, సెప్టెంబరు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి రైల్వే కనెక్టివిటీకి కేంద్రం భారీ ప్రోత్సాహం ఇచ్చిందని సిఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. "రైళ్ల రద్దీకి ఇక చెక్. సరుకు రవాణాలో సరికొత్త వేగం. 2030 నాటికి దక్షిణాది రైల్వే నెట్‌వర్క్ సరికొత్త హంగులతో దర్శనమివ్వబోతోంది" అని 'ఎక్స్' వేదిక సిఎం చంద్రబాబు తెలిపారు. దక్షిణ భారతదేశ రవాణా రంగానికి సరికొత్త జవసత్వాలు అందిస్తూ, దశాబ్దాల రైళ్ల రద్దీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కేంద్ర ప్రభుత్వం మెగా ప్లాన్ సిద్ధం చేసింది. ప్రధాని మోడీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో రూ.10,021 కోట్ల భారీ అంచనా వ్యయంతో 5 మల్టీట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని వివరించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా నాలుగు దక్షిణాది రాష్ట్రాల మీదుగా 540 కిలోమీటర్ల మేర సాగే ఈ రైల్వే విస్తరణ, అటు ప్రయాణికులకు ఇటు సరకు రవాణాకు పెనుమార్పులు తీసుకురాబోతోంది. తిరుమల శ్రీవారి భక్తులకు కనెక్టివిటీ కష్టాలు తీరనున్నాయి. రేణిగుంట- అరక్కోణం మార్గంలో రైళ్లు ఇకపై జెట్ స్పీడ్‌తో పరుగులు పెట్టనున్నాయి. కేంద్ర కేబినెట్ ఆమోదించిన మెగా రైల్వే ప్రాజెక్టులలో భాగంగా రూ.1,157 కోట్లతో ఎపి పరిధిలో చేపట్టబోయే రేణిగుంట- అరక్కోణం మార్గంలో 3, 4వ లైన్ల నిర్మాణంపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఎపి రైల్వే కనెక్టివిటీకి కేంద్రం భారీ ప్రోత్సాహం ఇవ్వడంపై ప్రధాని నరేంద్రమోడీకి, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు సిఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు.

## కాకినాడ జిల్లాలో పులి సంచారం

# అప్రమత్తంగా ఉండాలి: డి.సిఎం

**విజయవాడ, సెప్టెంబరు 10 ప్రభాతవార్త ప్రతినిధి:** కాకినాడ జిల్లా ధారపల్లి సమీపంలోని రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో పులి సంచారంపై డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ సమీక్ష నిర్వహించారు. పులి కదలికలు, ప్రస్తుత పరిస్థితి, అటవీ శాఖ చేపడుతున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే అటవీ సరిహద్దు గ్రామాల భద్రతకు తీసుకుంటున్న జాగ్రత్తలపైనా ఆరా తీశారు. ఈ సమీక్షలో అటవీ, పోలీస్, రెవెన్యూ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పులి కదలికలపై అటవీ శాఖ, "హనుమాన్ బృందాలు నిరంతర నిఘా కొనసాగించాలని పవన్ ఆదేశించారు. పులి జనావాస ప్రాంతాల్లోకి ప్రవేశించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన అన్ని చర్యలను సమన్వయంతో చేపట్టాలని సూచించారు. అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు, స్థానిక రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూనే, పులికి హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పవన్ సూచించారు. పులి కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు అటవీ, పోలీస్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పని చేయాలని డిప్యూటీ సిఎం స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించేలా రాపిడ్ రెస్పాన్స్ బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. పరిస్థితిని సమీక్షిస్తూ, అవసరాన్ని బట్టి తక్షణ నిర్ణయాలు తీసుకోవాలని మార్గనిర్దేశం చేశారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ముందస్తు చర్యలపై దృష్టి పెట్టాలని సూచించారు.

## ఎఆర్ హెడ్‌కానిస్టేబుల్ ఆత్మహత్య



**యనమలకుదురు, (విజయవాడ), సెప్టెంబరు 10 ప్రభాత వార్త:** విజయవాడ పట్టణ ఎఆర్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న ఆర్ల రాజేష్(41) ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. స్థానికుల కథనం మేరకు విజయవాడ యనమల కుదురులోని ఇంటిలో బుధవారం అర్ధరాత్రి లుంగీతో ఫ్యాన్‌కు ఉరివేసుకోగా గమనించిన భార్య కాపాడే ప్రయత్నంలో లుంగీని కట్‌చేయటంతో ఒక్కసారిగా కిందపడిన రాజేష్ తలవెనుక బాగాన పెద్ద గాయం కావటంతో తీవ్రరక్తస్రావం అయ్యింది. వెంటనే వైద్యచికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడు 2009బ్యాచ్ కాగా ప్రస్తుతం ఆర్డర్ టు సర్వ్‌పై కృష్ణా జిల్లాలో అదనపు డిజి మధుసూదన్ రెడ్డి వద్ద డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం.

## తిరుపతి - విజయవాడ

# కొత్త విమాన సర్వీసులు




కొత్త విమాన సర్వీసును ప్రారంభిస్తున్న దృశ్యం

**రేణిగుంట, సెప్టెంబరు 10 ప్రభాతవార్త:** తిరుపతి(రేణిగుంట) విమానాశ్రయం నుంచి విజయవాడకు ఫ్లైట్ 91 కొత్త విమాన సర్వీసు గురువారం ప్రారంభించారు. పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు తిరుపతి (రేణిగుంట) విమానాశ్రయంలో సర్వీసును వర్చువల్‌గా ప్రారంభించారు. కొత్త విమానం తిరుపతి విమానాశ్రయానికి చేరుకున్న సందర్భంగా విమానాశ్రయ అగ్నిమాపక విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక పరికరాలతో నీటిను పిచికారి చేసి స్వాగతం పలికారు. అనంతరం తొలి ప్రయాణికుడికి విమానాశ్రయ అధికారులు తొలి టిక్కెటు బోర్డింగ్ పాస్ అందజేసి, కేక్ కట్ చేసి సర్వీసును ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ తిరుపతి దేశంలోని అత్యంత పవిత్రమైన పుణ్యక్షేత్రాల్లో ఒకటని తెలిపారు. ప్రతిరోజూ దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం తిరుపతికి వస్తుంటారని చెప్పారు. తిరుపతి నుంచి విజయవాడ, రాజమహేంద్రవరం, హైదరాబాద్ ప్రాంతాలకు నేరుగా విమాన సౌకర్యం అందుబాటులోకి రావడం వల్ల భక్తులకు వేగవంతమైన, సౌకర్యవంతమైన ప్రయాణం అందుతుందని చెప్పారు. ఈ విమానం ఉదయం 7.40 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి 8.05 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. తిరుపతి నుంచి ఉదయం 8.05 గంటలకు బయలుదేరి 9.15 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. మరల అక్కడి నుంచి ఉదయం 9.45 గంటలకు బయలుదేరి 10.50 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. అదేవిధంగా సోమ, బుధ, శుక్రవారాల్లో వారానికి మూడు రోజులు హైదరాబాద్- తిరుపతి- రాజమహేంద్రవరం- తిరుపతి- హైదరాబాద్ మార్గంలో విమాన సర్వీసు కొనసాగుతుంది.

## నాగార్జున వర్సిటీ 50యేళ్ల ప్రస్థానం

- ప్రత్యేక పోస్టల్ స్టాంపును ఆవిష్కరించిన మంత్రి లోకేష్



**ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, సెప్టెంబరు 10 ప్రభాతవార్త:** ఏఎన్‌యు 50 ఏళ్ళ ప్రస్థానానికి గుర్తింపుగా ప్రత్యేక పోస్టల్ స్టాంప్‌ను గురువారం రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఆవిష్కరించారు. రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వర్సిటీ స్వర్ణోత్సవ వేడుకల చిరకాలం గుర్తిండిపోయేలా ఈ పోస్టల్ స్టాంప్‌ను రూపొందించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ స్వర్ణోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఈ స్టాంప్‌ను ఆవిష్కరించినట్లు తెలిపారు. యూనివర్సిటీ గడిచిన 50ఏళ్ళ ప్రస్థానంలో సాధించిన విజయాలు, విద్యారంగానికి అందించిన సేవలను వీసి ఆచార్య కంచర్ల గంగాధరావు, రెక్టార్ ఆచార్య రామినేని శివరాంప్రసాద్, రిజిస్ట్రార్ జి.సింహాచలంలు లోకేష్‌కు వివరించారు. స్వర్ణోత్సవాల ప్రత్యేక కార్యక్రమాలను ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. ఈ సందర్భంలో ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి జె.శ్యామలరావు, ఉన్నతవిద్య కమీషనర్ భరత్ గుప్తాలు పాల్గొన్నారు.

11-9Pg6exHMNWJQE:11-9Pg6exHMNWJQE.qxd 9/11/2026 12:12 AM Page 1



## మద్యం రవాణా కుంభకోణంలో నిందితులకు చుక్కెదురు

**విజయవాడ,సెప్టెంబరు 10,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం రవాణా కుంభకోణంలో రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డిలకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. వీరు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లను సీజేఐ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం కొట్టివేసింది. నిందితులు ఇప్పటికే ఈడీ కస్టడీలో ఉన్నారని వారి తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. ఈడీ కస్టడీ ముగిశాక, సిట్ కస్టడీ కోసం ప్రొడక్షన్ వారెంట్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ధర్మాసనం ఆదేశించింది. ఆ తర్వాతే రెగ్యులర్ బెయిల్ పిటిషన్ వేసుకోవచ్చని సూచించింది. కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే తమపై కొత్తగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారని నిందితుల న్యాయవాదులు వాదించారు. అయితే, నిన్న ఒక నిర్ణయం, ఇవాళ మరొక నిర్ణయం తీసుకోలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈడీ కేసుతో పాటు మిగిలిన కేసుల విచారణ సమాంతరంగా జరిగితే తప్పేంటని న్యాయస్థానం ప్రశ్నించింది. కేసు మెరిట్స్ ఆధారంగానే సంబంధిత కోర్టు బెయిల్‌పై నిర్ణయం తీసుకుంటుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

## విజయవాడ రైల్వేస్టేషన్లో జీఆర్పీ, ఆర్పీఎఫ్, ఈగల్ బృందాల తనిఖీలు

**విజయవాడ,సెప్టెంబరు 9,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ రైల్వేస్టేషన్లో జీఆర్పీ, ఆర్పీఎఫ్, ఈగల్ బృందాల తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో 38 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకొని, ఒడిశా, కర్ణాటకకు చెందిన ఐదుగురు నిందితులైన ప్రతాప్ ఛత్రియా, ప్రమోద్ ఛత్రియా, బిషికేషన్ జాని, ప్రదీప్ , యోగేష్‌లను అరెస్టు చేశారు. అక్రమ రవాణాపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద రెండు వేర్వేరు కేసులు నమోదు చేశారు. ఈ కేసుతో సంబంధం ఉన్న తేజు అనే మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

# తిరుపతి - గన్నవరం విమాన సర్వీసు ప్రారంభం

**గన్నవరం(కృష్ణా), సెప్టెంబర్ 10, ప్రభాతవార్త :** రాష్ట్రరాజధాని అమరావతి నుండి కలియుగదైవం తిరుపతి వెంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్ళే భక్తులకు కొత్త విమానసర్వీసు అందుబాటులోకి వచ్చింది. గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం నుండి తిరుపతికి నేరుగా వెళ్ళే విమానసర్వీసులు ఫ్లై91 సంస్థ ఏర్పాటు చేసింది. గన న్నవరం అంతర్జాతీయ విమానాశ్రయంలో బుధవారం ఉదయం ఈ విమానసర్వీసును ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ ప్రారంభించి తొలి ప్రయాణికులకు బోర్డింగ్ పాస్‌ను అందచేసారు. ఈసందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ కేంద్రపౌరవిమానయానశాఖా మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు చొరవతో ఈవిమానసర్వీసు అందుబాటులోకి వచ్చిందని తెలిపిన యార్లగడ్డ ఈసందర్భంగా మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. గత 12ఏళ్ళ కాలంలో గన్నవరం విమానాశ్రయం గణనీయంగా అభివృద్ధి చెందిందని, వార్షిక ఆదాయం రూ.6కోట్ల నుండి రూ.88కోట్లకు చేరుకుందని, ప్రయాణికుల సంఖ్య 2.33లక్షల నుండి 14.1లక్షలకు చేరుకుందన్నారు. ఇక్కడి నుండి విమానాల రాకపోకలు 5,386 నుండి 17,356లకు పెరిగాయని వివరించారు. ప్రస్తుతం రోజుకు 44షెడ్యుల్ విమానాలు నడుస్తున్నట్లు యార్లగడ్డ తెలియచేసారు. రాబోయేరోజుల్లో షార్జా, సింగపూర్, వంటి నగరాలకు అంతర్జాతీయ సర్వీసులతోపాటు, ఎయిరేట్ ్స, ఖతార్, లుఫ్తాన్సా వంటి అంతర్జాతీయ విమానయానసంస్థలు గన్నవరం నుండి సేవలు ప్రారంభిస్తే ఈప్రాంత ఎన్‌ఆర్ఐలకు ఎంతో మేలు కలుగుతుందని యార్లగడ్డ అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉండగా ఈవిమానం తిరుపతిలో ఉదయం 8.05గంటలకు బయలుదేరి ఉదయం 9.15గంటలకు నేరుగా గన్నవరం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఉదయం 9.45కు గన్నవరం నుండి బయలుదేరి 10.50గంటలకు తిరుపతి చేరుకుంటుంది. వారంలో నాలుగురోజులపాటు ఈసర్వీసు ఉండగా, టిక్కెట్‌ధరలు రూ.3వేల నుండి రూ.3,500లు మద్యఉంటుంది. భక్తుల సౌకర్యార్థం ఆదివారం కూడా ఈసర్వీసు నడపాలని యార్లగడ్డ ఫ్లై91 సంస్థ ప్రతినిధులను కోరారు.




ప్రయాణికులకు బోర్డింగ్‌పాస్ అందిస్తున్న విప్ యార్లగడ్డ వెంకట్రావ్

## ఉత్తర బంగాళాఖాతంలో కొత్తగా అల్పపీడనం

- తీర ప్రాంతాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు
- ఉత్తరాంధ్రజిల్లాల్లో సాధారణ నుంచి మోస్తరు వర్షాలు

**విజయవాడ,సెప్టెంబరు 10,ప్రభాతవార్తప్రతినిధి:** ఉత్తర బంగాళాఖాతంలో కొత్తగా అల్పపీడనం ఏర్పడింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వాతావరణంలో అనూహ్య మార్పులు చోటు చేసుకోనున్నాయి. ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాలపై ఈ అల్పపీడన ప్రభావం ఉంటుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ మేరకు తీర ప్రాంత ప్రజలను, మత్స్యకారులను అధికారులు అప్రమత్తం చేశారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం క్రమంగా బలపడుతోంది. దీని ఫలితంగా ఉత్తరాంధ్ర ప్రాంతంలోని జిల్లాల్లో రానున్న కొద్ది రోజుల పాటు వాతావరణం చల్లబడనుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తు నిర్వహణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తీర ప్రాంతాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో, గరిష్ఠంగా 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. బలమైన గాలుల కారణంగా తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సముద్ర తీరానికి వెళ్లొద్దని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. సముద్రం అల్లకల్లోలంగా మారిన నేపథ్యంలో మత్స్యకారులకు అత్యవసర హెచ్చరికలు జారీ చేసింది.

## సుప్రీంకోర్టులో కృష్ణా జలాల పిటిషన్ విచారణ వాయిదా

**విజయవాడ,సెప్టెంబరు 10,ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణా జలాల పంపిణీపై ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. రాష్ట్ర విభజన తర్వాత రెండు రాష్ట్రాల మధ్య నీటి పంపకాలపై ఏపీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. కృష్ణా ట్రిబ్యునల్‌కు విధివిధానాలు ఖరారు చేస్తూ కేంద్రం ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్‌ను ఏపీ సవాలు చేసింది. ట్రిబ్యునల్‌లో వాదనలు ఇప్పటికే తుది దశకు చేరాయని ఏపీ ప్రభుత్వం కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. ఈ విచారణను వేగంగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేసింది. ఏపీ ప్రభుత్వ విజ్ఞప్తికి జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం సానుకూలంగా స్పందించింది. అక్టోబర్ 13న ఏపీ రిట్ పిటిషన్‌పై తదుపరి విచారణ జరుపుతామని ధర్మాసనం వెల్లడించింది.

## ఆలయంలో చోరీకి పాల్పడిన నిందితుల అరెస్ట్




ఆలయంలో చోరీ వివరాలు వెల్లడిస్తున్న పోలీస్ అధికారులు

**విజయవాడ, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త :** ఆలయాల్లో చోరీకి పాల్పడిన ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్‌చేసి వారి వద్దనుండి రూ.15లక్షల విలువచేసే సొత్తును రికవరీ చేసారు. రూరల్ డిసిపి బి.లక్ష్మీనారాయణ బుధవారం నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి కేసు వివేకర్లకు వెల్లడించారు. ఆయన కథనం మేరకు ఎన్‌టిఆర్‌జిల్లా చిలకల్లు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముత్యాల గ్రామంలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో ఇటీవల చోరీ జరిగింది. స్థానికుల ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు విచారణ చేపట్టారు. ఈక్రమంలో సిసికెమెరాల పుట్టేజిని విశ్లేషించి ఏలూరుజిల్లా వేలేరుపాడు మండలానికి చెందిన కారం సాంబయ్య(28), నాగర్‌కర్నూల్‌జిల్లా, తిమ్మయ్య పల్లికి చెందిన దేరంగుల మల్లేష్(36), పల్నాడుజిల్లా పిడుగురాళ్ళకు చెందిన బత్తుల కోటయ్య(29)లు ఈచోరీకి పాల్పడినట్లు నిర్ధారించి ముగ్గుర్నీ అదుపులోకి తీసుకుని వారివద్ద నుండి చోరీ సమయంలో ఉపయోగించిన కారును, రూ.15లక్షల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

నిందితులందరూ పాత నేరస్తులని, వీరికి జైలులో పరిచ యంతో ముగురూ కలిసి దొంగతనం చేసేందుకు ముందుగా రెక్కి నిర్వహించినట్లు చెప్పారు. నేరం జరిగిన 72గంటల్లో కేసును చేధించిన అధికారులు సిబ్బందిని అభినందించారు.

# గుత్తి కోటకు జాతీయస్థాయిలో గుర్తింపు

## స్మారక తపాలా బిళ్లకు కీలక ముందడుగు



**అనంతపురం, సెప్టెంబర్ 10, (ప్రభాతవార్త బ్యూరో):** అనంతపురం జిల్లాకు చెందిన చారిత్రక వారసత్వ సంపద గుత్తి కోటకు జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు తీసుకువచ్చే దిశగా కీలక ముందడుగు పడింది అని చెప్పవచ్చు.గుత్తి కోటపై స్మారక తపాలా బిళ్ల విడుదల చేయాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ చేసిన ప్రతిపాదన కేంద్ర తపాలా శాఖలో కీలక దశకు చేరుకుంది అని సమాచారం.గుత్తి కోటపై స్మారక తపాలా బిళ్ల విడుదల చేయాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదన సమర్పించారు. ఈ ప్రతిపాదనపై కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ, తపాలా శాఖ పరిశీలన జరిపి, స్మారక తపాలా బిళ్ల విడుదలకు సంబంధించిన ప్రతిపాదనను కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రివర్యుల ఆమోదం కోసం సమర్పించింది.తపాలా శాఖ అధికారిక నోట్‌లో గుత్తి కోట రాష్ట్రంలోని అతిపెద్ద కోటల్లో ఒకటిగా, 1921 నుంచి భారత పురావస్తు సర్వే శాఖ ఆధ్వర్యంలోని కేంద్ర రక్షిత స్మారక చిహ్నంగా ఉన్నట్లు పేర్కొంది. చాళుక్యులు, విజయనగర సామ్రాజ్యం, మొఘలులు, మరాఠాలు, బ్రిటిష్ పాలన వంటి అనేక చారిత్రక దశలకు గుత్తి కోట సాక్ష్యంగా నిలిచిందని గుర్తించింది.గుత్తి కోటలోని బహుళస్థాయి ప్రాకారాలు, బురుజులు, పురాతన మార్గాలు, నీటి నిల్వలు, చారిత్రక శ్రీ రఘునాథస్వామి ఆలయం వంటి నిర్మాణాలు దాని అపారమైన చారిత్రక, నిర్మాణ, సాంస్కృతిక ప్రాధాన్యతను ప్రతిబింబిస్తున్నాయని తపాలా శాఖ పేర్కొంది. గుత్తి కోటపై ఇప్పటివరకు స్మారక తపాలా బిళ్ల విడుదల కాలేదని కూడా తపాలా శాఖ అధికారికంగా నమోదు చేసింది. ఈ నేపథ్యంలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ప్రతిపాదనకు ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడింది. స్మారక తపాలా బిళ్లల విడుదలకు సాధారణంగా అమల్లో ఉన్న 1 లక్ష బిళ్లల తప్పనిసరి కొనుగోలు నిబంధన నుంచి గుత్తి కోట ప్రతిపాదనకు మినహాయింపు ఇవ్వాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కేంద్రాన్ని కోరారు.

# హాజ్ యాత్రికుల వైద్య పరీక్షలకు ఏర్పాట్లు

**- మంత్రి ఎన్ఎండి ఫరూక్**

**విజయవాడ,సెప్టెంబరు 10,ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్ర హాజ్ యాత్ర 2027 (1448హెచ్)కు దరఖాస్తు చేసుకొని ఎంపికైన హాజీలకు రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల వారీగా వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య, శారీరక దృఢత్వ ధ్రువీకరణ పత్రాలను జారీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మైనారిటీ, న్యాయశాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. హాజ్ కమిటీ ఆఫ్ ఇండియా జారీచేసిన సర్క్యులర్ ప్రకారం తప్పనిసరిగా నిర్దేశిత వైద్య పరీక్షలు చేయించుకుని శారీరక దృఢత్వ ధ్రువీకరణ పత్రాలను పొందాల్సి ఉందని గురువారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఏర్పాట్లకు సంబంధించి రాష్ట్రంలోని అన్ని జిల్లాల వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు (డిఎంహెచ్వోలు) ఆదేశాలను రాష్ట్ర హాజ్ కమిటీ జారీ చేయడం కూడా జరిగిందని తెలిపారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి ఎంపికైన హాజ్ యాత్రికులకు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు/ఆసుపత్రుల్లో వైద్య పరీక్షలు నిర్వహించేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించడం జరిగిందన్నారు.అధీకృత ప్రభుత్వ అల్లోపతిక్ వైద్య అధికారులు నిర్దేశిత వైద్య పరీక్షలు నిర్వహించి, హాజ్ కమిటీ ఆఫ్ ఇండియా నిర్దేశించిన నమూనాలో వైద్య పరీక్షలు, శారీరక దృఢత్వ ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేస్తారని మంత్రి ఫరూక్ వెల్లడించారు.

రాష్ట్రంలోని అన్ని జిల్లాల వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ఆయా జిల్లాల హాజ్ సొసైటీల ప్రతినిధులు సమన్వయంతో వైద్య పరీక్షల నిర్వహణలో భాగస్వామ్యం అవ్వాలని మైనారిటీ, న్యాయశాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఆదేశించారు.హాజ్2027కు తాత్కా లికంగా ఎంపికైన రాష్ట్రం లోని యాత్రికు లందరూ నిర్దేశిత గడువులోగా వైద్య పరీక్షలు పూర్తి చేసుకుని, శారీరక దృఢత్వ ధ్రువీకరణ పత్రాలను పొందాలని మంత్రి ఫరూక్ యాత్రికులకు విజ్ఞప్తి చేశారు.

# స్వచ్ఛతాన్ పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి లోకేష్

## అక్టోబర్ 2న విజయవాడలో భారీస్థాయిలో నిర్వహణ



స్వచ్ఛతాన్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి లోకేష్

**అమరావతి,సెప్టెంబరు10,ప్రభాతవార్తప్రతినిధి:** స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 2న విజయవాడలో భారీ స్థాయిలో నిర్వహించే స్వచ్ఛతాన్ పోస్టర్ ని మానవ వనరుల అభివృద్ధి, విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ శాఖల మంత్రి నారా లోకేష్ బుధవారం రాత్రి గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లి పరిధిలోని కరకట్ట పక్కన గల తమ నివాసంలో ఆవిష్కరించారు. స్వచ్ఛతా రన్‌లో పాల్గొనేవారు తమ పేర్లను రిజిస్టర్ చేసుకునేందుకు అమరావతిరన్నర్స్.కామ్ పోర్టల్‌ని కూడా మంత్రి లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఈ ఈవెంట్ నిర్వహించే అమరావతిరన్నర్స్ అధ్యక్షులు రమేష్ రావి, వారి బృందం సభ్యులు పాల్గొన్నారు. విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ ఇంటర్నేషనల్ స్టేడియమ్ వద్ద ఆ రోజు ఉదయం 5 గంటలకు స్వచ్ఛతా రన్ ప్రారంభమవుతుంది. 5కే, 10కే, 21.1కే (ఆఫ్ మేరాతన్) మూడు కేటగిరీలలో ఈ రన్‌ని అమరావతి రన్నర్స్ వారు నిర్వహిస్తారు. బాలురు, బాలికలు, యువత ... అన్ని వయసుల వారు పాల్గొనడానికి అవకాశం కల్పిస్తారు. అన్ని విభాగాలలో విజేతలకు దాదాపు రూ.10 లక్షల విలువైన బహుమతులతోపాటు మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేస్తారు. పాల్గొన్నవారందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేస్తారు. ఈ రన్ లో పాల్గొనేవారు ఈ నెల 20వ తేదీ లోపల తమ పేర్లను ఆన్ లైన్ లో నమోదు చేసుకోవాలి. రాష్ట్రంతోపాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 10 వేల మంది స్వచ్ఛతా రన్‌లో పాల్గొనే అవకాశం ఉంది. ముఖ్యంగా విద్యార్థులు, యువత శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకోవడంతో పాటు వారికి ఆరోగ్యకరమైన జీవనశైలి, పరిశుభ్రతపై అవగాహన కల్పించడం, సామాజిక కార్యక్రమాలలో పాల్గొనేవిధంగా ప్రోత్సహిస్తారు. విజయవాడలోనే ఇటువంటి రన్ నిర్వహించడం విద్యార్థులకు, యువతకు మంచి అవకాశంగా భావిస్తున్నారు.

# తిరుమల సమాచారం

## సేవాభావంతో విధులు :టిటిడి జెఇఒ గోపీనాథ్



**తిరుమల,సెప్టెంబర్ 10ప్రభాత వార్తప్రతినిధి:** శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహించే ఉద్యోగులు భక్తులలో భగవంతుడిని దర్శించుకుంటూ సేవాభావంతో తమ విధులను నిర్వర్తించాలని టిటిడి జెఇఒ ప్రభల గోపీనాథ్ కోరారు. బ్రహ్మోత్సవాల సమయంలో లక్షలాది మంది భక్తులకు సేవలందించే ఉద్యోగులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఉద్యోగులు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించగలరని అన్నారు. వైద్య నిపుణులు సూచించిన ఆరోగ్య సలహాలను నిరంతరం పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జెఇఒ సూచించారు. డిప్యూటేషన్ ఉద్యోగులకు శ్వేత ఆధ్వర్యంలో ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహించే టిటిడి ఉద్యోగులు భక్తులకు అంకితభావంతో విశేష సేవలందించాలని టిటిడి జెఇఒ ప్రభల గోపీనాథ్ కోరారు. మధుమేహాన్ని ప్రారంభ దశలోనే గుర్తించడం ఎంతో ముఖ్యమని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధిని సకాలంలో గుర్తించి నియంత్రించవచ్చని తెలిపారు. వైద్య పరీక్షలతో బాటు క్రమబద్ధమైన శారీరక శ్రమ, సమతుల్య పోషకాహారం, ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించాలని సూచించారు. మధుమేహాన్ని ముందుగానే గుర్తించి, క్రమమైన పరీక్షలు, సరైన చికిత్సతో దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని చెప్పారు. అనంతరం బ్రహ్మోత్సవాల సమయంలో ఉద్యోగులు తమ రక్తంలోని గ్లూకోజ్ స్థాయిలను ఎప్పటికప్పుడు పరిశీలించుకునేందుకు వీలుగా జెఇఒ గ్లూకోమీటర్లను పంపిణీ చేశారు.

## మ్యూజియంలోని కళాకృతులను భక్తులు పూర్తిస్థాయిలో ఆస్వాదించేలా ఏర్పాట్లు



**తిరుమల,సెప్టెంబర్ 10ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలోని ఎస్వీ మ్యూజియంలోని కళాకృతులను భక్తులు పూర్తిస్థాయిలో ఆస్వాదించేలా అన్ని ఏర్పాట్లు చేయాలని టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్రచెప్పారు. భక్తులు సులభతరంగా ఫీడ్ బ్యాక్ అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆధునీకరించిన 3డి, 4డి రకాలతో శ్రీవారి ఆలయం నమూనా, బంగారు ఆభరణలు, తిరుమలవిశేషాలు వంటివి భక్తులకు కళ్ళకుకట్టినట్లు ఈ మ్యూజియంలో ఏర్పాటుచేశారు. 16వతేదీ సిఎం చంద్రబాబునాయుడు ఈ మ్యూజియం ప్రారంభించనున్న నేపథ్యంలో గురువారం ఉదయం ఎస్వీ మ్యూజియాన్ని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సివిఎస్ఒ మురళీకృష్ణ, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడుతో కలసి ఇఒ రవిచంద్ర పరిశీలించారు. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎస్వీ మ్యూజియం ప్రారంభోత్సవం జరగనున్న నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించారు. మ్యూజియంలో ఏర్పాటు చేసిన గ్యాలరీలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఇన్ ఛార్జ్ సిఇ మనోహారం, డిప్యూటీ ఇఒ సోమన్నారాయణ, విఎస్ఒ సురేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కొండకొచ్చిన ప్రతి భక్తుడికి బీమా!

- రూ.3కోట్లు 'ఆవృత నిధి' ఎల్ఐసి ఖాతాలో - సహజ మరణాలకు రూ.2లక్షలు
- ప్రమాదంలో మరణిస్తే రూ.10లక్షలుగా టిటిడి సంచలన నిర్ణయం


**తిరుమల,సెప్టెంబర్ 10ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచంలోనే ఏ దేవాలయాల్లోనూ అమలుకాని విధంగా హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం సంచలనం నిర్ణయం తీసుకుంది. అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు ...కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం దేశవిదేశాల నుండి తిరుమలకు వచ్చిన ప్రతి భక్తుడి ప్రాణాలకు బీమా అమలుచేసేందుకు ఆమోదించింది. ఇది వరకు టిటిడి చరిత్రలోనే అమలుచేయని రీతిలో ఈ బీమా సదుపాయం ప్రతి భక్తుడికి కల్పించడం కోట్లమంది భక్తుల్లోనూ సానుకూల ధోరణి వ్యక్తమవుతోంది. గతంలో తిరుమలకు వస్తూ రోడ్డుప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతేనో, చిరుతపులుల బారిన పడి ప్రాణాలు కోల్పోయిన వారితోబాటు క్యూలైన్ల నిర్వహణలో లోపాలతో తొపులాట తొక్కిసలాటతో ప్రాణాలు కోల్పోయిన భక్తులకు 2లక్షలు రూపాయలు నుండి 3లక్షల వరకు ఆర్థికసాయంగా బీమా అందించింది.ఇప్పుడు ఈ బీమా ఆర్థిక సాయాన్ని ఏకంగా 10లక్షలు రూపాయలుగా నిర్ణయించడం విశేషమే. ఎక్కడి నుండైనా తిరుమలకు వచ్చే ముందు ప్రధాన ప్రవేశద్వారం అలిపిరి దాటిన ప్రతి భక్తుడికి ఈ బీమా సదుపాయం వర్తిస్తుంది. ప్రతిరోజూ తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని సరాసరి 80వేలమంది వరకు భక్తులు దర్శనం చేసుకుంటున్నారు. వారాంతం,ప్రత్యేక పర్వదినాల్లో ఇష్టదైవాన్ని దర్శనం చేసుకుంటున్న భక్తుల సంఖ్య 90వేలమందికిపైగానే ఉంటున్నారు. ఇప్పుడు తిరుమలకు వచ్చిన ప్రతి భక్తుడికి సాధారణ సర్వదర్శనమ్‌లో(ఎలాంటి దర్శన టిక్కెట్లు, టోకెన్లు లేకున్నా)వైకుంతమ్ 2లో ప్రవేశించే భక్తులకు కూడా ఈ బీమా అమలుకానుంది. ఇప్పటివరకు తిరుమలకు వచ్చిన భక్తులు ప్రమాదవశాత్తు ఏదేని కారణాలతో ప్రాణాలు కోల్పోతే 3లక్షలు రూపాయలు బీమా ఆర్థిక సాయం టిటిడి అందిస్తోంది. ఈ మొత్తాన్ని ఇప్పుడు ఏకంగా 10లక్షల రూపాయలు వరకు పెంచడం సంచలన నిర్ణయమే. ఇందుకుగాను టిటిడి అధికారులు జీవిత బీమా సంస్థ(ఎల్ఐసి)కి భక్తుల బీమా కోసం 3 కోట్ల రూపాయలు 'ఆవృత నిధి" (రివాల్వింగ్ ఫండ్) కింద ఎల్ఐసిలోని ప్రత్యేక ఖాతాలో జమ చేస్తుంది. ఈ ఆవృతనిధి ద్వారా వచ్చే వడ్డీతో భక్తులకు బీమా సాయం అందించే వెసలుబాటు కలుగుతుంది. 2023 జూన్‌లో తల్లిదండ్రులతో కలసి తిరుమలకు అలిపిరి కాలినడక మార్గంలో వస్తున్న మూడేళ్ళ కౌశిక్ బాలుడిపై చిరుతపులి దాడిచేసి గాయపరిచిన ఘటన విదితమే. ఆ తరువాత అదే సంవత్సరం ఆగస్టులో తల్లిదండ్రులతో కలసి అలిపిరి నడకమార్గంలో వస్తున్న కర్నూలుకు చెందిన ఆరేళ్ళ బాలిక లక్షితను చిరుతపులి లాక్కెళ్ళి హతమార్చి తిన్న విషాద ఘటన జరిగింది. ఈ రెండు ఘటనల్లోనూ అప్పటి టిటిడి బోర్డు ఆర్థికసాయం అందించింది. టిటిడిలో 2025 జనవరిలో జరిగిన తిరుపతిలోని క్యూలైన్ల తొక్కిసలాట ఘటనలో ఏడుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన జరిగింది. ఈ ఘటనలో దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన మృతులైన భక్తుల కుటుంబాలకు 2లక్షల రూపాయలు ఆర్థిక సాయం టిటిడి అందించింది.ఈ మొత్తాన్ని కూడా భక్తులు సమర్పించిన కానుకల ద్వారానే ఆర్థికసాయం అందించడం గమనార్హం. తిరుమలకు వస్తున్న భక్తులు సంఖ్య అనూహ్యంగా పెరగడంతోబాటు శ్రీవారి వార్షిక బడ్జెట్ అంతకంతకూ రెట్టింపైంది. ఈ నేపథ్యంలో భక్తుల ప్రాణాలకు బీమా కూడా కల్పించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు అభిప్రాయంతో ఏకీభవించిన టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు ,టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి సంచలన నిర్ణయం తీసుకున్నారు.

## శ్రీవారి ఆశీస్సులతో అందరికీ శుభాలు కలగాలి

### కేంద్రమంత్రి బి ఎల్ వర్మ, ఎంపి కేశినేని చిన్ని

**తిరుమల,సెప్టెంబర్ 10ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవారి ఆశీస్సులతో ప్రజలందరికీ శుభాలు కలగాలని ప్రముఖులు ఆకాంక్షించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు చక్కగా ఉన్నా యని, భక్తులకు సౌకర్యాలు బావున్నాయని అభినందించారు. గురూవారం ఉదయం కేంద్రమంత్రి బి ఎల్ వర్మ, ఎంపి కేశినేని చిన్ని,తెలంగాణ ఎమ్మెల్యే గడ్డం వినోద్, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుటుంబంతో కలసి వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు.

## వెంకన్న సర్వదర్శనానికి 24గంటలు



**తిరుమల,సెప్టెంబర్ 10ప్రభాత వార్తప్రతినిధి:** శ్రీవారి బ్రహ్మోత్స వాలు ఆరంభానికి ముందే తిరుమల భక్తజనసంద్రంగా మారింది. గురువారం ఉదయానికి వెంకన్న దర్శనానికి భక్తులు భారీగా చేరారు. సాధారణ సర్వదర్శనం (టోకెన్ లేని భక్తులు)భక్తులు వేలాదిగా దేశం నలుమూలల నుండి తరలివస్తున్నారు. ఉదయమే వైకుంఠం క్యూకాం ప్లెక్స్ లలోని 32 కంపార్టుమెంట్లు నిండిపోయి భక్తులు వెలుపల క్యూలైన్లలో బాటగంగమ్మఆలయం వరకు బారులుతీరారు. దీంతో స్వామివారి సర్వదర్శనానికి మధ్యాహ్నానికి 24గంటలు సమయం పడుతుండగా ప్రత్యేక ప్రవేశ దర్శనానికి ఆరుగంటలపైగానే భక్తులు నిరీక్షిస్తున్నారు. సాయంత్రం వరకు 42వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. ఇంకా 20వేలమంది భక్తులు అర్ధరాత్రివరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి. తిరుమలకు చేరుకునే సామాన్యభక్తుల సంఖ్య అనూహ్యంగా పెరగ డంతో గదుల కోసం నిరీక్షణ తప్పడంలేదు. అలిపిరిలో భారీగా వాహనాలు బారులుతీరాయి. ఉదయం నుండి ఈ రద్దీ విపరీతంగా ఉంది.

# సుస్థిరత, స్మార్ట్ టెక్నాలజీలో కొత్త ప్రమాణాన్ని నెలకొల్పిన అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయం

**విజయనగరం (భోగాపురం), సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:** అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఆధునిక విమానయాన మౌలిక సదుపాయాలను సాంకేతికంగా అభివృద్ధి చెందిన, సుస్థిరమైన, భవిష్యత్ సంసిద్ధంగా ఉన్న ప్రవేశ స్థలంగా మార్చడానికి తయారుగా ఉంది. జిఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (జివిఐఎఎల్) అభివృద్ధి చేసి, నిర్వహిస్తున్న ఈ ప్రాజెక్ట్, ప్రాంతీయ సాంస్కృతిక గుర్తింపును అత్యాధునిక స్మార్ట్ సిస్టమ్‌లతో మేళవించడంతో, దేశంలోనే ఒక రాబోయే తరపు అగ్రశ్రేణి విమానాశ్రయంగా నిలుస్తోంది. స్థానికంగా కనిపించే పరవ మీను స్ఫూర్తితో రూపుదిద్దిన ఈ ప్రయాణీకుల సమీకృత టెర్మినల్ తాలూకు ప్రత్యేక నిర్మాణ శైలిలో ఆంధ్రప్రదేశ్ ఉజ్వల సంస్కృతి, వారసత్వం ప్రతిబింబిస్తాయి. 77,342 చదరపు మీటర్ల విస్తీర్ణంలో వుండే ఈ టెర్మినల్ ని, గంటకు 275 కిలోమీటర్ల వేగంతో వీచే గాలులతో సహా తీవ్ర పరిస్థితులను కూడా తట్టుకునేలా రూపుదిద్దేరు. విమానాశ్రయం తాలూకు పటిష్టమైన ఎయిర్‌సైడ్ మౌలిక సదుపాయాల్లో 55మీటర్ల ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఎటిసి) టవర్, 18 ఎయిర్‌క్రాఫ్ట్ స్టాండ్లు, సమాంతరమైన, వేగవంతమైన డిపార్చర్ టాక్సీవేల మద్దతుతో కూడిన 3,800మీటర్ల కోడ్ 4ఇ రన్‌వే ఉన్నాయి. ఈ విస్తరించదగిన మౌలిక సదుపాయాలు, ప్రారంభ సామర్థ్యం 6 ఎంపిపిఎతో, భవిష్యత్తులో 40 కంటే ఎక్కువ ఎంపిపిఎల అభివృద్ధికి మద్దతు ఇచ్చేలా రూపొందిద్దడం జరిగింది. మానవ ప్రమేయాలను తగ్గించడానికి, ప్రవేశం నుంచి బోర్డింగ్ చేరుకునే ప్రయాణాన్ని వేగవంతం చేయడానికి డిజిటల్ మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా, జివిఐవిఎల్ ప్రయాణీకుల నిర్వహణను పూర్తిగా పునర్నిర్వచించింది. ఈ టెర్మినల్‌లో ఆటోమేటిక్ సెల్ఫ్‌సర్వీస్ బ్యాగ్ డ్రాప్స్, ఈగేట్లు, అత్యాధునిక సెల్ఫ్‌సర్వీస్ సదుపాయాలు ఉన్నాయి. విమానాశ్రయం వేగవంతమైన, అలాగే సురక్షితమైన గుర్తింపు ధృవీకరణ కోసం, డిజియాత్రతో పాటు వేలిముద్ర స్కానింగ్, ముఖాన్ని గుర్తించడం వంటి బయోమెట్రిక్ సాంకేతికతలను ఉపయోగిస్తోంది. అన్ని టెర్మి నల్, ఎయిర్‌సైడ్ కార్యకలాపాలలో వాస్తవకాల దశ్యమానత, ముందస్తు ప్రణాళికను అందించే కేంద్రీకృత కేంద్రమైన ఎయిర్‌పోర్ట్ ప్రిడిక్టివ్ ఆపరేషన్స్ సెంటర్ (ఎపిఒసి), విమానాశ్రయం తాలూకు డిజిటల్ ఎకోసిస్టమ్‌కు కేంద్రంగా ఉంది. 4.4 మీటర్ల భారీ వీడియో వాల్‌ను ప్రధా నాంశంగా కలిగిన ఎపిఒసి, భద్రత, టెర్మినల్ కార్యకలాపాలు, నిర్వహణ, సోషల్ మీడియా, రాకపోకల పర్యవేక్షణ వంటి విభాగాలను ఏకం చేస్తుంది. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌తో ప్రత్యక్ష సంబంధం ద్వారా ల్యాండింగ్, టేకాఫ్ డేటా ఎయిర్‌పోర్ట్ ఆపరేషనల్ డేటాబేస్ (ఎఒడిబి)లో స్వయంచాలకంగా నమోదు అవుతుంది. అడ్వాన్స్‌డ్ విజువల్ డాకింగ్ గైడెన్స్ సిస్టం (ఎవిడిజిఎస్) టార్మాక్‌పై విమానాలను పార్కింగ్ చేయడానికి మార్గనిర్దేశం చేస్తుంది, తద్వారా ఆపరేటర్ ప్రమేయం చాలా తక్కువగా ఉండి, కచ్చితమైన, సురక్షితమైన డాకింగ్‌కు హామీ ఇస్తుంది. పర్యావరణ అనుకూల వాస్తుశిల్పం, సుస్థిరత :పూర్తిగా 'గ్రీన్ బిల్డింగ్' ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించిన ఈ ప్రాజెక్ట్, యు.ఎస్. గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (యుఎస్‌జిబిసి) వారివద్ద అధికారికంగా నమోదు అయింది. పర్యావరణ ప్రభావాన్ని తగ్గించుకునేందుకు, ఈ టెర్మినల్ అత్యంత శక్తిసమర్థవంతమైన హెచ్ విఎసి వ్యవస్థతో కూడిన 'స్మార్ట్ బిల్డింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్'ను ఉపయోగిస్తోంది.

11-9Pg7exHMNWJQE:11-9Pg7exHMNWJQE.qxd 9/11/2026 12:17 AM Page 1



# ఉరవకొండలో ఘోర రోడ్డు ప్రమాదం!

**- వజ్రకరూరుకు చెందిన ముగ్గురు వ్యక్తులు దుర్మరణం**

**- మృతులందరూ రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబాలకు చెందిన వారే**

**ఉరవకొండ, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త** అనంతపురం జిల్లా ఉరవకొండ పట్టణ శివారు గుంతకల్లు రోడ్డులోని మైక్రోవేవ్ టవర్ సమీపంలో గురువారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో వజ్రకరూరుకు చెందిన కణేకల్లు జైనుల్లా (40), మహబూబ్‌బాషా (33), రఫీక్ (29) దుర్మరణం చెందారు. వారు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని వెనుకవైపు నుండి గుర్తు తెలియని వాహనం బలంగా ఢీకొట్టి ఆపకుండా వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ముగ్గురి మృతికి కారణమైన గుర్తు తెలియని వాహనాన్ని గుర్తించడానికి వజ్రకరూరు, గుంతకల్లు పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేశారు.

# రావులపాలెం పంచాయతీ కార్యాలయంలో ఏసిబి తనిఖీలు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,సెప్టెంబరు10, (ప్రభాతవార్త):**డాక్టర్ బిఆర్ అంబెడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం పంచాయతీ కార్యాలయంపై రాజమండ్రి ఏసీబీ అధికారులు గురువారం అకస్మిక తనిఖీలు నిర్వహించారు. రాజమండ్రి ఏసీబీ అడిషనల్ ఎస్పీ భవ్య కిషోర్ ఆధ్వర్యంలో సుదీర్ఘ తనిఖీలు నిర్వహించారు. కమర్షియల్ విలువైన ఈ ప్రాంతంలో అనదికార వ్యాపార లావాదేవీలు యదేచ్ఛగా సాగుతున్నాయన్న ఆరోపణలు నేపథ్యంలో ఏసిబి అధికారులు దాడులకు మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి.ఉదయం నుంచి సాయంత్రం వరకు పంచాయతీ రికార్డులు, సంబంధిత ఫైల్ లను పరిశీలించారు. పంచాయతీ సిబ్బందిపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఈ తనిఖీలు చేపట్టినట్లు అడిషనల్ ఎస్పీ భవ్య కిషోర్ తెలిపారు. రావులపాలెంలో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన లేఅవుట్లు, నిర్మించిన భవనాలపై చర్యలు తీసుకోకుండా సిబ్బంది వ్యవహరిస్తున్నారనే సమాచారంతో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎటువంటి అనుమతులు లేని పలు లేఅవుట్లు, భవనాలను గుర్తించినట్లు తెలిపారు.వాటికి పంచాయతీ అధికారులు నోటీసులు ఇవ్వకపోవడం, కొన్ని లేఅవుట్లు, భవనాలకు నోటీసులు ఇచ్చినా తదుపరి చర్యలు తీసుకోకుండా వదిలేయడం వంటి అంశాలు గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి నివేదిక సిద్ధం చేస్తున్నామని, రావులపాలెం పంచాయతీపై మూడు రోజుల పాటు సమగ్రంగా తనిఖీలు నిర్వహించనున్నట్లు అడిషనల్ ఎస్పీ భవ్య కిషోర్ వెల్లడించారు. ఈ తనిఖీల్లో ఏసీబీ సిఐలు భాస్కరరావు, వాసు కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.దీంతో అక్రమార్కుల గుండెల్లో గుబులు రేపుతోంది.

# మెగా డిఎస్సీలో భారీ అవకతవకలు : మాజీ సిఎం జగన్



**విజయవాడ.సెప్టెంబరు 10,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన మెగా డీఎస్సీ నియామక ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయని వైసీపీ అధినేత జగన్ ఆరోపించారు.తప్పులను కప్పిపుచ్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోందని పునరుద్ఘాటించారు. శాసనసభ వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అసత్యాలు ప్రచారం చేశారని వైసిపి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆక్షేపించారు. ఈ భారీ కుంభకోణానికి సంబంధించిన అన్ని ఆధారాలను త్వరలోనే సమగ్రంగా ప్రజల ముందుకు తీసుకొస్తానని స్పష్టం చేశాపశ్నపత్రాల తయారీ, పరీక్షల నిర్వహణ బాధ్యతలను ఒకే ఒక్క వ్యక్తికి/సంస్థకు ఎలా అప్పగిస్తారని జగన్ ప్రశ్నించారు. ఎస్‌సీఈఆర్‌టీ విభాగంలో పనిచేస్తున్న నవీన్ అనే అభ్యర్థికి ఫస్ట్ ర్యాంక్ ఎలా వచ్చింది? అసలు మొదటి ర్యాంక్ సాధించిన నవీన్‌కు ఉద్యోగం ఎందుకు నిరాకరించారు? అని ప్రశ్నించారు. జీవో నంబర్ 4, జీవో నంబర్ 47లను తీసుకొచ్చి స్పోర్ట్స్ కోటా నిబంధనలను ఎందుకు మార్చారు? పరీక్షలు నిర్వహించకుండానే 372 మందికి నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు కట్టబెట్టడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటి? అని ప్రశ్నించారు. ఖిజూడోఖి అనే ఆట కింద ఏకంగా 39 మందికి అక్రమంగా సర్టిఫికెట్లు సృష్టించి ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపించారు. మెగా డీఎస్సీ అక్రమాలపై తమ పార్టీ ఆధారాలతో సహా నిలదీస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబుకు కోపం వచ్చి బీపీ పెరుగుతోందని, మంత్రి నారా లోకేశ్ ను కాపాడుకోవడానికి ప్రభుత్వం తాపత్రయపడుతోందని జగన్ ఎద్దేవా చేశారు. ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులు, జర్నలిస్టులపై తప్పుడు కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. అక్రమంగా డీఎస్సీ పోస్టింగులు అనర్హులకు ఇచ్చి ఎందరో పొట్టకొటిన చంద్రబాబు.పబ్లిక్ సర్వీసు కమిషన్‌లో అక్రమాలంటూ నాటకాలాడుతున్నారన్నారు.

# ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధం.. పెను ప్రమాదం తప్పింది

- ఓజిలి రాజపాలెం చెరువు కల్వర్టు వద్ద ఘటన - 19 మంది ప్రయాణికులు, సిబ్బంది సురక్షితం - డ్రైవర్ సమయస్ఫూర్తితో తప్పిన పెనుముప్పు

**ఓజిలి, సెప్టెంబరు 10 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా ఓజిలి మండల పరిధిలోని పెద్దపరియ జాతీయ రహదారిపై ఓజిలి రాజపాలెం చెరువు కల్వర్టు సమీపంలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో అకస్మాత్తుగా మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైన ఘటనలో పెను ప్రమాదం తప్పింది. రేపల్లె నుంచి 19 మంది ప్రయాణికులు, ఇద్దరు డ్రైవర్లు, ఒక క్లీనర్‌తో బెంగళూరు బయలుదేరిన కామాక్షి టూర్స్ అండ్ ట్రావెల్స్ బస్సు గురువారం తెల్లవారుజామున సుమారు 1:45 నుంచి 1:50 గంటల ప్రాంతంలో ఓజిలి రాచపాలెం చెరువు సమీపానికి రాగానే షార్ట్ సర్క్యూట్‌కు గురైంది. బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగడాన్ని, పొగ రావడాన్ని గుర్తించిన డ్రైవర్ వెంటనే అప్రమత్తమై, క్షణం కూడా ఆలస్యం చేయకుండా వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపివేశారు. ప్రయాణికులందరినీ సురక్షి తంగా కిందకు దించేశారు. రోడ్డు పక్కన ఆపిన కొద్దిసేపటికే మంటలు తీవ్రంగా వ్యాపించి బస్సు పూర్తిగా దగ్ధమైంది. డ్రైవర్ సమయస్ఫూర్తి, ప్రయాణికుల అప్రమత్తత వల్ల ఈ ప్రమాదంలో ప్రయాణికులకు గానీ, సిబ్బందికి గానీ ఎలాంటి గాయాలు కాలేదని, అందరూ క్షేమంగా బయటపడటంతో పెను ప్రాణనష్టం తప్పిందని ఓజిలి ఎస్ఐ కె. శ్రీకాంత్ వెల్లడించారు. సమాచారం అందిన వెంటనే ఎస్ఐ శ్రీకాంత్ తన సిబ్బందితో కలిసి వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షి ంచారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు. అలాగే హైవే సిబ్బంది సహకారంతో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి వాహనాలను దారి మళ్లించినట్లు ఎస్ఐ తెలిపారు. డ్రైవర్ చొరవతో పెద్ద ప్రమాదం

# పసిబిడ్డను వదిలేసిన తల్లి

**- ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శిశువు**

**ఒంగోలు, ప్రభాతవార్త** నవ మాసాలు కంటికి రెప్పలా కాచుకుంటే ఎంతో ఆనందించా.. కళ్లు తెరిచి నిన్నే చూడాలని తపించా.. ఎప్పుడెప్పుడు కడుపులో నుంచి బయటకు వస్తానా.. నీ ఒడిలో వదిగిపోతానని ఎదురు చూశా.. కానీ.. కళ్లు తెరిచే సరికి నీవు కనిపిస్తావనుకుంటే. చుట్టూ చీకటే ఉంది. నీ వెచ్చని పొత్తిల్లో ఉంటాననుకుంటే. చెరువుగట్టుమీద తుప్పల మధ్యలో పడేశావ్. నా ముఖం కూడా చూడలేనంత తప్పు నేనేం చేశానమ్మా.. పసిబిడ్డను వదిలేసేంత కష్టం ఏమొచ్చిందమ్మా.. ఎక్కడున్నావమ్మా.. ఎందుకమ్మా ఇలా చేశావ్.. రా అమ్మ.. నన్ను తీసుకోమ్మా.. గురువారం ఉదయం 6గంటల సమయంలో ఒంగోలు నగరంలోని సమతా నగర్ చెరువు గట్టుమీద వాకింగ్‌కు వెళ్తున్న వృద్ధులకు చెరువు కట్ట తుప్పల మధ్యలోనుంచి ఓ చిన్నారి ఏడుపు విని వాకింగ్‌కు వచ్చిన కొందరు ఆందోళనకు గురయ్యారు. అక్కడే పడి ఉన్న ఓ ఉత్తరాన్ని పరిశీలించగా మగ శిశువును చూసి చలించిపోయారు. మగ శిశువుకు ఒంటిపై రక్తపు మరకలు ఉండడం చూసి వాకింగ్‌కు వచ్చిన వారు, స్థానికులు, తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే తాలూకా పోలీసులు వెంటనే స్పందించి ప్రకాశం జిల్లా బాలల సంరక్షణాధికారి దినేష్‌కుమార్‌కు తెలుపగా వెంటనే అతను పోలీసు స్టేషన్ దగ్గరకు వచ్చి ఆ నవజాతి శిశువును రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఎన్‌యుసీయు విభాగంలో చేర్చి నవజాతి శిశువుకు వైద్యసేవలు అందిస్తున్నారు. గత గురువారం రాత్రి చెరువు గట్టుమీద ఎవరో పడేసిఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. బాలల సంరక్షణాధికారి దినేష్‌కుమార్ మాట్లాడుతూ నవజాతి శిశువుకు చలి తీవ్రత ఉండడం గ్లూకోజ్ స్థాయి తగ్గడంతో వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. 24గంటలు దాటితే విషయం చెప్పలేమని వారు పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. తాలూకా పోలీసులు తల్లిదండ్రుల కోసం ఆరా తీస్తున్నారు. సమత నగర్ ప్రాంతంలోని అన్ని ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

# అధికార భాషా సంఘం కార్యాలయంలో విశ్వనాథ జయంతి వేడుక

**విజయవాడ,సెప్టెంబరు 10,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు సాహిత్యంలో విశిష్టమైన రచనలు చేసిన మహనీయుడు విశ్వనాథ సత్యనారాయణఅని అధికార భాషా సంఘం అధ్యక్షులు పి. త్రివిక్రమరావు ( విక్రమ్ పూల) అన్నారు.రామాయణం కల్పవృక్షంలో ఆయన అత్యంత సరళమైన మాతృభాషా పదాల వినియోగం అద్భుతమన్నారు.ఆయన పద్యరచనల్లో అన్ని రసాలు పండాయన్నారు,మాటల్లో ఎంత చతురత ఉందో రచనల్లోను అదే కన్పిస్తుందన్నారు.ఉహాజనీతంశమైనప్పటికి విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు విశ్వనాథవారిలోని సరసత ను తెలియజేస్తుందన్నారు.తెలుగుజాతికి గర్వకారణమైన కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ 131 వ జయంతి వేడుక మండలి వెంకటకృష్ణారావు అధికార భాషా సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా జరిగింది.అధికార భాషా సంఘం అధ్యక్షులు పి. త్రివిక్రమరావు ( విక్రమ్ పూల )విశ్వనాథ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. విశ్వనాథ సత్యనారాయణ అన్ని రకాల తెలుగు సాహిత్య ప్రక్రియలను వాడిన ఏకైక తెలుగు కవి, రచయిత అని, దాదాపు 150 రచనలు చేశారని, ఆయన సృష్టించిన సాహిత్య సంపద తెలుగు వారికి గర్వకారణమని పేర్కొన్నారు.విశ్వనాథ చేసిన అద్భుతమైన సాహిత్య సేవకు గుర్తింపుగా అనేక అవార్డులు, పురస్కారాలు ఆయన సొంతం అయ్యాయని, కళా ప్రపూర్ణ, పద్మభూషణ్ గౌరవ డాక్టరేట్లతో పాటు సాహిత్యంలో అత్యున్నత బహుమతి జ్ఞానపీఠ్ పురస్కారాన్ని పొందిన తెలుగు వ్యక్తి.




# ఉపాధి, అభివృద్ధిని చూసి ఓర్వలేకనే నీచమైన అసత్య ప్రచారాలు

**- మంత్రి పదవి పోయాక అనిల్‌కు మైండ్ పనిచేయడం లేదు..**

**- కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**

**కోవూరు (నెల్లూరు), సెప్టెంబర్ 10, ప్రభాతవార్త :** వైసీపీ నేతలు నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్‌లు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి (వీపీఆర్), కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులపై చేస్తున్న కక్షపూరిత ఆరోపణలకు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి తీవ్రస్థాయిలో కౌంటర్ ఇచ్చారు. గురువారం నెల్లూరులోని వీపీఆర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ప్రశాంతి రెడ్డి, ఆధారాలతో సహా వైసీపీ నేతల మోసాలను, అక్రమాలను నిలదీశారు. అమరావతిలో ఇటీవల జరిగిన టీడీపీ లీడర్‌షిప్ కాన్క్లేవ్‌లో సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఇచ్చిన సూచనల మేరకే, ప్రజలకు వాస్తవాలను వివరించేందుకు మీడియా ముందుకు వచ్చానని స్పష్టం చేశారు. అనిల్ దయనీయమైన గతం ఇదే అనిల్ కుమార్ యాదవ్ విశ్వాసఘాతుక రాజకీయాలకు చిరునామా అని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ధ్వజమెత్తారు. 2019 ఎన్నికల ఫలితాల రోజు సాయంత్రం అనిల్ తన చిన్నాన్న రూప్ కుమార్‌ను వెంటబెట్టుకుని వచ్చి, 'మీరే శివపార్వతులు.. ఎన్నికల్లో ఓడిపోతే రోడ్డున పడతాను, నా దగ్గర రూపాయి లేదు' అని వేడుకున్న విషయాన్ని గుర్తుచేశారు. ఆ నాడు దయతో ఆదుకున్న వీపీఆర్ పైనే ఈ రోజు నోరు పారేసుకోవడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. మంత్రి పదవి ఊడిపోయాక అనిల్‌కు మైండ్ పనిచేయడం లేదని, 2024 ఎన్నికల్లో నెల్లూరు ప్రజలు తన్ని తరిమేస్తే నర్సారావుపేటకు, అక్కడ కూడా తరిమేస్తే చెన్నైకి పారిపోయాడని ఎద్దేవా చేశారు. వీపీఆర్‌కు దందాల అవసరం లేదు.. మైనింగ్ దొంగలు వైసీపీ నేతలే వీపీఆర్‌కి దేశవ్యాప్తంగా రూ.50 వేల కోట్ల విలువైన అధికారిక మైనింగ్ కాంట్రాక్టులు ఉన్నాయని, ఇంకా 35 ఏళ్లకు సరిపడా వ్యాపారాలు చేతుల్లో ఉన్నాయని చెప్పారు.

సంపాదించిన తర్వాత ప్రజలకు సేవ చేయడానికి రాజకీయాల్లోకి వచ్చిన వీపీఆర్‌కు ఎలాంటి ఇల్లీగల్ దందాలు చేయాల్సిన అవసరం లేదన్నారు.

# 2021లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగినట్లే .. ఇప్పుడు జరగాల్సిందే

**- అప్పట్లో పోలీసులే ఏకగ్రీవాలు చేశారు - ఇప్పుడు వారే అప్పుడు ఏకగ్రీవమైన స్థానాలు ఇప్పుడు చేయాల్సిందే : మాజీ ఎమ్మెల్యే జె.సి ప్రభాకర్‌రెడ్డి**

**తాడిపత్రిఅర్బన్, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త** 2021 సంవత్సరంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగిన విధంగా ఇప్పుడు జరగాల్సిందేనని, అప్పట్లో పోలీసులే ఏకగ్రీవాలు చేశారని, ఇప్పుడు కూడా వారే ఏకగ్రీవాలు చేసి తీరాల్సిందేనని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జె.సి ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. స్థానిక నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థలపై అనంతపురంలో వైఎస్ఆర్ పార్టీ సమావేశం ఏర్పాటు సంతోషకరమన్నారు. వైఎస్ఆర్ పార్టీ లాంటి పార్టీలు పరిపాలన ఉంటే కాక్రోచ్, దీమాక్ నక్సల్స్ పుడతారన్నారు. 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్ఆర్‌సిపి నాయకులు స్థానిక పోలీసుల సహకారం తీసుకొని కేసుల భయంతో ప్రతిపక్ష పార్టీకి చెందిన వారిని భయభ్రాంతులకు గురిచేసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు. ఎన్నికల్లో నామినేషన్ వేస్తే ప్రచారం చేయకుండా అడ్డుకున్నారన్నారు. టిడిపికి చెందిన జిల్లా నాయకులు నియోజకవర్గాలకు వెళ్లి తమ సమస్యలు తెలుసుకొని ఎందుకు పోటీ చేయలేదో తెలుసుకోవాలన్నారు. అప్పట్లో ఉన్న పోలీసుల సహకారంతో ఎన్నికలు నిర్వహించారన్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 80 శాతం స్థానిక సంస్థల అధికారం వైఎస్ఆర్‌సిపి దక్కించుకుందన్నారు. ప్రస్తుతం ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్న వారు అప్పుడు అధికార పార్టీ వారు చేసిన అప్రజాస్వామిక విధానాలు కనపడలేదా అని ప్రశ్నించారు. పోలీసులు అప్పుడు చేసిన పని ఇప్పుడూ చేయలేరా అన్నారు. టీడీపీ ఎంపి, ఎమ్మెల్యే పదవుల్లో ఉన్న ఇతర నాయకులు గమనించాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి స్థానిక సంస్థల్లో పోటీ చేయడానికి వెనుకంజ వేయడానికి సిద్ధంగా ఉన్న వైఎస్ఆర్‌సిపి నాయకులకు ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వమని చెపుతున్నారన్నారు. అప్పట్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో మీరు భయభ్రాంతులకు గురిచేసి ఏకగ్రీవాలు చేసుకున్నారని, అప్పుడు మీరు చేసిన విధానాన్ని ఇప్పుడు మేము చేస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఖూనీ చేసింది మీరు కాదా అని ప్రశ్నించారు. స్థానిక సంస్థలు వైఎస్ఆర్‌సిపి అధికారంలో ఉన్నప్పుడు జరిగిన విధంగా జరగాలన్నారు. జిల్లాలో ఉన్న నాయకులు స్పందించక పోతే నేను జిల్లాలో అన్ని నియోజకవర్గాలు తిరుగుతానని, టిడిపి నాయకులను కలిసి స్థానిక సంస్థలు జరగాల్సిన తీరును వివరిస్తానన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 63 జెడ్‌పిటిసిలకు 63 వైఎస్ఆర్‌సిపికి వచ్చాయని, టీడీపీకి ఒక జెడ్‌పిటిసి స్థానం దక్కకుండా చేశారన్నారు.

2021లో వైఎస్ఆర్‌సిపికి తాడిపత్రి నియోజకవర్గంలో అనుకూలంగా పనిచేసిన సిఐలు రవిశంకర్‌రెడ్డి, తేజమూర్తి, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, మహమ్మద్‌గౌస్‌తో పాటు అప్పటి పోలీస్ అధికారులు ఇప్పుడు అదే విధంగా అధికార పార్టీకి పనిచేయాల్సిందేనన్నారు. మా నియోజకవర్గంలో అప్పుడు ఏకగ్రీవమైన స్థానాలు మాకు దక్కాలన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షులు జిల్లా సమావేశాన్ని ఏర్పాటు చేసి స్థానిక సంస్థల ఎన్నికల గురించి చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. వారు మాట్లాడరు తాను మాట్లాడితే ఇబ్బంది పెడతారని టిడిపి నాయకులకు జె.సి ప్రభాకర్‌రెడ్డి చురకలు అంటించారు. జె.సి ప్రభాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.

# ఎపి గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ నాగబాబుకు కేబినెట్ హోదా

-జీతభత్యాలు, ఇతర సౌకర్యాలను ఖరారు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు - నెలకు రూ. 2 లక్షల జీతం.. రూ. 2.50 లక్షల అలవెన్సులు -మొత్తం రూ. 4.50 లక్షల మేర ప్రయోజనాలు అందే అవకాశం

విజయవాడ.సెప్టెంబరు 19,ప్రభాతవార్తప్రతినిధి:ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్సీ కొణిదెల నాగేంద్రరావు (నాగబాబు)కు రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్ హోదా కల్పించింది. ఈ మేరకు అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన జీతభత్యాలు, వ్యక్తిగత సిబ్బంది నియామకం, ఇతర ప్రయోజనాలను ఖరారు చేస్తూ పర్యావరణ, అటవీశాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల కాపీలను ఆర్థిక శాఖ సహా సంబంధిత శాఖలకు పంపింది. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో, కేబినెట్ హోదా పొందిన వారికి వర్తించే ప్రయోజనాలకు సంబంధించి 2025 జనవరి 10న విడుదల చేసిన జీవో నంబర్ 7ను ప్రస్తావించారు. ఈ జీవో ప్రకారం కేబినెట్ హోదాలో ఉన్న వారికి నెలకు రూ. 2 లక్షల జీతం చెల్లిస్తారు. దీనికి అదనంగా, కార్యాలయ ఫర్నీచర్ ఏర్పాటు, వ్యక్తిగత సహాయ సిబ్బంది అలవెన్సులు, ఇతర సౌకర్యాల కల్పన కోసం వన్‌టైం గ్రాంట్‌గా మరో రూ. 2.50 లక్షలు అందిస్తారు.

దీంతో జీతం, అలవెన్సులు అన్నీ కలిపి నెలకు మొత్తం రూ. 4.50 లక్షల వరకు ప్రయోజనాలు అందనున్నాయి. నాగబాబుకు కూడా ఇదే ప్యాకేజీ వర్తిస్తుందని స్పష్టమవుతోంది.ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటికే పలువురిని కేబినెట్ హోదాలో నియమించిన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి ప్రోగ్రామ్ కోఆర్డినేటర్‌గా నియమితులైన పెందుర్తి వెంకటేశ్, మైనారిటీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్‌లకు కేబినెట్ హోదా ఉంది.

వీరితో పాటు ప్రభుత్వ సలహాదారులుగా ఉన్న ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు, ప్రకృతి వైద్య నిపుణుడు మంతెన సత్యనారాయణ రాజు, మాజీ కార్టూనిస్ట్ పోచంపల్లి శ్రీధర్ రావులకు కూడా ప్రభుత్వం కేబినెట్ హోదా కల్పించింది. ఇప్పుడు ఈ జాబితాలో నాగబాబు కూడా చేరారు.

# అమూల్య బాల్యాన్ని మత్తులోకి జారనీయొద్దు

**- ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు చల్ల మధుసూదన రావు.**

**- విద్యార్థులతో స్నేహపూర్వక సంభాషణలు పెరగాలి**

**అమరావతి, సెప్టెంబర్ 10,ప్రభాతవార్త**అమూల్యమైన బాల్యాన్ని మత్తులోకి జారకుండా కాపాడాల్సిన బాధ్యత అందరిదీ అని ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు చల్ల మధుసూదన రావు పేర్కొన్నారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమం, నశాముక్త్ భారత్ అభియాన్ 2026-2029 కార్యాచరణ ప్రణాళికలో భాగంగా జిల్లా స్థాయి మాస్టర్ కోచ్‌లకు రాష్ట్ర స్థాయి శిక్షణ ముగింపు కార్యక్రమం చినకాకానిలోని హాయ్ ల్యాండ్‌లో జరిగింది. రాష్ట్రంలోని ప్రతి పాఠశాల, ప్రతి విద్యార్థికి డ్రగ్స్ నివారణ, అవగాహన, అవసరమైన సహాయాన్ని అందించేందుకు జిల్లా స్థాయి బృందాల సామర్థ్యాన్ని పెంపొందించడానికి ఈ శిక్షణ జరిగింది.

ఉదయం నుంచి సాయంత్రం వరకు రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల నుంచి వచ్చిన మాస్టర్ కోచ్‌లు ఖిడ్రగ్స్ వద్దు బ్రోఖి క్యాంపెయిన్ కి ఉద్దేశించిన తమ ప్రణాళికలను ప్రదర్శనల ద్వారా వివరించారు. ఆటలు, పాటలు, స్కిట్స్ ద్వారా పిల్లలను ఆలోచింపజేసేలా కార్యక్రమాలను ప్రదర్శించారు. తిశిళీదిశిదిళి సభ్యుడు చల్ల మధుసూదన రావు మాట్లాడుతూ.. డ్రగ్స్ భూతాన్ని విద్యాలయాల నుంచి తరిమికొట్టేందుకు టీచర్లు తల్లితండ్రి, డాక్టర్, పోలీస్, స్నేహితుడి పాత్ర ఏకకాలంలో పోషించాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. దీనికోసం జరిపే కృషిలో సమాజమంతా భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. బాలలకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన, ఆనందకరమైన భవిష్యత్తును అందించేందుకు పిల్లల తల్లిదండ్రులతో పాటు అంతా కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈగల్ క్లబ్ సభ్యులు, డ్రగ్స్ వద్దు బ్రో నోడల్ ఆఫీసర్ వాసిరెడ్డి విజయ దుర్గ, రిసోర్స్ పర్సన్స్ తోట పూర్ణచంద్రరావు, దుర్గారావు, సీహెచ్ దొర, సమగ్ర శిక్ష, పాఠశాల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# 20 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

**- రూ.12 లక్షల విలువైన ఎర్రచందనం.. రూ.లక్ష విలువైన వాహనం సీజ్**

**చేజర్ల (నెల్లూరు), సెప్టెంబర్ 10, ప్రభాతవార్త :** చేజర్ల మండల పరిధిలోని ఆదూరుపల్లి అటవీ శాఖ చెక్‌పోస్ట్ వద్ద అటవీ అధికారులు గురువారం తెల్లవారుజామున నిర్వహించిన తనిఖీల్లో భారీగా ఎర్రచందనం దుంగలు పట్టుబడ్డాయి. అధికారులు అప్రమత్తంగా వ్యవహరించడంతో అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనం పట్టుబడింది. అటవీ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కలువాయిపొదలకూరు రహదారి మార్గంలో ఆదూరుపల్లి అటవీ శాఖ చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఒక మహీంద్రా బొలెరో ఆటో ఏపీ26టీఈ0602 వాహనం చెక్‌పోస్ట్ వద్దకు రాగానే తనిఖీలను తప్పించుకునే ఉద్దేశంతో వెనక్కి తిప్పుకుని వెళ్లేందుకు ప్రయత్నించింది. వాహనం వ్యవహారశైలిపై అనుమానం వచ్చిన అటవీ అధికారులు వెంటనే అప్రమత్తమై ఆ వాహనాన్ని వెంబడించారు. అటవీ అధికారులు వెంబడిస్తున్న విషయాన్ని గమనించిన వాహనంలోని ఇద్దరు వ్యక్తులు చిత్తలూరు గ్రామ సమీపంలో వాహనాన్ని వదిలి పరారయ్యారు. దీంతో అధికారులు వాహనాన్ని తనిఖీ చేయగా అందులో అక్రమంగా తరలిస్తున్న 20 ఎర్రచందనం దుంగలు బయటపడ్డాయి. స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగల విలువ సుమారు రూ.12 లక్షలు ఉంటుందని రాపూరు రేంజ్ ఫారెస్ట్ ఆఫీసర్ జ్యోతి ఆనంద్ తెలిపారు. అలాగే పట్టుబడిన వాహనం విలువ సుమారు రూ.1లక్ష ఉంటుందని పేర్కొన్నారు. మొత్తం సుమారు రూ.13 లక్షల విలువైన ఎర్రచందనం, వాహనాన్ని అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.పట్టుబడిన ఎర్రచందనం దుంగలతో పాటు వాహనాన్ని ఆదురుపల్లి అటవీ శాఖ కార్యాలయానికి తరలించి స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. పరారైన ఇద్దరు వ్యక్తుల ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టారు.వాహనం ఎవరిది, ఎర్రచందనం ఎక్కడి నుంచి తరలిస్తున్నారు, ఎక్కడికి తీసుకెళ్తున్నారు, ఈ అక్రమ రవాణా వెనుక ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉందనే కోణాల్లో అటవీ అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు. నిందితులను గుర్తించి పట్టుకునేందుకు చర్యలు చేపడుతున్నామని రేంజ్ ఫారెస్ట్ ఆఫీసర్ జ్యోతి ఆనంద్ తెలిపారు.ఈ దాడి, తనిఖీల్లో అటవీ శాఖకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పుతిన్, మోడీ నేడు భేటీ - బ్రిక్స్ సమ్మిట్ కోసం రేపు రానున్న జిన్‌పింగ్

**న్యూఢిల్లీ,సెప్టెంబరు 10:** దేశరాజధానిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న బ్రిక్స్‌దేశాల సదస్సుకు అగ్రరాజ్యాలఅధినేతల రాక ఖరారయింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్‌పుతిన్ శుక్రవారం మధ్యాహ్నానికి దేశరాజధానికి చేరుకుంటారు. ప్రధానిమోడీతో కలిసి ద్వైపాక్షిక భేటీ జరుగుతుంది. అటుగా బ్రిక్స్‌దేశాల శిఖరాగ్రసమావేశంలో పాల్గొంటరని క్రెమ్లిన్‌ప్రకటించింది. అదేవిధంగా ఏడేళ్ల తర్వాత చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కూడా భారత్‌కు వస్తున్నారు. బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు వస్తున్న జిన్‌పింగ్ రెండురోజులపాటు భారత్‌లోనే ఉంటారు. ఈనెల 12,13 తేదీల్లో ఆయన భారత్‌పర్యటన ఖరారయింది. అలాగే ప్రధానిమోడీతో ఒక గంటపాటు ద్వైపాక్షిక సమావేశం కూడా జరుపుతారని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. అదేవిధంగా ప్రస్తుతం యుద్ధభూమిగా మారిన మధ్యప్రాచ్యదేశం ఇరాన్ అధ్యక్షుడు మసోద్ పెజెష్కియాన్‌కూడా భారత్‌కు రానున్నారు.

# సభలో తల్లడిల్లిన బొత్స

**బొత్స కంటతడితో నెలకొన్న ఉద్వేగ వాతావరణం**



**విజయనగరం, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:** విజయనగరం జిల్లాలో మామ అల్లుళ్ల ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ కి వారే అధినాయకులు. మామ అల్లుళ్ల ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీకి హీరో ధైర్యం. అల్లుడు మాట కార్యకర్తలకు అభిమానులకు రాచ బాట మామకు అల్లుడు చెప్పిందే శాసనంగా చెప్పిందే న్యాయంగా సుమారు మూడు నాలుగు దశాబ్దాలు నుంచి చెల్లుబాటుగా వస్తుంది. ఈ వరవడితో మామా అల్లుళ్ల ఇద్దరు రాష్ట్రస్థాయిలో అధినాయకుల వద్ద మంచి గుర్తింపు పొందారు. కృష్ణార్జునుల్లా ఉన్న మామా అల్లుళ్ల స్వయంగా వారి కూతుర్లు ప్రభావంతో బ్రేకు పడినట్లు అయింది. వారిలో ఒకరు శాసనమండలిలో ప్రతిపక్ష నాయకుడైన బొత్స సత్యనారాయణ, రెండవ వారు విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉత్తరాంధ్ర స్థాయిలో తిరుగులేని మొనగాళ్లుగా పెత్తనం చెలాయించిన బొత్స మజ్జి జట్టుకు ఆత్మకంగా బ్రేక్ పడింది. జడ్పీ చైర్మన్, జిల్లా పార్టీ అధ్యక్షులుగా పదవులకు రాజీనామా చేయడము వెనువెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకోవడం జరిగిపోయింది. ఈ అనుకోని హఠాత్ పరిణామాలు అటు అధికార పార్టీ ప్రతిపక్ష పార్టీకి మింగుడు పడట్లేదు. రాజకీయపరంగా పెను సంచలనమే అయింది. ఇది నిజమా అని నిర్ధారణ చేసుకుని అందుకు వైయస్సార్ పార్టీ, టిడిపి పార్టీకి చెందిన నాయకులు ఆరాధించేందుకు మల్లగుల్లాలు పడ్డారు.. ఇలా జరగడంతో బొత్స మజ్జి కుటుంబాలకు, తీవ్ర దుమారమే రేగుతుందని ప్రజలు పరిగణిస్తున్నారు. రాజకీయ చైతన్యలుగా చేసింది నేను అయినా నా మాటనే ప్రక్కన పెట్టి స్వేచ్ఛ కోసం చేరాడని బొత్స కార్యకర్తల ముందు కంటతడి పెట్టడం ఆవశ్యకమైంది. కార్యకర్తల్లో బొత్స మజ్జి ఎటు వెళ్ళాలో తోచక అయోమయంలో పడి ఉన్నారు. చిన్న శ్రీను పార్టీలో లేకపోవడంతో పార్టీ శ్రేణులలో తీవ్ర కలకలం మొదలైంది. టిడిపిలో కూడా చిన్నశ్రీను ప్రభావం పడుతుందని ఆ వర్గాలలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

## బ్రహ్మోత్సవాల ముందే రికార్డుస్థాయిలో హుండీఆదాయం

## - రూ.6.93కోట్లు రాబడి

**తిరుమల,సెప్టెంబర్ 10ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంతవాసుడు తిరుమల శ్రీవారికి బ్రహ్మోత్సవాలకు ముందే హుండీ ఆదాయం గణనీయంగా పెరిగి 6.93కోట్లు రూపాయలు చేకూరింది. గత పదినెలల్లో ఈ ఆదాయం టిటిడి రికార్డులను బ్రేక్ చేసింది. వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామి ప్రపంచంలోనే బంగారు దేవుడుగా ,అత్యంత సంపన్నవంతమైన దేవుడుగా ఖ్యాతి గడించారు. ప్రతినెలా హుండీ ఆదాయం 120కోట్లరూపాయలకుపైగానే చేకూరుతుంది. ఈ నేపథ్యంలో గురువారం దేవదేవుడు తిరుమలేశునికి భక్తులు కానుకలుగా బుధవారం సమర్పించిన ఆదాయాన్ని లెక్కించగా 6.93కోట్లు రూపాయలు లభించింది. శ్రీవారి హుండీలో కాసులు గలగలమన్నాయి. గతంలోనూ హుండీ ఆదాయం ఒక్కరోజులో 6కోట్లు మాత్రమే దాటిందని, అయితే తాజాగా గురువారం 6.93కోట్లు రావడం విశేషం. కాగా హుండీకి కానుకలు ఆరు కోట్లు దాటడం ఇది నాలుగోసారిగా టిటిడి వర్గాల సమాచారం. ఇప్పటివరకు అత్యధికంగా 2023లో 7.68 కోట్లు రూపాయలు హుండీకి ఆదాయం చేకూరింది. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామికి భక్తులు సమర్పించే కానుకల ప్రవాహం కొనసాగుతోంది. ఇటీవలి కాలంలో నమోదైన అత్యధిక ఒక్కరోజు ఆదాయాలలో ఒకటి కావడం విశేషం. తిరుమల చరిత్రలో ఇప్పటివరకు నమోదైన అత్యధిక ఒక్కరోజు హుండీ ఆదాయం 2023 జనవరి 2న వైకుంఠ ఏకాదశి పర్వదినాన 7.68 కోట్లు రూపాయలేనని టిటిడి వెల్లడించింది. 2022 అక్టోబర్‌లో హుండీ ఆదాయం 6.31 కోట్లు, 2018 జులైలో 6.28 కోట్లు, గత ఆగస్టులో ఒకేరోజు 6.10కోట్లు ఆదాయం వచ్చింది.

11-09pg10:11-09pg10.qxd 9/10/2026 11:53 PM Page 1



## చాంగ్వాన్ వరల్డ్స్‌లో మోనాకు రజతం, అవనికి కాంస్యం

**చాంగ్వాన్:** ప్రపంచ షూటింగ్ పారా స్పోర్ట్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ డబుల్ పోడియంను కైవసం చేసుకుంది. చాంగ్వాన్‌లో గురువారం జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఎస్‌హెచ్1 ఈవెంట్‌లో మోనా అగర్వాల్ రజతం గెలుచుకోగా, రెండుసార్లు పారాలింపిక్ ఛాంపియన్ అయిన అవని లేఖర



కాంస్యం కైవసం చేసుకుంది. పారిస్ 2024 పారాలింపిక్స్‌లో కాంస్యం గెలుచుకున్న మోనా, రెండవ స్థానంలో నిలవడం ద్వారా లాస్ ఏంజిల్స్ 2028 పారాలింపిక్స్‌కు భారతదేశానికి కోటా స్థానాన్ని దక్కించుకుంది. 22 ఏళ్ల సెర్బియా క్రీడాకారిణి క్రిస్టినా ట్రిఫునోవిక్ 250.2 స్కోరుతో స్వర్ణంగెలుచుకోగా, 250.0 స్కోరుతో నిలిచిన మోనాను ఆమె స్వల్పతేడాతో అధిగమించింది. అవని 229.4 స్కోరుతో కాంస్యం గెలుచుకుంది. అలాగే నాలుగేళ్ల విరామం తర్వాత ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లకు తిరిగి వచ్చిన అవానికి కాంస్యం లభించింది. రైఫిల్ ఈవెంట్లలో రెండుసార్లు పారాలింపిక్ ఛాంపియన్‌గా, మూడుసార్లు పారాలింపిక్ పతక విజేతగా నిలిచిన అవని, పారాలింపిక్స్‌లో వరుసగా ఆర్2 స్వర్ణ పతకాలను గెలుచుకోవడంతో పాటు, ఆర్2 మరియు ఆర్8 విభాగాలలో తన తొలి ప్రపంచ ఛాంపియన్‌షిప్ టైటిళ్లను కూడా కైవసం చేసుకుంది. ఆమె చాంగ్వాన్ రేంజ్‌తో సుపరిచితురాలు, ఎందుకంటే అక్కడ జరిగిన మూడు ప్రపంచ కప్‌లలో పోటీపడి, 2022లో స్వర్ణం గెలుచుకుంది.



ఇండియన్ అథ్లెటిక్స్ సిరీస్ ఫైనల్‌లో

## హారిత విజయం

**న్యూఢిల్లీ:** ఇండియన్ అథ్లెటిక్స్ సిరీస్ ఫైనల్‌లో 100 మీటర్ల ఫైనల్‌లో విజయం సాధించి స్ప్రింటర్ హారిత భద్ర, అత్యంత వేగవంతమైన రెండవ భారతీయ మహిళగా నిలిచింది.గత ఆగస్టులో భువనేశ్వర్‌లో జరిగిన వరల్డ్ అథ్లెటిక్స్ సిల్వర్ లెవెల్ కాంటినెంటల్ టూర్ మీట్‌లో 11.46 సెకన్ల వ్యక్తిగత ఉత్తమ సమయాన్ని నమోదు చేసిన మహారాష్ట్రకు చెందిన 23 ఏళ్ల స్ప్రింటర్ హారిత గురువారం న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన ఈ ఫైనల్లో 6వ లేన్‌లో పరుగెత్తుతూ 11.22 సెకన్ల సమయాన్ని నమోదు చేసింది. దీంతో 2021 నాటి ద్యూటీ చంద్ జాతీయ రికార్డును కేవలం ఐదు వందల సెకన్ల తేడాతో కోల్పోయింది. మొదట్లో, ఐచి-నగోయాలో జరగబోయే ఆసియా క్రీడల కోసం ప్రకటించిన భారత బృందంలో హారితకు చోటు దక్క లేదు. కానీ తర్వాత చేర్చారు. ఆమె జపాన్‌లో జరిగే 200 మీటర్ల ఈవెంట్‌లో పోటీపడనుంది. ఇక తమిళనాడుకు చెందిన అభినయరాజరాజన్ (11.31 సెకన్లు, రెండవ స్థానం) మరియు గిరిధరణి రవికుమార్ (11.35 సెకన్లు, మూడవ స్థానం), అలాగే కర్ణాటకకు చెందిన ఉన్నతి బొల్లాండ (11.37 సెకన్లు, నాలుగవ స్థానం), స్నేహ ఎస్ఎస్ (11.41 సెకన్లు, ఐదవ స్థానం) కూడా తమ వ్యక్తిగత ఉత్తమ సమయాలను మెరుగుపరుచుకున్నారు. హారితతో పాటు, ఉన్నతి కూడా ఈ ఖండాంతర ఈవెంట్‌లో మహిళల 200 మీటర్ల పోటీలో పాల్గొననుంది. మహిళల 4+100 మీటర్ల రిలే ఈవెంట్ కోసం అభినయ మరియు స్నేహ ఎంపికయ్యారు.

## ఆసియా క్రీడల్లో గోల్డ్ మెడల్ లక్ష్యం

### భారత్ ప్రధాన జట్టుకే బాధ్యత

### వెస్టిండీస్ వన్డేకు టీమిండియా బి

**న్యూఢిల్లీ:** ఈ నెల 28 నుండి ప్రారంభం కాబోతున్న ఆసియా క్రీడలు 2026లో క్రికెట్ ఈవెంట్ కోసం భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) ఒక కీలక నిర్ణయాన్ని ప్రకటించింది. గోల్డ్ మెడల్ సాధించడం ప్రధాన లక్ష్యం గా ఆసియా క్రీడకు భారత్ తన ప్రధాన జట్టునే పంపేందుకు సిద్ధమవుతోంది. ఈమేరకు బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా అధికారికంగా ఈ విషయాన్ని ధృవీకరించారు. వాస్తవానికి ఆసియా క్రీడలకు భారత్ బి టీమ్‌ను పంపాలని ఆలోచన చేసిన బీసీసీఐ చివరకు ఆ ఉద్దేశ్యాన్ని మార్చుకుంది. జపాన్‌లోని ఐచినగోయాలో జరిగే ఈ క్రీడలలో బస చేయడానికి సరైన వసతులు లేవని, పిచ్ పరిస్థితులు కూడా అనుకూలంగా ఉండవని, దీనివల్ల ఆటగాళ్లకు గాయాలయ్యే ప్రమాదం ఉందనే ఉద్దేశ్యంతో ఆసియా క్రీలకు బి టీమ్‌ను పంపాలని అనుకున్నా, ఈ సమస్యలను పక్కన పెట్టి, దేశం కోసం పతకాన్ని గెలుచుకోవాలనే సంకల్పంతో బలమైన జట్లను పంపాలని నిర్ణయించుకుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 22న జపాన్‌తో జరగనున్న మ్యాచ్ కోసం కూడా ప్రధాన జట్టునే పంపుతామని బీసీసీఐ హామీ ఇచ్చింది. అయితే, ఈ కీలక నిర్ణయం షెడ్యూల్ వివాదానికి దారి తీస్తోంది. ఆసియా క్రీడలు ఈ నెల 28 నుంచి అక్టోబర్ 4 వరకు జరగనుండగా, వెస్టిండీస్‌తో స్వదేశంలో జరిగే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ఇదే నెల 27 నుంచి అక్టోబర్ 3 వరకు షెడ్యూల్ ఫిక్స్ అయింది. ఆసియా క్రీడల క్రికెట్ ఫైనల్ మ్యాచ్, వెస్టిండీస్‌తో జరిగే మూడవ వన్డే మ్యాచ్ సరిగ్గా ఒకే రోజు అక్టోబర్ 3 జరగనున్నాయి. దీంతో ఈ అసాధ్యమైన షెడ్యూల్‌ను ఎలా నిర్వహించాలనేది చర్చనీయాంశంగా మారింది. ఈ పరిస్థితి వల్ల భారత జట్టును రెండుగా విభజించాల్సిన అవసరం ఏర్పడుతుంది. శ్రేయాస్ అయ్యర్ వంటి స్టార్ ఆటగాళ్లు ఆసియా క్రీడల కంటెంజెంట్‌కు నాయకత్వం వహించడానికి జపాన్‌కు వెళ్లే



అవకాశం ఉందని తెలుస్తోంది. ఫలితంగా వెస్టిండీస్‌తో జరిగే వన్డే సిరీస్‌కు ప్రధాన జట్టులోని కొంతమంది కీలక ఆటగాళ్లు అందుబాటులో ఉండరు. ఇది రుతురాజ్ గైక్వాడ్, రజత్ పాటిదార్ వంటి ప్రతిభావంతులైన ఆటగాళ్లకు భారత వన్డే జట్టులో స్థానం దక్కించుకోవడానికి ఒక సువర్ణావకాశంగా మారనుంది. రిషబ్ పంత్ కు కూడా ఇది వన్డే క్రికెట్‌లోకి తిరిగి రావడానికి సరైన వేదికగా ఉంటుందా అనేది చూడాలి. ఈ సంక్లిష్టమైన పరిస్థితిని ఎలా నిర్వహిస్తుంది, ఏ ఆటగాళ్లను ఏ సిరీస్‌కు ఎంపిక చేస్తుంది, వన్డే సిరీస్‌కు ఎవరు నాయకత్వం వహిస్తారు అనే విషయాలపై త్వరలో స్పష్టత వచ్చే

### మహిళల హాకీ ఆసియా కప్‌లో

## పాకిస్థాన్‌పై భారత్ ఘన విజయం

**చైనా:** మహిళల జూనియర్ ఆసియా కప్-2026, క్వార్టర్ ఫైనల్స్‌లో భారత్ పాకిస్థాన్‌ను 19-0 తేడాతో చిత్తుగా ఓడించి, టోర్నమెంట్‌లోని సెమీఫైనల్స్‌లో చోటు దక్కించుకుంది. చైనాలో గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో ఏడవ నిమిషంలో పాకిస్థాన్‌పై భారత్ తరఫున పూజా సాహు తొలి గోల్ చేయగా, డిఫెండింగ్ ఛాంపియన్ అయిన భారత్ క్రమం తప్పకుండా గోల్స్ చేస్తూనే ఉండటంతో ప్రత్యర్థి పూర్తిగా నిస్సహాయంగా కనిపించింది. సానికా మానే రెండు



గోల్స్ చేయగా, అర్ధభాగం ముగిసేసరికి భారత్ ప్రత్యుత్తరం లేకుండా 10 గోల్స్ చేసింది. ఆట తిరిగి ప్రారంభమైనప్పుడు భారత్‌కు మరో తొమ్మిది గోల్స్ నమోదయ్యాయి. వీటిలో పూకా మాలిక్ హ్యాట్రిక్ సాధించగా, సుప్రియ, పూర్ణిమా యాదవ్ చెరో రెండు గోల్స్ చేశారు భారత్ యొక్క నిరంతర దాడులకు పాకిస్థాన్ తేరుకోలేకపోయింది. భారత్ ఒత్తిళ్లకు పాకిస్థాన్ తిరిగి పుంజుకోవడంలో విఫలమై ఒక్క గోల్ కూడా చేయలేకపోయింది. ఈ మ్యాచ్‌లో ఆసియా కప్‌లో జపాన్, మలేషియా, దక్షిణ కొరియాలను ఓడించి తన గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచిన భారత్, ఇప్పుడు ఫైనల్ పోరులో స్థానం కోసం దక్షిణ కొరియామలేషియా మ్యాచ్ విజేతతో తలపడనుంది. 2023, 2024లో మహిళల జూనియర్ ఆసియా కప్ టైటిల్‌ను గెలుచుకున్న భారత్, వరుసగా మూడోసారి టైటిల్ గెలుచుకోవాలని చూస్తోంది.


### 13 యేళ్ల నిరీక్షణ తర్వాత..

## దులీప్ ట్రోఫీ ఛాంపియన్‌గా ఈస్ట్ జోన్

**చెన్నై:** ఇషాన్ కిషన్ నేతృత్వంలోని ఈస్ట్ జోన్ జట్టు ప్రతిష్టాత్మక దులీప్ ట్రోఫీ టైటిల్‌ను కైవసం చేసుకుని ఛాంపియన్‌గా నిలిచింది. చెన్నైలో గురువారం జరిగిన ఫైనల్‌లో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం ఆధారంగా సౌత్ జోన్‌ను ఓడించి, ఈస్ట్ జోన్ 13 ఏళ్ల నిరీక్షణకు తెరదించింది. ఈ విజయంతో ఈస్ట్ జోన్ మూడవ దులీప్ ట్రోఫీ టైటిల్‌ను దక్కించుకుంది. ఈ మ్యాచ్‌లో తమ రెండవ ఇన్నింగ్స్‌ను తిరిగి ప్రారంభించిన ఈస్ట్ జోన్ మహ్మద్ కౌనైన్ ఖురైషీ సెంచరీతో (116) నాటౌట్‌గా నిలవగా, అనుకుల్ రాయ్ నిలకడగా అర్ధ సెంచరీ (64) సాధించాడు. దీంతో ఈస్ట్ జోన్ 99.2 ఓవర్లలో 388/7 వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో కెప్టెన్ కిషన్ 270, కుమార్ కుశాగ్ర 101 పరుగులు చేయడంతో, 708 పరుగులు సాధించి ఈస్ట్ జోన్ ఫైనల్‌పై పట్టు సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో కిషన్ మరో 80 పరుగులు జోడించి మ్యాచ్‌లో మొత్తం 350 పరుగులతో ముగించాడు. కుశాగ్ర శతకంతో పాటు, శిఖర్ మోహన్ తన దులీప్ ట్రోఫీ అరంగేట్రంలోనే అద్భుతమైన 85 పరుగులు చేశాడు. ఖురైషీ, రాయ్‌లు తమ ఏడవ వికెట్ భాగస్వామ్యాన్ని 150 పరుగులకు విస్తరించడంతో, ఈస్ట్ జోన్ మొత్తం ఆధిక్యం 700 పరుగులకు పైగా చేరింది. తర్వాతి ఓవర్‌లో స్పిన్నర్ త్రిపురాణ



విజయ్ బౌలింగ్‌లో వరుసగా రెండు సిక్సర్లు కొట్టాడు. రాయ్ ఎం.డి. నిధీష్ బౌలింగ్‌లో స్లిప్‌లో ఉన్న దేవదత్ పడిక్కల్ చేతికి చిక్కడంతో 64 పరుగుల వద్ద అతని ఇన్నింగ్స్ ముగిసింది. 100వ ఓవర్ రెండో బంతికి ఖురైషీ మిలింద్ బౌలింగ్‌లో క్యాచ్ ఇవ్వడంతో, కిషన్ పెవిలియన్ నుంచి డిక్లరేషన్‌కు సంకేతం ఇచ్చాడు. అనంతరం అంపైర్లు బెయిల్స్‌ను తొలగించడంతో, ఫైనల్ అధికారికంగా ముగిసి, ఈస్ట్ జోన్ ఛాంపియన్‌గా ఖరారైంది. ఫలితం ఖరారైనప్పటికీ సౌత్ జోన్ పేసర్ మహమ్మద్ సిరాజ్ తొమ్మిది ఓవర్ల పాటు తీవ్రంగా బౌలింగ్ చేశాడు.



## పసిడి ఇటిఎఫ్‌లలోకి పెట్టుబడుల వెల్లువ!

**ముంబయి, సెప్టెంబరు 10:** దేశీయంగా బంగారం ధరలు పరుగులు పెడుతుండటంతో పెట్టుబడిదారులు సురక్షితమైన పెట్టుబడిగా భావించే పసిడి వైపు భారీగా మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా గత ఆగస్టు నెలలో గోల్డ్ ఎక్స్‌ఛేంజ్‌ట్రేడెడ్ ఫండ్లలోకి పెట్టుబడులు వెల్లువెత్తాయి. జులైతో పోలిస్తే ఆగస్టులో ఏకంగా 67 శాతం వృద్ధితో రూ. 2,596.70 కోట్ల నికర పెట్టుబడులు వచ్చినట్లు అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (యాంఫీ) డేటా విడుదల చేసింది. జులై నెలలో గోల్డ్ ఈటీఎఫ్‌లలోకి రూ. 1,559 కోట్ల పెట్టుబడులు రాగా, ఆగస్టులో మరింత పెరిగింది. ఆగస్టు నెలలో మల్టీ కమోడిటీ ఎక్స్‌ఛేంజ్ ఎంసీఎక్స్‌లో బంగారం ధర సుమారు 7.7 శాతం పెరగడమే ఈ పెట్టుబడుల పెరుగుదలకు ప్రధాన కారణం. వరుసగా మూడో నెల కూడా గోల్డ్ ఈటీఎఫ్‌లు సానుకూల వృద్ధిని నమోదు చేయడం, బంగారం ఆధారిత పెట్టుబడి సాధనాలపై ఇన్వెస్టర్లకు పెరుగుతున్న ఆసక్తిని సూచిస్తోంది. వెండి ఈటీఎఫ్‌లు కూడా ఆగస్టులో రూ. 1, 270.63 కోట్ల నికర పెట్టుబడులను ఆకర్షించాయి. ఒకవైపు బంగారంపై పెట్టుబడులు పెరుగుతున్నప్పటికీ, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలోకి కూడా నిధుల ప్రవాహం బలంగా కొనసాగింది. మార్కెట్ ఒడుదొడుకులు ఉన్నప్పటికీ, యాక్టివ్‌గా నిర్వహించే ఈక్విటీ పథకాలలోకి ఆగస్టులో నికరంగా రూ. 29,328.62 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. జులైలో వచ్చిన రూ. 24,697.39 కోట్లతో పోలిస్తే ఇది దాదాపు 19 శాతం అధికం. ఆగస్టులో సిప్ ద్వారా వచ్చిన పెట్టుబడులు రూ. 32,297కోట్లకుచేరాయి. జులైలో ఈ మొత్తం రూ. 31,961 కోట్లుగా ఉంది. సిప్ పెట్టుబడులు నిలకడగా పెరగడం మ్యూచువల్ ఫండ్లపై చిన్న మదుపర్ల విశ్వాసానికి అద్దం పడుతోంది. గోల్డ్, ఈక్విటీ ఫండ్లలోకి పెట్టుబడులు పెరిగినప్పటికీ, మొత్తం మ్యూచువల్ ఫండ్ పరిశ్రమలోకి వచ్చిన నికర పెట్టుబడులు ఆగస్టులో గణనీయంగా తగ్గాయి.

## వాణిజ్యం



### కాగ్నిజెంట్‌పై అమెరికా కార్మికశాఖ వేటు!

**వాషింగ్టన్, సెప్టెంబరు 10:** భారత మూలాలున్న ప్రముఖ టెక్ దిగ్గజం, అమెరికాలో లిస్ట్ అయిన కాగ్నిజెంట్‌కు అక్కడ భారీ ఎదురుదెబ్బ తగిలింది. వీసా మోసం ఆరోపణలపై జరుగుతున్న దర్యాప్తులో భాగంగా, కొత్తగా గ్రీన్ కార్డ్ స్పాన్సర్‌షిప్‌ల కోసం దరఖాస్తు చేయకుండా కంపెనీపై యునైటెడ్ స్టేట్స్ కార్మిక శాఖ నిషేధం విధించింది. ఈ మేరకు డిపార్ట్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆంథోనీ డిఖిఎస్పోసిటో అధికారికంగా ప్రకటించారు. ఈ నిర్ణయం ప్రకారం కాగ్నిజెంట్ కొత్తగా పీఈఆర్ఎం (ప్రోగ్రామ్ ఎలక్ట్రానిక్ రివ్యూ మేనేజ్‌మెంట్) ఫైలింగ్స్ చేసేందుకు వీలుండదు. విదేశీ ఉద్యోగులకు శాశ్వత నివాసం (గ్రీన్ కార్డ్) కోసం స్పాన్సర్ చేయాలనుకునే కంపెనీలు తప్పనిసరిగా కార్మిక శాఖ నుంచి ఈ లేబర్ సర్టిఫికేషన్‌ను పొందాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియపైనే ఇప్పుడు సస్పెన్షన్ విధించడం గమనార్హం. ఈ పరిణామం కాగ్నిజెంట్‌పై ఆధారపడిన వేలాది మంది భారతీయ టెక్ నిపుణుల్లో ఆందోళన కలిగిస్తోంది. 1994లో చెన్నైలో ప్రారంభమై, ప్రస్తుతం అమెరికాలో ప్రధాన కార్యాలయం కలిగిన కాగ్నిజెంట్, హెచ్1బీ వీసాలను అత్యధికంగా వినియోగించుకునే సంస్థల్లో ఒకటి. 2026 ఆర్థిక సంవత్సరానికి గానూ ఈ కంపెనీకి 3,510 హెచ్1బీ వీసా పిటిషన్లు ఆమోదం పొందాయి. అమెజాన్, టీసీఎస్, ఇన్ఫోసిస్, యాపిల్, మైక్రోసాఫ్ట్ తర్వాత ఆరో స్థానంలో కాగ్నిజెంట్ ఉంది.

## సమ్మెలోకి బ్యాంకుల సిబ్బంది




### దేశవ్యాప్తంగా బ్యాంకులకు వరుసగా 4 రోజులు సెలవులు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 10:** దేశవ్యాప్తంగా బ్యాంకు ఖాతాదారులకు ముఖ్యమైన సమాచారం. సెప్టెంబర్ 11 నుంచి వరుసగా నాలుగు రోజుల పాటు బ్యాంకు సేవలకు తీవ్ర అంతరాయం కలిగే అవకాశం ఉంది. బ్యాంకు ఉద్యోగ సంఘాలు సమ్మెకు పిలుపునివ్వడం, దానికి వరుస సెలవులు జత కలవడమే ఇందుకు కారణం. దీంతో ముఖ్యమైన ఆర్థిక లావాదేవీలు ఉన్నవారు ముందుగానే తమ పనులను పూర్తి చేసుకోవాలని బ్యాంకులు సూచిస్తున్నాయి. తమ ప్రధాన డిమాండ్ల సాధన కోసం యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ సమ్మెకు పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా శుక్రవారం దేశవ్యాప్తంగా ఒకరోజు సమ్మె చేపట్టనుంది. ఆ తర్వాత రోజు 12 రెండో శనివారం, సెప్టెంబర్ 13 ఆదివారం సాధారణ సెలవులు. ఇక 14వ తేదీ సోమవారం వినాయక చవితి పండుగ సందర్భంగా పలు రాష్ట్రాల్లో బ్యాంకులకు సెలవు ప్రకటించారు. దీంతో శుక్రవారం నుంచి సోమవారం వరకు వరుసగా నాలుగు రోజులు బ్యాంకులు మూతపడనున్నాయి. వారానికి 5 రోజుల పనిదినాలను అమలు చేయాలన్నది బ్యాంకు ఉద్యోగ సంఘాల ప్రధాన డిమాండ్‌గా ఉంది. దీనిపై 2024లోనే సూత్రప్రాయ అంగీకారం కుదిరినప్పటికీ, అమలులో తీవ్ర జాప్యం జరుగుతోందని యూనియన్లు ఆరోపిస్తున్నాయి. దీంతో పాటు, సవరించిన పనితీరు ఆధారిత ప్రోత్సాహకాల పథకాన్ని సమీక్షించాలని, పెన్షన్ సంబంధిత సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నాయి. ఈ విషయమై ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్, బ్యాంకర్లతో జరిపిన చర్చలు విఫలమయ్యాయి. బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో సమ్మెను వాయిదా వేయాలని అధికారులు కోరినా, స్పష్టమైన హామీ లభించకపోవడంతో యూనియన్లు అందుకు నిరాకరించాయి. డిమాండ్లు నెరవేరని పక్షంలో తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని యూఎఫ్ బీయూ హెచ్చరించింది. సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల పాటు, అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని స్పష్టం చేసింది. ఈ సమ్మె ప్రభావం ముఖ్యంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహా ఇతర ప్రభుత్వ రంగ బ్యాంకులపై అధికంగా ఉండనుంది. ప్రైవేట్ బ్యాంకులపై ప్రభావం తక్కువగా ఉండొచ్చు. ఈ నేపథ్యంలో, ఖాతాదారులు నగదు డిపాజిట్లు, విత్‌డ్రాలు, చెక్కుల క్లియరెన్స్, రుణ సంబంధిత పనులు వంటివి 11వ తేదీ లోపే పూర్తి చేసుకోవడం మంచిది. ఏటీఎంలు, ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ వంటి డిజిటల్ సేవలు యథావిధిగా పనిచేస్తాయని బ్యాంకులు తెలిపాయి. యూఎఫ్‌బీయూ సమ్మె నోటీసు ప్రకారం బ్యాంకు ఉద్యోగులుఈనెల 11వ తేదీతో పాటు మరికొన్ని రోజుల్లోనూ సమ్మె చేస్తామని ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు. ఇందులో సెప్టెంబర్ 28, 29, 30 తేదీలు సైతం ఉన్నాయి. అప్పటికి సైతం తమ డిమాండ్లను పరిష్కరించకపోతే అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు.



## స్టాక్ మార్కెట్లకు ఊరట..

### మూడు రోజుల నష్టాలకు బ్రేక్

**ముంబయి,సెప్టెంబరు 10:** దేశీయ ఈక్విటీ మార్కెట్లు గురువారం స్వల్ప లాభాలతో ముగిశాయి. చివరి దశలో కొనుగోళ్లు ఊపందుకోవడంతో నిఫ్టీ, సెన్సెక్స్‌లు మూడు రోజుల వరుస నష్టాలకు తెరదించాయి. సాధారణ ట్రేడింగ్ సమయంలో నష్టాల్లో ఉన్న సూచీలుముగింపు వేలంలో జరిగిన కొనుగోళ్లతో కోలుకున్నాయి. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరింత పెరగడంతో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 100 డాలర్లకు పైగా కొనసాగడం మార్కెట్‌పై ప్రభావం చూపింది. బీఎస్ఈ సెన్సెక్స్ 138.36 పాయింట్లు పెరిగి 74,902.59 వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సూచీ 46.30 పాయింట్లు లాభపడి 23,477.80 వద్ద స్థిరపడింది. అంతకుముందు వరుసగా మూడు సెషన్లలో సెన్సెక్స్ 2.29 శాతం, నిఫ్టీ 1.95 శాతం చొప్పున నష్టపోయాయి.సెన్సెక్స్‌లో భారతి ఎయిర్‌టెల్ 1.34 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 0.98 శాతం, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 0.92 శాతం చొప్పున లాభపడ్డాయి. బీఎస్ఈ 150 మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.40 శాతం పడిపోగా, బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.01 శాతం స్వల్పంగా పెరిగింది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., Renigunta Road, 3rd Mile Stone, Tirupati-517507 Ph. No. 2238770, Fax:: 08772238790, RNI No.64860/9 Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act.

11 -9Pg9th cheli:11 -9Pg9th cheli.qxd 9/11/2026 12:10 AM Page 1



# చెలి

## ఏ బ్రెడ్ ఆరోగ్యానికి మంచిది !



బ్రెడ్‌ని అల్పాహారంగా తీసుకుంటూ ఉంటాం. చక్కని రుచితో పిల్లలు పెద్దలూ అంతా తినే బ్రెడ్ ఆరోగ్యకరమైన ఆహారంగా తింటూ ఉంటాం. టోస్ట్ చేసి, వెన్న రాసి, శాండ్ విచ్‌లా అయినా, లేదా పాలలో ముంచుకుని తినేందుకుకైనా, బ్రెడ్ ఆమ్లేట్ కైనా చక్కని టేస్ట్ కట్టిపడేస్తుంది. ఆరోగ్యం బాగోనివారికి తప్పకుండా బ్రెడ్ పెడుతూనే ఉంటాం. అయితే మార్కెట్లో అనేక రకాల బ్రెడ్స్ అందుబాటులోకి వచ్చాయి. విటన్నింటినీ సరైన పద్ధతిలోనే తయారు చేసారా అనేది కాస్త అను మానమే. వైట్ బ్రెడ్ చాలా ఏళ్లుగా మనకు తెలిసిందే.. అయితే బ్రౌన్ బ్రెడ్ ఈ మధ్యకాలంలో కనిపిస్తుంది. ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయం. గోధుమ రొట్టె పూర్తి గోధుమలతో తయారుచేసేది. వైట్ బ్రెడ్ పోలిస్తే బ్రౌన్ బ్రెడ్ పోషకమైనదిగా, ఫైబర్ అధికంగా ఉండట వల్ల అంతేకాదు విటమిన్ బి6, ఇ, మెగ్నీషియం, పోలిక్ యాసిడ్, జింక్ కాపర్, మాంగనీస్ అధికంగా ఉన్నాయి. తెల్ల రొట్టె తయారీకి గోధుమ పిండినే బెంజాయిల్ పెరాక్సైడ్, క్లోరిన్ డయాక్సైడ్, పొటాషియం బ్రోమేట్ వంటి రసాయనాలను ఉపయోగించి బ్లీచ్ చేస్తారు. దీని కారణంగా పిండి తెల్లగా మారి కనిపిస్తుంది. వైట్ బ్రెడ్‌లో ఫైబర్, పోషకాలు తక్కువగా ఉంటాయి. కానీ బ్రౌన్ బ్రెడ్ కంటే ఎక్కువ కాల్షియం ఉంటుంది.వ. బ్రౌన్ బ్రెడ్ కంటే వైట్ బ్రెడ్‌లో ఎక్కువ కేలరీలు ఉంటాయి. వైట్ బ్రెడ్ స్లైస్‌లో 77 కేలరీలు ఉండే,బ్రౌన్ బ్రెడ్ స్లైస్‌లో 75 కేలరీలు ఉన్నాయి. వ వైట్ బ్రెడ్‌తో పోలిస్తే బ్రైన్ బ్రెడ్‌లో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. కేలరీల కంటెంట్ పరంగా, రెండు రకాల బ్రెడ్‌ల మధ్య పెద్దగా తేడా లేదు. పోషకాల విషయానికి వస్తే, బ్రౌన్ బ్రెడ్ ఖచ్చితంగా వైడ్ కంటే ఎక్కువ పోషకాలను కలిగి ఉంటుంది. ☐

## సిస్టమ్ వెలుతురు కళ్లపై ..



ప్రతి గంట కోసారి కుర్చీ లోంచి లేచి అలా నాలుగు అడు గులు వేయాలన్నది తెలిసిందే కదా! కానీ చాలామంది ఉద్యోగినులు రోజు మొత్తంలో మరీ అవసరమైతే తప్ప సీటులోంచి లేవడానికి ఇష్టపడటం లేదట. తదేకంగా సిస్టమ్‌ని చూసీచూసీ సాయంత్రానికి కళ్లు లాగడం, మంటలు వగైరా! మీదీ అదే ఇబ్బందా? అయితే 20-20-20 సూత్రాన్ని పాటించేయండి. అసలు కళ్లార్పుతున్నారా.. గమనించుకోండి. పని హడావుడిలో ఇవేం పట్టించుకుంటాం అంటారా? సిస్టమ్ చూసేప్పుడు సాధారణంగానే కళ్లు ఆర్పడం మార్చిపోతుంటాం. దీంతో అవి పొడిబారి నొప్పులు, మండటం లాంటివి కనిపిస్తాయి. ప్రతి 20 నిమిషాలకు ఒసారి పని పక్కన పెట్టండి. కనీసం 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువును 20 సెకన్లపాటు కళ్లార్పకుండా చూడండి. ఇలా చేస్తూ ఉంటే కళ్లకూ వ్యాయామం, విశ్రాంతీ దొరుకుతుంది. సమయం గుర్తుండదు అనిపిస్తే అలారం పెట్టుకున్నా సరే! తరచూ తలనొప్పి, పనిపై దృష్టి పెట్టలేకపోవడం, మెడనొప్పి.. వగైరా వచ్చినప్పుడు తెగ ఇబ్బంది పడతాం కదా! నిజానికి కళ్లు మూసుకోండి. తర్వాత నెమ్మదిగా తెరిచి, అర నిమిషం పాటు ఆపకుండా కళ్లార్చాలి. అప్పుడు తేమ అంది ఉపశమనం కలుగుతుంది. ప్రతి అరగంటకు ఓసారి సిస్టమ్ నుంచి కళ్లు మరల్చి, వేరే పనిమీద దృష్టిపెట్టండి. వీలుంటే గంటకోసారి అలా పక్కకు వెళ్లినా మంచిదే. కళ్లతోపాటు శరీరానికీ మేలు కలుగుతుంది. సమయం వృథా అనుకుం టాం కానీ, ఇలా చేయడం వల్ల మెదడూ శాంతపడుతుంది. కనీసం అయిదు నిమిషాలైనా అలా నడుస్తూ ఉండండి మరి. సిస్టమ్ నుంచి వచ్చే వెలుతురు, సన్నని అక్షరాలు కూడా కళ్లపై ప్రభావం చూపేవే ! కాబట్టి, వెలుతురు మరీ ఎక్కువ కాకుండా చూసుకోండి. అలాగే అక్షరాల సైజును పెంచు కోండి. చాలా వరకూ వాటిపై భారం తగ్గుతుంది. ☐

## పంచుకోవడం నేర్పుతున్నామా ?



**ఎంతో ఇష్టంగా ఆడుకొనే తన బొమ్మను చింటూ మరెవ్వరికీ ఇవ్వడు. కానీ..** పక్కింటి రాహుల్ కారు కావాలని పేచీ పెడుతుంటాడు. పిల్లలు చిన్నప్పటి నుంచి తమవద్ద ఉన్నదాన్ని తోటివారితో పంచుకోవడానికి ఇష్టపడుతూన్నరా లేదా.. తల్లిదండ్రులు గుర్తిస్తుండాలి. ఎందుటివారి నుంచి తీసుకోవడమే కాకుండా తనవద్ద ఉన్న దాన్నివ్వడం కూడా నేర్పించాలి.

లేదంటే ఇది భవిష్యత్తులో వారి వ్యక్తిత్వ లోపమయ్యే ప్రమాదవం ఉంది. పిల్లలు తమ బొమ్మలతో ఇతర పిల్లలనూ ఆడుకోనివ్వాలని చెబితే ఒప్పుకోకపోవచ్చు ఈ అలవాటు రావాలంటే తగిన వాతావరణాన్ని తల్లిదండ్రులు కల్పించాలి. నలుగురైదుగురిని బృందంగా ఒకచోట ఆడుకునేలా ప్రోత్సహించాలి. ఆ సందర్భాన్ని వేదికగా తీసుకున్న ఒకరి బొమ్మలను మరొకరు కలిసి పంచుకోవడమెలాగో నేర్పించాలి. అందరం ఒక్కటే అనే భావన వచ్చేలా చేయాలి. దీంతో తనకెంతో ఇష్టమైన బంతి లేదా కారు బొమ్మను మరొకర పిల్లాడు తీసుకెళ్లి పోతాడేమో అనే భయం నెమ్మదిగా వారిలో దూరమవుతుంది. ఆవతలివాడి వల్ల ఉన్న అందమైన బొమ్మ తన వద్ద లేదనే అసూయా తగ్గుతుంది. ఇతరుల వస్తువులను తీసుకవోడమే కాదు.. తన బొమ్మల్ని వారితో పంచుకునే అలవాటూ ఏర్పడుతుంది. ఇంట్లో లేదా మైదానంలో అందరూ కలిసి ఆడుకునేటప్పుడు బాబు చేతిలో అందరికీ సరిపడా బిస్కెట్లో, చాక్లెట్లో ఇచ్చి అందరికీ సమానంగా పంచమన్నాలి. అది వారిలో ఐకమత్య భావనను తెస్తుంది. ఎదుటివారికి ఏదైనాఇచ్చినప్పుడు కలిగే సంతోషం వారికర్థమవుతుంది. పిల్లలందరినీ ఒక చోటచేర్చి క్లే బొమ్మలు వేసిన రంగులేయడం చిత్ర లేఖనాలు గీయడం వంటి ఆర్ట్ ప్రాజెక్టులను సరదాగా చేయించాలి. సమష్టిగా చేయించే తోటపని వారి మధ్య స్నేహబంధానాన్ని పెంచుతుంది. స్నేహితులతో ఆటవస్తువులు పంచుకోవడమే కాదు తెలియని వారికి సాయం చేయడమెలాగో కూడా బాల్యం నుంచే నేర్పాలి. నెలకోసారైనా అనాథాశ్రమాలకు తీసుకెళ్లి ఆ పిల్లలను పరిచయం చేయాలి. ప్రత్యేక దినాల్లో వారికి కానుకలిచ్చేలా ప్రోత్సహించాలి. ఈ అలవాటు కష్టంలో ఉన్నవారికి సాయం చేయాలనే ఆలోచనలకు చిన్నవయసులోనే బీజం పడేలా చేస్తుంది. ఇచ్చిపుచ్చుకోవడం ద్వారా దక్కే ఆనందం ఎలా ఉంటుందో కూడా తెలుసుకోగలుగుతారు. ☐

## లక్ష్మీదేవి నివాస స్థానాలు న



జీవితంలో ఆర్థికపరమైన సమస్యలు .. మిగతా సమస్యల కంటే ఎక్కువగా బాధిస్తుంటాయి. అలాంటి ఆర్థికపరమైన ఇబ్బందులు లేకుండా ఉండాలంటే అందుకు లక్ష్మీదేవి అనుగ్రహం ఉండాలి. లక్ష్మీదేవి అను గ్రహం కలగాలంటే ఆ తల్లికి ఇష్టమైనట్టుగా నడచుకోవలసి ఉంటుంది. పాలు .. పూలు .. పసుపు .. కుంకుమ .. దీపం .. గోవు .. ధనం .. ధాన్యం .. ఇవన్నీ లక్ష్మీదేవి నివాస స్థానాలుగా చెప్పబడుతున్నాయి. అందువలన వాటి విషయంలో ఎప్పుడూ నిరక్ష్యంగా వ్యవహరించ కూడదని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. వాటి విషయంలో ఎప్పుడూ భక్తి శ్రద్ధలతో వ్యవహరించవలసి ఉంటుంది. అలాగే బాగా పొద్దుపోయేవరకూ నిద్రించేవారి ఇళ్లలోను .. సాయంత్రపు వేళలో నిద్రించే వారి ఇళ్లలోను లక్ష్మీదేవి ఉండదు. కష్టపడకుండా సోమరితనంతో కాలాన్ని వృథా చేసేవారి ఇళ్లను లక్ష్మీదేవి విడిచిపెట్టేస్తుంది. ఇక ఎప్పుడు చూసినా కలహాలతో వుండే ఇళ్లలోకి లక్ష్మీదేవి పొరపాటున కూడా కాలు పెట్టదట. ఎక్కడైతే పవిత్రత .. ప్రశాంతత ఉంటాయో అక్కడ లక్ష్మీదేవి అనుగ్రహం

## దువ్వెన శుభ్రతకు వెనిగర్ !



**దువ్వెనలో మురికి** పేరుకుని నల్లగా కనిపిస్తే తప్ప దాన్ని శుభ్రం చేయాలన్న ధ్యాసే ఉండదు కొందరికి. కానీ ఆ నిర్లక్ష్యం మనకి ఎంత చేటు చేస్తుందో తెలుసా? తల్లో చుండ్రు, ఇన్‌ఫెక్షన్లు రావడానికి ఈ మురికే కారణం. అందుకే ఎప్పటి కప్పుడు దువ్వెనలని ఇలా శుభ్రం చేసేకుందాం...

✦ బేకింగ్ సోడాలో కాసిని నీళ్లు కలిపి ఈ మిశ్రమంలో దువ్వెనను కనీసం అరగంట నాననివ్వాలి. ఆపై టూత్ బ్రష్‌తో తేలిగ్గా శుభ్రం చేసేయొచ్చు. ✦ వెడల్పాటి గిన్నెలో కొద్దిగా షాంపూ వేసి, తగినన్ని నీళ్లు కూడా వేసి ఆ నీటిలో హెయిర్ బ్రష్‌ను ఓ ఐదు నిమిషాలు ఉంచాలి. మురికంతా పోయి దువ్వెన శుభ్రపడుతుంది. ✦ వెనగర్ సహజ క్రిమిసంహారకం. ఒక బౌల్‌లో కొద్దిగా వెనిగర్ వేసి తగినన్ని నీళ్లు కలిపి దువ్వెనలని ఉంచాలి. తర్వాత గోరువెచ్చని నీళ్లతో కడగాలి. వెనిగర్‌కి బదులుగా నిమ్మ రసాన్నీ ప్రత్యామ్నాయంగా వాడుకోవచ్చు. ఇవి మురికిని తొలగించడంతో పాటు చక్కని పరిమళాన్ని కూడా ఇస్తాయి. ☐

## పులిహోర పౌడర్



పూజ,వ్రతం, పెళ్లి, పేరంటం.. ఇలా ఎన్నో సందర్భాల్లో పులిహోర తప్పని సరిగా ఉంటుంది. దీన్ని ఇష్టపడనివాళ్లు దాదాపుగా ఉండరు. చింతపండు పులుసు ఉడికించటానికి ఎక్కువ టైం పడుతుంది. పులి హోర మిక్స్ గనుక ఉందంటే క్షణాల్లో పనైపోతుంది. అది కొనకుండా మనమే చేసుకోవచ్చు. యాపిల్ పండంత చింతపండు, అందులో ఎండు బెల్లం, అర కప్పు కొబ్బరి తురుము, 6 చెంచాల ఉప్పు (మీకు తగ్గట్టు కాస్త ఎక్కువ లేదా తక్కువ వేసుకో వచ్చు), 5 చెంచాల నువ్వులు, 15 ఎండుమిరప కాయలు, 4 చెంచాల చొప్పున శనగ, మినప్పప్పులు, జీలకర్ర, ధనియాలు, అరంచా, మిరియాలు, ఆవలు తాలింపు.. 5 చెంచాల పల్లీలు,నువ్వులు, 2 చెంచాల చొప్పున శనగ, మినప్పప్పులు, చెంచ ఆవాలు, చారెడు జీడిపప్పు, పావు కప్పు నూనె, ఆరేడు కరివేపాకు రెబ్బలు తీసుకోవాలి.

**తయారీ:** నువ్వులు, ఎండుమిర్చి, శనగ మినప్పప్పులను విడివిడిగా వేయించాలి. వాటిని తీసి.. ఆవాలు, మెంతులు, మిరియాలు, ధనియాలు, జీలకర్రలను మంచి వాసన వచ్చేదాకా వేయించాలి. అన్నీ చల్లారాక కొబ్బరి తురుము, పసుపు, ఇంగువ, జత చేసి గ్రైండ్ చేయాలి. చింతపండు పొడిపొడిలాడేలా దాన్ని కూడా కొంచెం వేయించి.. బెల్లం పొడి, ఉప్పు కలిపి నూరి... పప్పుల మిశ్రమంలో కలపాలి. ప్యాన్‌లో నూనె వేడయ్యాక.. పల్లీలు, ఆవాలు, శనగపప్పు, మినప్పప్పు, జీడిపప్పు, నువ్వులు, కరివేపాకు ఒక్కొక్కటిగా వేయాలి. ఈ తాలింపు చల్లారనిచ్చి. పౌడర్‌లో కలపాలి. దీన్ని తడిలేని గాలిచొరబడని సీసాలో భద్రం చేసుకుంటే వేడి అన్నంలో కలిపి ఎంచక్కా తినొచ్చు. ☐

# తెర

## అక్టోబర్ 9న థియేటర్స్‌లోకి 'అ'చిత్రం




అక్టోబర్ 9న థియేటర్స్‌లోకి 'అ' రాహుల్ విజయ్, ఆర్చన అయ్యర్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న 'ఎహెచ్' సినిమాపై ఇప్పటికే మంచి బజ్ నెలకొంది. ఇటీవల అడివి శేష్ విడుదల చేసిన సినిమా టైటిల్, ఫస్ట్ లుక్‌కు మంచి స్పందన రావడంతో.. తాజాగా చిత్రబృందం 'బ్లడీ హాంగర్'పేరుతో ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేసింది. డెబ్యూ ప్రొడక్షన్ హౌస్‌లు స్టార్ బాక్స్ స్టోరీస్, రిపుల్ స్లైడ్ స్టూడియోస్ బ్యానర్లపై రూపొందుతున్న ఈ థ్రిల్లర్‌లో రాహుల్ విజయ్, ఆర్చన అయ్యర్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. కనకరావు తొనంగి, అభిషేక్ కె, ప్రముఖ ఎడిటర్ గ్యారీ బిహెచ్ నిర్మాతలుగా వ్యవహరిస్తుండగా.. సాయి బాలి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం 2026 అక్టోబర్ 9న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది. డైలాగ్స్ లేకుండా రూపొందించిన ఈ గ్లింప్స్.. భయానక విజువల్స్, ఆసక్తికరమైన కథనంతో మొదటి నుంచే ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. యువతుల అదృశ్యానికి సంబంధించిన ఓ ఉత్కంఠభరితమైన దర్యాప్తు చుట్టూ కథ సాగనున్నట్లు గ్లింప్స్ ద్వారా తెలుస్తోంది. అదే సమయంలో చీకటిలో పనిచేస్తున్న ఓ మిస్టీరియస్ దుష్టశక్తిని కూడా పరిచయం చేసింది.ఆకట్టుకునే విజువల్స్, షార్ప్ ఎడిటింగ్, సస్పెన్స్‌తో కూడిన నెరేషన్ ప్రేక్షకుల్లో నిరంతరం టెన్షన్‌ను పెంచుతున్నాయి. 'అమ్మాయి', అదృశ్యం,'అన్వేషణ' అనే పదాలను ఉపయోగిస్తూ సినిమా ప్రధానంగా ఇన్వెస్టిగేషన్ నేపథ్యంలో సాగనుందని ఆసక్తికరంగా వెల్లడించారు. శ్రీచరణ్ పాకాల అందించిన థంపింగ్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ భయాన్ని, ఉత్కంఠను మరింత పెంచింది. ఈ గ్లింప్స్‌లో రాహుల్ విజయ్‌ను ఓ సీన్సియర్ పోలీస్ ఆఫీసర్‌గా పరిచయం చేశారు. ఇన్వెస్టిగేషన్ డ్రామాలో ఆయన కమాండింగ్ స్క్రీన్ ప్రెజెన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఆర్చన అయ్యర్ కనిపించిన కొన్ని ఆసక్తికరమైన సన్నివేశాలు మిస్టరీని మరింత పెంచుతున్నాయి.

## 'ఎపిక్'- ఒక బ్యూటిఫుల్ సినిమా : విజయ్ దేవరకొండ




ఆదిత్య హాసన్ రచన చాలా బాగుంది.. 'ఎపిక్' ఘన విజయం సాధించాలని కోరు కుంటున్నాను: ప్రముఖ దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా ఫ్యామిలీతో హ్యాపీగా వెళ్ళి చూసే సినిమా"ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్ : నిర్మాత సూర్యదేవర నాగవంశీ బ్లాక్ బస్టర్ 'బేబీ' జోడీ ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటించిన మోస్ట్ అవైటెడ్ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్. '90ఎస్' వెబ్ సిరీస్ తో తెలుగు ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న యువ దర్శకుడు ఆదిత్య హాసన్, ఈ చిత్రంతో వెండితెరకు దర్శకుడిగా పరిచయం అవుతుండటం విశేషం. 'ఎపిక్' చిత్రం, సెప్టెంబర్ 11, 2026న థియేటర్లలో అడుగుపెట్టనుంది. రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ మాట్లాడుతూ.. "అభిమానులను ఇలా కలుసుకోవడం సంతోషంగా ఉంది. వచ్చే మూడు నెలలు రెగ్యులర్‌గా కలుస్తుంటాను. సెప్టెంబర్ 11న ఆనంద్ దేవరకొండ సినిమా ఉంది. అక్టోబర్ 16న విజయ్ దేవరకొండ సినిమా ఉంది. నవంబర్ లో దేవరకొండ రష్మిక సినిమా ఉంది. ఇప్పుడు రణబాలి సెట్ నుంచే వచ్చాను. ఈ సంవత్సరం తెలుగు సినిమాకి చాలా చాలా బాగుంది. వరుసగా సినిమాలు విజయం సాధిస్తున్నాయి. ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ.. 'అర్జున్ రెడ్డి ప్రమోషన్స్ సమయంలో మేము అమెరికా వెళ్ళాము. అప్పుడు అక్కడ ఆనంద్ ఐటీ జాబ్ చేస్తున్నాడు. ఆ సమయంలో కలిసినప్పుడు సినిమా ల గురించి మాతో మాట్లాడేవాడు. చూస్తే ఐటీ జాబ్ చేస్తున్నాడు, కానీ మాకు ఉన్నంత సినిమా పిచ్చి ఉందేంటని అప్పుడే అనుకున్నాను. కట్ చేస్తే దొరసాని సినిమాతో హీరో అయిపోయాడు. కథానాయకుడు ఆనంద్ దేవరకొండ మాట్లా డుతూ.. 'ఎపిక్' అనేది మనందరి సినిమా. 23, 26 ఏళ్ల వయసులో ఉన్నప్పుడు మనకి కుటుంబం గురించి, ప్రేమ గురించి, బాధ్యతల గురించి ఆలోచనలు ఉంటాయి

## 'చకోర 'మూవీ 'ధమ్ ధమ్' సాంగ్ రిలీజ్



'మాస్ పోయెట్రీతో మ్యూజికల్ లవ్ స్టోరీగా తెరకెక్కిన"చకోర - Lunar Love Bird చిత్రంలోని సెకండ్ ఎనర్జటిక్ సాంగ్"ధమ్ ధమ్, లిరికల్ వీడియోను బిజు ప్రకాష్ కుమార్ ఆవిష్కరించారు. High Joy Commercials బ్యానర్‌పై డా. చింతాడ హేమారావు నిర్మాతగా, VIP Ð Vintage Iconic Pictures నిర్మాణ సారథ్యంలో ఈ చిత్రం రూపొందుతోంది. ప్రముఖ దర్శకుడు పూరి జగన్నాథ్ వద్ద ఫస్ట్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన మంగా శ్రీనివాస్ ఈ చిత్రంతో నూతన దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. శ్రవణ్, మల్లైకా టి. వాసుపల్‌ను సరికొత్త ప్రేమ జంటగా పరిచయం చేస్తూ ఈ సినిమా తెరకెక్కింది. ఆణిముత్యాల్లాంటి పాటలతో రూపొందుతున్న ఈ చిత్రానికి ప్రిన్స్ హెన్రీ సంగీతం అందిస్తున్నారు. రామజోగయ్య శాస్త్రీ ఈ సాంగ్ కు సాహిత్యం అందించారు. డాన్స్ మాస్టర్ మెహార్ బాబా కొరియోగ్రఫీ అందించారు. నూతన గాయని అభిఖ్య తనికెళ్ళ ఈ ఎనర్జటిక్ సాంగ్‌ని పాడారు.. ఈ సాంగ్ యువతని ఊర్రూతలూగించేలా ప్రేక్షకులను ఆకట్టుకుంటుం దని ఈ సందర్భంగా మ్యూజికల్ హీరో ప్రముఖ సంగీత దర్శకులు శ్రీ.బిజు ప్రకాష్ కుమార్ ప్రశంసించారు. చకోర - Lunar Love Bird చిత్రం ప్రపంచవ్యాప్తంగా అక్టోబర్ 8న థియేటర్లలో విడుదల కానుంది.

## విజయ్ నట విశ్వరూపం 'రణబాలి'




అక్టోబర్ 16న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తున్న మూవీ విజయ్ దేవరకొండ అభిమానులు, మూవీ లవర్స్ ఆత్రుతగా ఎదురుచూస్తున్న "రణబాలి" సినిమా టీజర్ వచ్చే సింది. ఈ టీజర్ విజయ్ దేవరకొండ నట విశ్వరూపాన్ని చూపిస్తూ గూస్ బంప్స్ తెప్పి స్తోంది. రాక్షస రాజుగా పేరున్న సర్ థియోడర్ హెక్టార్ ఆజ్ఞపై పండిన ప్రతి ధాన్యపుగింజను దోపిడీ చేస్తూ అన్నపూర్ణగా వెలిగిన మన నేలను కరువు సీమగా మార్చే స్తుంటారు బ్రిటీష్ అధికారులు. ఆకలి అని అడిగిన వారిని క్రూరంగా చంపేస్తుంటారు. ఈ రాక్షస రాజు సర్ థియోడర్ హెక్టర్ కు, అతని అధికారులను తన ధైర్య సాహసాలతో అంతే క్రూరంగా ఎదుర్కొంటాడు రణబాలి. గుండె ధైర్యం నిండిన అతని దాటికి, పదునెక్కిన అతని కత్తి వేటుకి బ్రిటీష్ అధికారులు, పోలీసులు చెల్లాచెదురు అవుతారు. ఒక్క ధాన్యపు గింజ పొలిమేర దాటకుండా కాపలా కాస్తూ తన ప్రజల ఆకలి తీర్చుతాడు రణబాలి. అతని పేరేంటని ఆరా తీసిన బ్రిటీష్ అధికారులకు 'శింగనమల బొబ్బిలి రణబాలిరా..నీ యక్కా' అంటూ పౌరుషంగా సమాధానం ఇస్తాడు. ఆ కొండపైనున్న మా భద్రమల్లాడి మీద ఆన.. నేను కాయలి కాసాండంగా, ఒక్క మెతుకు గూడ పొలిమేర దాడదు చెప్తన్నా..అంటూ రణబాలి పాత్రలో విజయ్ చెప్పిన డైలాగ్ గూస్ బంప్స్ తెప్పిస్తోంది. 'రణబాలి' చిత్రంతో దర్శకుడు రాహుల్ సంకృత్యన్ ప్రేక్షకులకు మరపురాని సినిమా టిక్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వబోతున్నట్లు ఈ టీజర్‌తో తెలుస్తోంది.

## 'హైకూ' టీజర్ లాంచ్



"హైకూ' టీజర్‌ను లాంచ్ చేసిన రొమాంటిక్ స్టార్ హరీష్ కళ్యాణ్.. సిద్ధు కుమార్ మెలోడీ మ్యూజిక్, దర్శకుడు యువరాజ్ చిన్నసామి ఫ్రెష్ ప్రజెంటేషన్‌తో ఆకట్టుకుంటోన్న సినిమా విజన్ సినిమా హౌస్ బ్యానం"పై ఏగన్ హీరోగా నటిస్తోన్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'హైకూ' ఈ మూవీ టీజర్‌ను ప్రముఖ రొమాంటిక్ హీరో హరీష్ కళ్యాణ్ రిలీజ్ చేశారు. కలం"ఫుల్ విజువల్స్, యూత్‌ఫుల్ ట్రీట్‌మెంట్, పొయెటిక్ లవ్‌స్టోరీగా రూపొందిన ఈ టీజర్ చూడగానే ఆకట్టుకుంటోంది. ఈ అందమైన రంగుల ప్రేమ ప్రపంచానికి ఏగన్, శ్రీదేవిలే సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలుస్తున్నారు. వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ, హావభావాలు టీజర్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. గతంలో కోళీ పన్నై, చెల్లదురై, చిత్రాల్లో తన సహజమైన, పల్లెటూరి నేపథ్యానికి తగ్గ నటనతో ప్రశంసలు అందుకున్న ఏగన్.. 'హైకూ'లో మాత్రం సరికొత్త అవతార్‌లో కనిపిస్తున్నాడు. సిటీ కల్చర్‌కు తగ్గ కూల్, అమాయకమైన పక్కింటి అబ్బాయి తరహా పాత్రలో ఏగన్ ఫ్రెష్ లుక్‌తో ఆకట్టు కుంటున్నాడు. 'హైకూ' లోని రొమాంటిక్ ఫీల్‌కు సిద్ధు కుమార్ సంగీతం మెయిన్ ఎసెట్‌గా మారింది. ముఖ్యం గా మృదువైన వయొలిన్ బిట్స్‌ను క్లాసికల్ రాగాలు, కాంటెం పరరీ ఫ్యూజన్‌తో మేళవించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్.. ఆహ్లాదకరమైన విజువల్స్‌కు చక్కగా తోడై టీజర్‌కు మరింత మ్యూజికల్ ఫీల్‌ను తీసు కొచ్చింది. హైకూ టీజర్ ఇప్పటికే సినీ ప్రియుల దృష్టిని ఆకర్షిస్తోంది. తమిళ ప్రేక్షకుల్లో రొమాంటిక్ కథలకు మరో సారి మంచి ఆదరణ లభిస్తోన్న సమయంలో ఈ టీజర్ రావడం సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది.

## 'ఐ బొమ్మ' ట్రైలర్ లాంచ్ ఈవెంట్



బానోత్ పవన్, గౌతమ్, నర్మద, సతీష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా "ఐ బొమ్మ". ఈ చిత్రాన్ని శ్రీ మల్లన్న క్రియేషన్స్ బ్యానర్ పై కురువ జమన్న నిర్మిస్తున్నారు. విజయ్ రఘునాథభట్ల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా త్వరలో వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. బుధవారం హైదరా బాద్ లో "ఐ బొమ్మ" సినిమా ట్రైలర్ లాంఛ్ ఈవెంట్ ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలోఅతిథిగా వచ్చిన నిర్మాత రామ సత్యనారాయణ మాట్లాడుతూ "ఐ బొమ్మ' సినిమా ట్రైలర్ బాగుంది. ఈ రోజు సమాజంలో జరుగుతున్నదే కథగా చూపించారు. ఈ చిత్ర టీమ్‌కు ఆల్ ది బెస్ట్ చెబుతున్నా. చిన్న చిత్రాల నిర్మాతలకు క్యూబ్ యూఎఫ్ వో ఛార్జీలు భారంగా మారుతున్నాయి. అన్నారు.అతిథిగా వచ్చిన ప్రొడ్యూసర్ రాజా మాట్లాడుతూ నేను వర్జిన్ బాయ్స్ సినిమా నిర్మించిన తర్వాత డైరెక్టర్ విజయ్ నా దగ్గరకు వచ్చి కలిశాడు. రెండు మూడు స్క్రిప్ట్స్ కూడా చెప్పాడు. మంచి టాలెంట్ ఉన్న యువ దర్శకుడు విజయ్. ఐ బొమ్మ సినిమా ట్రైలర్ బాగుంది. మూవీ ప్రొడ్యూసర్ కురువ జమన్న మాట్లాడుతూ మా వృత్తి వ్యవసాయం. సినిమాల మీద ఇష్టంతో చిత్ర నిర్మాణంలోకి వచ్చాను. దర్శకుడు విజయ్ చెప్పిన కథ బాగా నచ్చింది. ఈ కథను ప్రేక్షకులు ఆసక్తిగా చూస్తారనే నమ్మకం ఉంది. డైరెక్టర్ విజయ్ రఘునాథభట్ల మాట్లాడుతూ గతేడాది అంతా ఐ బొమ్మ గురించే న్యూస్ వైరల్ అయ్యిం ది. మనలో చాలా మంది ఐ బొమ్మ పైరసీ సినిమాలు చూసే ఉంటారు. ఈ సైట్ ఇప్పుడు లేదు కానీ అసలు ఆ సైట్ ప్రారంభించడం వెనక, నిర్వహించడం వెనక ఏం జరిగింది అనేది అందరికీ ఆసక్తికరమే. జీవితంలో కొన్ని సంఘర్షణలకు లోనైన ఓ వ్యక్తి సమాజానికి వ్యతిరేకంగా ఎలా అడుగువేశాడు. అతన్ని ఈ వ్యవస్థ ఎలా పట్టుకుంది. నటుడు బానోతు పవన్ మాట్లాడుతూ చిత్ర పరిశ్రమలో అవకాశాల కోసం ఎంతో ప్రయత్నిం చాను. నటుడు గౌతమ్ మాట్లాడుతూ ఈ చిత్రంలో డీఎస్ పీ విక్రమ్ పాత్రలో నటించాను. నటుడు సతీష్ మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న ఒక వర్తమాన సమస్యను ప్రేక్షకులకు సినిమాగా చూపిస్తే బాగుంటుందనే ఆలోచనతో ఈ చిత్రాన్ని డైరెక్టర్ విజయ్ రూపొందించారు.

## 'కాగితం పడవలు' 18న విడుదల

వర్ధన్, కృష్ణప్రియ హీరో హీరోయిన్లుగా ఎంజీఆర్ తుకారాం దర్శకత్వంలో తెరకెక్కుతున్న బ్యూటిఫుల్ లవ్‌స్టోరీ"కాగితం పడవల్లు. ఎస్ఎల్ఎన్ సినీ క్రియేషన్స్, ప్రణధి క్రియేషన్స్, నవ నారాయణ సినీ క్రియేషన్స్ బ్యానర్లపై కీర్తన నరేష్, టి.ఆర్.ప్రసాద్ రెడ్డి, వెంకట్రాజుల, గాయత్రమ్మ అంజనప్ప నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ కు అద్భుతమైన స్పందన వచ్చింది. సెప్టెంబర్ 18న ఈ చిత్రం ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ద్వారా గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది.

# 'బ్రిక్స్' సమ్మిట్‌కు అగ్రరాజ్యాల అధినేతలు




## రేపు, ఎల్లుండి అంతర్జాతీయ సదస్సు

## ఢిల్లీలో భారీగా భద్రతా ఏర్పాట్లు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 10:** దేశరాజధాని ఢిల్లీ నగరం బ్రిక్స్ సదస్సుకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో ఢిల్లీలో అధికారులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. 18వ బ్రిక్స్ సదస్సు ఢిల్లీలో సెప్టెంబరు 12, 13వ తేదీల్లో జరగనుంది. 11వ తేదీ నుంచే అతిథులు రానున్నారు. అక్కడి భారత్ మండపంలో జరగనున్న ఈ అంతర్జాతీయ సదస్సుకు రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ వంటి నేతలు హాజరవుతున్నారు. అందుకే భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. సదస్సు జరిగే ప్రాంతాలతోపాటు, అతిథులు బస చేసే హోటళ్ల వద్ద కనీవిని ఎరుగని భద్రతా ఏర్పాట్లు చేశారు. దాదాపు 500 సిసిటివి కెమెరాలు ఏర్పాటు చేశారు. తుగ్లక్‌రోడ్ పోలీస్ స్టేషన్‌లో కంట్రోల్‌రూం ఏర్పాటు చేశారు. 7,000 మంది భద్రతా సిబ్బందిని నియమించారు. వీరిలో ఢిల్లీ పోలీసులతోపాటు పారామిలిటరీ దళాలు, ఎన్ఎస్‌జీ, ఐబీ, ఇతర విభాగాలకు చెందిన సిబ్బంది పని చేస్తున్నారు. మరోవైపు అంతర్జాతీయ అతిథులు వస్తున్నందున ఢిల్లీ నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. న్యూఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సుందరీకరణ బాధ్యతలు చేపట్టారు. 15,000కుపైగా పూల మొక్కల్ని ఏర్పాటు చేశారు. బ్రిక్స్ సదస్సుకు ప్రధాని మోడీ నేతృత్వం వహిస్తారు. పుతిన్, జిన్‌పింగ్, పెజెష్కియాన్‌తోపాటు దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామ్‌ఫోసా వంటి నేతలు హాజరవుతున్నారు. బ్రెజిల్, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేసియా, ఇరాన్, సౌదీ అరేబియా, యుఎఇ వంటి 11 దేశాలకు చెందిన ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరుకానున్నారు. ఈ సదస్సులో బ్రిక్స్ సభ్య దేశాల మధ్య వ్యాపారం, వాణిజ్యం, పెట్టుబడులు, భద్రత, సహకారం, రవాణా, సరఫరా, టెక్నాలజీ వంటి అంశాలపై చర్చలు, ఒప్పందాలు ఉంటాయి. ఇండియా ఈ సదస్సు నిర్వహిస్తుండటం ఇది నాలుగోసారి. గతంలో 2012, 2016, 2021లో బ్రిక్స్ సదస్సు నిర్వహించింది.

**బ్రిక్స్ సందర్భంగా మోడీ జిన్‌పింగ్ ద్వైపాక్షిక భేటీ**

ఐదేళ్లుగా దూరంగా ఉన్న భారత్‌చైనా సంబంధాల్లో కీలక పరిణామం చోటుచేసుకునే అవకాశం కనిపిస్తోంది. ఢిల్లీలో సెప్టెంబర్ 12, 13 తేదీల్లో జరగనున్న బ్రిక్స్ సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య ద్వైపాక్షిక భేటీ జరిగే అవకాశముంది. అదే జరిగితే 2020 గల్వాన్ ఘర్షణ తర్వాత ఇద్దరు నేతలు ముఖాముఖి చర్చలు జరపడం ఇదే తొలిసారి అవుతుంది. జిన్‌పింగ్ శనివారం భారత్‌కు రానున్నట్లు సమాచారం. ఏడేళ్ల తర్వాత ఆయన భారత్‌లో అడుగుపెట్టనున్నారు. ఇటీవల కిర్గిస్థాన్‌లోని బిష్కెక్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సులో మోడీ, జిన్‌పింగ్ ఒకే వేదికపై కనిపించి కరచాలనం చేసుకున్నారు. అయితే అప్పుడు ద్వైపాక్షిక చర్చలు జరగలేదు. ఇప్పుడు బ్రిక్స్ వేదికగా భేటీజరిగితే ఇరుదేశాల సంబంధాలపై దానిప్రభావం కీలకంగాఉండొచ్చు. సరిహద్దు నుంచి వాణిజ్యం వరకు జిన్‌పింగ్ పర్యటనకు ముందు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ చైనాలో ఉన్నతస్థాయి చర్చలు జరిపారు. సరిహద్దు వ్యవహారాలపై డబ్ల్యూఎంసిసి సమావేశం తర్వాత ఇరుదేశాల ప్రత్యేక ప్రతినిధుల చర్చలు కూడా జరిగాయి. తాజా భేటీలో సరిహద్దు సమస్య, వాణిజ్యం, పెట్టుబడులు, భద్రత, ఎల్ఎసి వద్ద ఉద్రిక్తతలు మళ్లీ తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలు చర్చకువచ్చే అవకాశంఉంది. లడఖ్‌లో ఉద్రిక్తతలు తగ్గినా సరిహద్దు వివాదం మాత్రం పరిష్కారం కాలేదు. ముఖ్యంగా అరుణాచల్ ప్రదేశ్‌పై చైనా చేస్తున్న వాదనలను భారత్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. అరుణాచల్‌ప్రదేశ్ తమ భూభాగమని చైనా చెబుతుండగా భారత్ దాన్ని పూర్తిగా తిరస్కరిస్తోంది. ఇటీవల అప్పర్ సుబన్‌సిరి ప్రాంతంలో చైనా సైనిక కదలికలపై వచ్చిన నివేదికలు కూడా ఆందోళన పెంచాయి. ఇలాంటి పరిస్థితుల్లో మోడ, జిన్‌పింగ్ భేటీ జరిగితే సరిహద్దులో శాంతి, స్థిరత్వంపై భారత్ తన వైఖరిని మరోసారి స్పష్టం చేసే అవకాశం ఉంది. అమెరికా సుంకాలు, పశ్చిమాసియాలో అస్థిరత నేపథ్యంలో ఇరుదేశాల మధ్య ఆర్థిక, దౌత్య సంబంధాలను ఎలా ముందుకు తీసుకెళ్లాలన్నది చర్చకు రావచ్చు.

# అమెరికన్లకు 'ట్రంప్ డివిడెండ్'



## 5వేల డాలర్ల చొప్పున ఇస్తామంటూ అమెరికా అధ్యక్షుని హామీ

**వాషింగ్టన్, సెప్టెంబరు 10:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచనల హామీ ఇచ్చారు. రిపబ్లికన్ పార్టీని గెలిపిస్తే ప్రతి వయోజన అమెరికన్‌కు 5000 డాలర్లు ఇస్తామని ప్రకటించారు. నవంబరులో జరిగే మధ్యంతర ఎన్నికల్లో.. రిపబ్లికన్ పార్టీ ప్రతినిధుల సభ, సెనేట్‌లో పూర్తి పట్టు సాధిస్తే ఈ పథకం అమలు చేస్తామని ట్రంప్ స్పష్టం చేశారు. డాలస్‌లో జరిగిన పార్టీ సమావేశంలో ట్రంప్ ఈ కీలక ప్రకటన చేశారు. ఈ మొత్తాన్ని 'ట్రంప్ డివిడెండ్'గా అభివర్ణించారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని.. దేశం సాధించిన విజయాల్లో ప్రజలకు వాటా కల్పించడమే ఈ పథకం ఉద్దేశమని చెప్పారు. అయితే ఈ నగదును అమెరికాలోనే ఖర్చు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

ఈ హామీ అమలుపై మాత్రం ఆయన పూర్తి వివరాలు వెల్లడించలేదు. డబ్బు ఎక్కడి నుంచి వస్తుంది? ఎప్పుడు చెల్లిస్తారు? ఎవరు అర్హులు? అనే అంశాలపై స్పష్టం ఇవ్వలేదు. అమెరికాలో దాదాపు 24 నుంచి 27 కోట్ల మంది వయోజనులు ఉన్నట్లు అంచనా. అందరికీ 5000 డాలర్లు చెల్లిస్తే ప్రభుత్వ లోటు, ద్రవ్యోల్బణంపై ప్రభావం ఎలా ఉంటుందనే చర్చ మొదలైంది. ఎన్నికలకు ముందు ట్రంప్ ఇచ్చిన ఈ హామీపై అమెరికాలో రాజకీయంగా ఆసక్తి నెలకొంది. ఇంత భారీ మొత్తం ఇవ్వడంపై ఆర్థిక నిపుణులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. మధ్యంతర ఎన్నికల్లో ఓటర్లను ఆకర్షించేందుకే ట్రంప్ ఈ హామీ ఇచ్చినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# మధ్యంతర ఎన్నికల తర్వాతే ఇరాన్ యుద్ధానికి తెర!

**వాషింగ్టన్, సెప్టెంబరు 10:** అమెరికాలో మధ్యంతర ఎన్నికలు పూర్తయిన తర్వాతే ఇరాన్‌తో యుద్ధం ముగుస్తుందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. 100 డాలర్లకు చేరిన చమురు ధరలు కూడా అప్పుడే తగ్గుతాయని అంచనా వేశారు. హార్ముజ్ జలసంధిలో అమెరికా బలగాలు తమ పోరాటాన్ని ఉధృతం చేయడంతో.. టెహ్రాన్ ఇక ఎక్కువకాలం దాడులను తట్టుకోలేదని వ్యాఖ్యానించారు. తమ మధ్యంతర ఎన్నికలను ప్రభావితం చేసేందుకు ఇరాన్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. హార్ముజ్ జలసంధిలో ఇరాన్ సరికొత్త నిబంధనలను ప్రకటించింది. అమెరికా మద్దతుతో జలసంధిలో అసురక్షిత మార్గంలో ప్రయాణిస్తోన్న నౌకలను ఆంక్షల జాబితాలో చేరుస్తామని వెల్లడించింది. ఈ క్రమంలోనే ఇటీవల యుఎస్ నౌకలు, 8 ట్యాంకర్లపైన ఐఆర్‌జిసి దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ట్రంప్ స్పందిస్తూ.. ఇరాన్‌పై విమర్శలు గుప్పించారు. మరోవైపు, అమెరికా కూడా టెహ్రాన్ నౌకలను లక్ష్యంగా చేసుకుంటోంది. దాంతో జోర్డాన్‌లోని యుఎస్ స్థావరంపై ఇరాన్ ప్రతిదాడులు చేసింది. ఈ ఘటనలతో హార్ముజ్‌లో నౌకల రవాణా మరోసారి ప్రమాదంలో పడింది. ఫలితంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు బ్యారెల్ ధర 100 డాలర్లు దాటింది. కాగా.. తాము ఇరాన్‌తో చర్చలు కోరుకోవడం లేదని, అయితే ఒప్పందం కుదుర్చుకునే అంశాన్ని మాత్రం పక్కనపెట్టలేదని ట్రంప్ వ్యాఖ్యానించడం గమనార్హం.

## హఠాత్తుగా తెరుచుకున్న ఎయిర్‌ఫోర్స్ వన్ స్లైడ్

### డొనాల్డ్ ట్రంప్ ప్రయాణించే విమానంలో సమస్య



**వాషింగ్టన్, సెప్టెంబరు 10:** ఖతార్ బహుమతిగా ఇచ్చిన కొత్త ఎయిర్‌ఫోర్స్ వన్‌లో ఎమర్జెన్సీ స్లైడ్ అకస్మాత్తుగా తెరుచుకోవడంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రయాణం కాసేపు ఆలస్యమైంది. డలాస్‌లో జరగనున్న రిపబ్లికన్ పార్టీ మిడ్‌టర్మ్ సమావేశానికి హాజరయ్యేందుకు ట్రంప్ వైట్‌హౌస్ నుంచి 'మెరైన్ వన్' హెలికాప్టర్‌లో జాయింట్ బేస్ ఆండ్రూస్‌కు చేరుకున్నారు. ఆయన అక్కడ హెలికాప్టర్ దిగి ఎయిర్‌ఫోర్స్ వన్ విమానం ఎక్కడానికి కొన్ని నిమిషాల ముందు.. విమానం ముందు భాగంలోని ఎమర్జెన్సీ స్లైడ్ హఠాత్తుగా తెరుచుకుంది. దీంతో ట్రంప్ సుమారు 15 నిమిషాల పాటు మెరైన్ వన్ హెలికాప్టర్‌లోనే వేచి ఉండాల్సి వచ్చింది. ఈ ఘటన ప్రమాదవశాత్తూ జరిగిందని సమాచారం. అనంతరం ఆయన అదే విమానంలో డలాస్ నగరానికి బయలుదేరి, అక్కడ సురక్షితంగా ల్యాండ్ అయ్యారు.




## ముఖగుర్తింపు ప్రక్రియ సులభతరంచేస్తున్న ఆధార్

**ముంబయి, సెప్టెంబరు 10:** ఆధార్ ఫేస్ అథెంటికేషన్ ప్రక్రియను మరింత సరళతరం చేసే దిశగా భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ కీలక ముందడుగు వేసింది. ముంబైలో నిర్వహిస్తున్న గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026 వేదికగా "ఆధార్ ఫేస్ అథెంటికేషన్ ఎస్డీకే", "ఆధార్ ఫేస్ అథెంటికేషన్ శాండ్‌బాక్స్"లను అధికారికంగా ప్రారంభించింది. దీని ద్వారా వినియోగదారులు ఇతర అప్లికేషన్లలోకి మారాల్సిన అవసరం లేకుండానే, తాము వాడుతున్న యాప్‌లోనే నేరుగా ఫేస్ అథెంటికేషన్‌ను పూర్తి చేసే వెసులుబాటు కలుగుతుంది. ఈ నూతన సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కిట్ సాయంతో ప్రభుత్వవిభాగాలు, బ్యాంకులు, ఫిన్‌టెక్ సంస్థలు తమ ఆండ్రాయిడ్, ఐఓఎస్ యాప్‌లలో నేరుగా యూఐడీఏఐ ఫేస్ అథెంటికేషన్ టెక్నాలజీని అనుసంధానించుకోవచ్చు. దీని ఫలితంగా గతంలోమాదిరిగా ఫేస్‌ఆర్‌డీ అనే ప్రత్యేక యాప్‌పై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. ఏఐ/ఎంఎల్ ఆధారిత లైవ్‌నెస్ డిటెక్షన్, యాంటీ స్పూఫింగ్ వంటి అత్యాధునిక భద్రతా ఫీచర్లు ఇందులో అంతర్భాగంగా ఉన్నాయి.

## ఉక్రెయిన్ అధ్యక్షుడికి త్రుటిలో తప్పిన 'డ్రోన్ ముప్పు'

**మాల్డోవా, సెప్టెంబరు 10:** ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ ప్రయాణిస్తున్న విమానానికి పెను ప్రమాదం త్రుటిలో తప్పింది. మాల్డోవా నుంచి ఆయన బయల్దేరడానికి సిద్ధమవుతున్న సమయంలో రష్యాకు చెందిన డ్రోన్ ఒకటి విమానాన్ని దాదాపు ఢీకొట్టినంత పనిచేసిందని నార్వే ప్రధాని జోనాస్ గహర్ స్టోర్ సంచలన విషయం వెల్లడించారు. ఈ ఘటనతో అంతర్జాతీయంగా తీవ్ర కలకలం రేగింది. నార్వే రాజు హెరాల్డ్ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు జెలెన్‌స్కీ మంగళవారం మాల్డోవా నుంచి ఓస్లోకు బయలుదేరారు. అదేసమయంలో రెండు రష్యన్ డ్రోన్లు మాల్డోవా గగనతలంలోకి ప్రవేశించడంతో అధికారులు అప్రమత్తమ య్యారు. భద్రతా కారణాల దృష్ట్యా చిసినావు అంతర్జాతీయ విమానా శ్రయాన్ని తాత్కాలికంగా మూసివేసి, విమానాల రాకపోకలను నిలిపివేశారు. దీంతో జెలెన్‌స్కీ ప్రయాణం ఆలస్యమైంది. అయితే, జెలెన్‌స్కీ విమానానికి డ్రోన్ ఎంత సమీపంలోకి వచ్చిందనే దానిపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. విమానానికి డ్రోన్ దాదాపు తగిలిందని నార్వే ప్రధాని చెప్పగా, ఉక్రెయిన్ అధ్యక్ష కార్యాలయానికి చెందిన మరో అధికారి మాత్రం ఈ ప్రచారంలో కొంత అతిశయోక్తి ఉందని వార్తా సంస్థకు తెలిపారు.

# ఎర్రకోట కాదు.. అసలు లక్ష్యం జైనమందిరం!

## ఎర్రకోట పేలుళ్ల కేసులో ఎన్ఐఎ ఛార్జిషీటు



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 10:** దేశ రాజధాని ఢిల్లీని గత యేడాదిలో కుదిపేసిన ఎర్రకోట సమీపంలోని బాంబు పేలుడు ఘటనలో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) సంచలన విషయాలను వెల్లడించింది. ఆ దాడిలో ఎర్రకోట అసలు లక్ష్యం కాదని, తీవ్రవాదులు మరొక ప్రదేశాన్ని టార్గెట్ చేశారని తన చార్జిషీట్‌లో పేర్కొంది. కేవలం ట్రాఫిక్ రద్దీ, కట్టుదిట్టమైన భద్రత కారణంగానే ఉగ్రవా దులు తమ ప్రణాళికను చివరి నిమిషంలో మార్చుకున్నారని తెలిపింది. 2025 నవంబర్ 10న జరిగిన ఈ ఘటనపై లోతైన దర్యాప్తు జరిపిన ఎన్ఐఎ, కీలక ఆధారాలను కోర్టుకు సమర్పించింది. దాని ప్రకారం, ఉగ్రవాదుల అసలులక్ష్యం చాందినీ చౌక్‌లోని ప్రసిద్ధ లాల్ మందిర్. పేలుడు పదార్థాలతో నింపిన వాహనాన్ని మొదట అక్కడికే తీసుకెళ్లారు. సాయంత్రం 6:37 గంటల సమయంలో వాహనం డ్రైవర్ లాల్ మందిర్ సమీపంలో వాహనాన్ని నిలిపేందుకు ప్రయత్నించినట్లు సిసి టివి ఫుటేజీలో స్పష్టంగారికార్డయింది. ఆసమయంలో ఆ ప్రాంతంలో విపరీతమైన రద్దీ ఉండటం, పోలీసుల భద్రత ఎక్కువగా ఉండటంతో వారి ప్లాన్ అమలు కాలేదు. అసలు లక్ష్యం వద్ద దాడి సాధ్యపడకపోవడంతో డ్రైవర్ వాహనాన్ని చారిత్రక ఎర్రకోట వైపు మళ్లించాడు. సుమారు 13 నిమిషాల తర్వాత సాయంత్రం 6:50 గంటలకు, ఎర్రకోట లోని గేట్ నంబర్ 4 సమీపంలో వాహనాన్ని పేల్చివేశాడు. ఈ భయానక ఆత్మాహుతి దాడిలో 11 మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోగా, మరో 29 మంది తీవ్రంగా గాయపడ్డారు.

**డిఎన్ఎ ఆధారాలతో గుర్తింపు**

ఘటనాస్థలంలో లభించిన ఫోరెన్సిక్, డిఎన్ఎ ఆధారాలు ఈ కేసు దర్యాప్తులో కీలకంగామారాయి. ఈఆధారాలను విశ్లేషించడం ద్వారా వాహనంలో ఉన్న ఆత్మాహుతి దళ సభ్యుడిని గుర్తించినట్లు ఎన్ఐఎ తన చార్జిషీట్‌లో పొందుపరిచింది.

సిసి టివి ఫుటేజీ, శాస్త్రీయ ఆధారాలు ఈ ఉగ్రకుట్రను ఛేదించడంలో దర్యాప్తు సంస్థకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఈ చార్జిషీట్ ప్రస్తుతం కొనసాగు తున్న విస్తృత దర్యాప్తులో ఒక భాగం మాత్రమేనని, దాడి వెనుక ఉన్న పెద్ద కుట్రను ఛేదించేపనిలో ఉన్నామని అధికారులు తెలిపారు. ఈ ఘటన అనంతరం ఢిల్లీతో పాటు దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో భద్రతను గణనీయంగా కట్టుదిట్టం చేశారు.

# హద్దులు ఉండాల్సిందే!

## మైనర్ల సోషల్ మీడియా ఖాతాల నిర్వహణపై సుప్రీం వ్యాఖ్యలు

### కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు... విచారణ వాయిదా

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10:** మైనర్లు సోషల్ మీడియా ఖాతాలను నిర్వహించకుండా నిషేధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై కేంద్రం స్పందనను సుప్రీంకోర్టు కోరింది. దీనికి పటిష్టమైన రక్షణ చర్యల ఆవశ్యకతను స్పష్టం చేసింది. మైనర్లు చట్టబద్ధంగా ఒప్పందాలు చేసుకోలేరు కాబట్టి, సోషల్ మీడియా ఖాతాలను సృష్టించడానికి అవసరమైన ఆన్‌లైన్ వినియోగదారు ఒప్పందాలను అంగీకరించడానికి వారిని అనుమతించకూడదని 'జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అలయన్స్' అనే ఎన్జీవో దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో వాదించారు. భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, న్యాయ, కార్మిక మంత్రిత్వ శాఖలకు నోటీసులు జారీ చేసింది.

విచారణ సందర్భంగా, జస్టిస్ జయమల్య బాగ్చీ, జస్టిస్ వి మోహనలతో కూడిన ధర్మాసనం ముందు పిటిషనర్ తరఫున వాదించిన సీనియర్ న్యాయవాది హెచ్.ఎస్. ఫుల్కా, అమెరికాలో 13 యేళ్లలోపు పిల్లలు సోషల్ మీడియాను ఉపయోగించకుండా నిషేధించారని తెలిపారు. ఈ వాదనలతో ఏకీభవించిన జస్టిస్ సూర్యకాంత్, "భారత్‌లోనూ ఇటువంటి రక్షణ చర్యలు అవసరం ఉంది" అని వ్యాఖ్యానించారు. ధర్మాసనంలోని మరో న్యాయమూర్తి జస్టిస్ బాగ్చి స్పందిస్తూ నియంత్రణ కోసం పటిష్ఠమైన 'ఫైర్‌వాల్స్' ఉండాలని అభిప్రాయపడ్డారు. మైనర్లు సోషల్ మీడియా ఖాతాలను ప్రారంభించడం వల్ల ఆన్‌లైన్ గ్రూమింగ్, లైంగిక వేధింపులు, సైబర్ బుల్లీయింగ్, వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం వంటి ముప్పులను ఎదుర్కొంటున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. సోషల్ మీడియా సంస్థలు వయసు నిర్ధారణ కోసం పటిష్ఠమైన యంత్రాంగాన్ని అనుసరించేలా, మైనర్లు సొంతంగా ఖాతాలు తెరవకుండా నిరోధించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. కాగా, తల్లిదండ్రుల పర్యవేక్షణలో ఉండే ఖాతాల ద్వారా విద్యా సంబంధిత కంటెంట్‌ను వీక్షించేందుకు అనుమతించాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

# సంక్షిప్త వార్తలు

## జోర్డాన్‌లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులు



**అమ్మన్, సెప్టెంబరు 10:** అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పతాక స్థాయికి చేరాయి. జోర్డాన్‌లోని అమెరికా వైమానిక స్థావరంపై బుధవారం రాత్రి ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడింది. ఈ దాడిలో పలు అమెరికా యుద్ధ విమానాలు ధ్వంసమైనట్లు సమాచారం. ఈ దాడిలో ఒక ఏ10 థండర్‌బోల్ట్ యుద్ధ విమానం ఎడమ రెక్క పూర్తిగా ధ్వంసమైందని, మరో ఎనిమిది ఎఫ్15 ఫైటర్ జెట్‌లు పాక్షికంగా దెబ్బతిన్నాయని సోషల్‌మీడియాలో ప్రచారంలోకి వచ్చింది.

## ఫిలిప్పీన్స్ పడవలో ఘోర అగ్నిప్రమాదం, ఐదుగురు మృతి

**మనీలా, సెప్టెంబరు 10:** ఫిలిప్పీన్స్‌లో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. పలవాన్ ప్రావిన్స్‌లోని పర్యాటక కేంద్రం సమీపంలో 134 మందితో ప్రయాణిస్తున్న ఓ ప్యాసింజర్ ఫెర్రీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఐదుగురు మరణించగా, 87 మంది ఆచూకీ తెలియకుండా పోయిందని స్థానిక అధికారులు తెలిపారు. ఈ ఘటనలో 42 మందిని రక్షించినట్లు వివరించారు. వారిలో 38 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది ఉన్నారని చెప్పారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేశారు.

## బిజెపి కంచుకోటలో డికెఎస్ కేబినెట్ సమావేశం

**మంగళూరు, సెప్టెంబరు 10:** కర్ణాటక రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ముఖ్యమంత్రి డికె శివకుమార్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, బిజెపికి కంచుకోటగా భావించే మంగళూరులో సెప్టెంబర్ 18న కేబినెట్ సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది. దక్షిణ కన్నడ జిల్లాలో రాష్ట్ర మంత్రివర్గం సమావేశంకావడం చరిత్రలో ఇదే తొలిసారి. పరిపాలనాపరంగా కనిపిస్తున్న ఈ నిర్ణయం వెనుక, 2028 అసెంబ్లీ ఎన్నికలనుదృష్టిలో పెట్టుకుని బలమైనరాజకీయవ్యూహం దాగిఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## భారత్‌వద్ద 190 అణ్వాయుధాలు: అమెరికా సైంటిస్ట్స్ సమాఖ్య

**వాషింగ్టన్, సెప్టెంబరు 10:** భారత్ వద్ద సుమారు 190 అణ్వాయుధాలు ఉన్నట్లు అమెరికాకు చెందిన ఫెడరేషన్ ఆఫ్ అమెరికన్ సైంటిస్ట్స్ తన రిపోర్టులో పేర్కొన్నది. దీంట్లో అదనంగా కొత్త క్షిపణుల కోసం 30 వార్‌హెడ్స్ ఉన్నట్లు తెలిపింది. ప్రభుత్వ డేటా, కమర్షియల్ శాటిలైట్ ఇమేజ్‌లు, ఓపెన్ సోర్స్‌ల ద్వారా ఆ అంచనా వేసినట్లు ఎఫ్ఏఎస్ వెల్లడించింది. భారత్ వద్ద ఉన్న అణ్వస్త్ర సామర్థ్యం, వ్యూహం ప్రకారం ఆ దేశం ఇప్పటికే 190 న్యూక్లియర్ వార్‌హెడ్స్ ఉత్పత్తి చేసినట్లు అంచనా వేస్తున్నామని ఎఫ్ఎఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ హన్స్ క్రిస్టెన్‌సన్ తెలిపారు.


## ప్రపంచ ఆరోగ్యసంస్థ దక్షిణాసియా ప్రాంతీయ డైరెక్టర్ రాజీనామా


**ఢాకా, సెప్టెంబరు 10:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా కుమార్తె, ప్రపంచ ఆరోగ్య సంస్థ దక్షిణాసియా ప్రాంతీయ డైరెక్టర్ సైమా వాజెద్ తన పదవికి రాజీనామా చేశారు. బుధవారం ఆమె తన రాజీనామా పత్రాన్ని సమర్పించారు. మోసం, అవకతవకలకు సంబంధించిన ఆరోపణలపై డబ్ల్యూహెచ్ఓ, బంగ్లాదేశ్ అధికారులు దర్యాప్తు చేస్తున్న నేపథ్యంలో వాజెద్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

## అబూ సలేం పిటిషన్ కొట్టేసిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 10:** 1993 ముంబై వరుస పేలుళ్ల కేసులో యావజ్జీవ కారాగార శిక్ష పడిన గ్యాంగ్‌స్టర్ అబూ సలేం, ముందస్తు విడుదల కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. పోర్చుగల్‌కు భారతదేశం ఇచ్చిన అప్పగింత హామీల ప్రకారం విధించే 25యేళ్ల కారాగార శిక్ష పరిమితికి, విచారణ ఖైదీగాగడిపిన కాలాన్నికూడా పరిగణనలోకి తీసుకోవాలనివాదిస్తూ సలేం కోర్టును ఆశ్రయించారు. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పును వెలువరించింది.

# సిఎం విజయ్ 'బాడీలాంగ్వేజ్' వివాదం





## స్టాలిన్‌ను ఎద్దేవా చేశారంటూ మండిపడిన డిఎంకె

**చెన్నై, సెప్టెంబరు 10:** అసెంబ్లీలో సిఎం విజయ్ తన దవడను చేతితో పట్టుకున్న తీరు ఇప్పుడు తీవ్ర రాజకీయ వివాదానికి కారణమైంది. అది డిఎంకె అధినేత ఎంకె స్టాలిన్‌ను ఉద్దేశించి చేసిన ఎద్దేవా అంటూ ఆ పార్టీ నేతలు మండిపడ్డారు. విజయ్ మాత్రం తన బాడీ లాంగ్వేజ్ అనుకోకుండా అలా వచ్చిందని, ఎవరినీ వ్యక్తిగతంగా బాధపెట్టాలన్న ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. కానీ ఈ వివాదం వెనుక దాదాపు 50 యేళ్ల నాటి గాయం ఉంది. 1976లో అత్యవసర పరిస్థితి సమయంలో స్టాలిన్‌కు ఎదురైన ఘటన. ఈనెల 7న తమిళనాడు అసెంబ్లీలో విజయ్ డిఎంకెప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేస్తూ తీవ్ర విమర్శలు చేశారు. పోలీసు శాఖకు సంబంధించిన గ్రాంట్లపై జరిగిన చర్చకు సమాధానమిస్తున్న సమయంలో ఆయన పలుమార్లు రాజకీయంగా ఘాటు వ్యాఖ్యలు చేశారు. అదే సమయంలో తన దవడను ఒక చేత్తో పట్టుకుని పైకి లేపుతున్నట్లుగా ఓ హావభావం కనిపించింది. ఈ సైగ స్టాలిన్ దవడకు తగిలిన గాయాన్ని ఎద్దేవా చేసేలా ఉందని డిఎంకె నేతలు ఆరోపించారు. ఆ వెంటనే వివాదం ముదిరింది. విమర్శలు పెరగడంతో విజయ్ వివరణ ఇచ్చారు. అసెంబ్లీలో తన బాడీ లాంగ్వేజ్ అనుకోకుండా వచ్చిందని చెప్పారు. అది ఉద్దేశపూర్వకంగా చేసిన హావభావం కాదని స్పష్టం చేశారు. తన చర్యను ఎవరి వ్యక్తిగత భావాలను దెబ్బతీసే ప్రయత్నంగా చూడొద్దని కోరారు. అయితే అప్పటికే రాజకీయంగా నష్టం జరిగిపోయింది. డిఎంకెతో పాటు వామపక్ష నేతలు కూడా ఈ చర్యను తప్పుబట్టారు. 1975లో దేశంలో అత్యవసర పరిస్థితి విధించిన సమయంలో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ప్రభుత్వం ప్రతిపక్షాలపై తీవ్ర ఆంక్షలు విధించింది. 1976లో తమిళనాడులో కరుణానిధి నేతృత్వంలోని డిఎంకె ప్రభుత్వం రద్దయింది. అదే సమయంలో యువ డిఎంకె నాయకుడిగా ఉన్న స్టాలిన్‌ను అరెస్టు చేశారు. ఆయనను మీసా చట్టం కింద అదుపులోకి తీసుకుని మద్రాస్ జైలులో నిర్బంధించారు. మీసా అంటే మెయింటెనెన్స్ ఆఫ్ ఇంటర్నల్ సెక్యూరిటీ యాక్ట్. విచారణ లేకుండానే వ్యక్తులను నిర్బంధించే విస్తృత అధికారాలను ఈ చట్టం ప్రభుత్వానికి ఇచ్చింది. అత్యవసర పరిస్థితి సమయంలో రాజకీయ ప్రత్యర్థులపై దీన్ని విస్తృతంగా ఉపయోగించారు. స్టాలిన్ తన ఆత్మకథ ఉంగళిల్ ఒరువన్‌లో ఆ సమయం గురించి వివరించారు. జైలు పరిస్థితులు, అక్కడ జరిగిన హింసను ప్రస్తావించారు. స్టాలిన్ కూడా ఈ వివాదంపై నేరుగా స్పందించారు. విజయ్‌ను ఉద్దేశించి తమ్ముడు విజయ్ నువ్వు చేసిన సైగ నిజమే. పోలీసుల దాడిలో నా దవడ ఎముకలు విరిగాయి. ఆ దాడి గాయాల మచ్చలు ఇప్పటికీ నా శరీరంపై ఉన్నాయి. మీ స్థాయి ఏంటో గుర్తించి అందుకు తగ్గట్టుగా వ్యవహరించాలి. మీరు ప్రభుత్వాన్ని సినిమా షూటింగ్‌లా నడుపుతున్నారు. అసెంబ్లీని రీల్స్ చేసే ప్రదేశంగా మార్చారు. మేం నిర్మించిన వంతెనను కూడా ఫొటోషూట్‌కు ఉపయోగించుకున్నారు" అంటూ స్టాలిన్ తీవ్రంగా విమర్శించారు.

### విజయ్ సైగలపై స్పందించిన స్టాలిన్

**చెన్నై, సెప్టెంబరు 10:** తమిళనాడు శాసనసభ వేదికగా ఎమర్జెన్సీ కాలం నాటి మీసా చట్టం, తన అరెస్టుపై ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ చేసిన వ్యాఖ్యలు, ఆయన శారీరక అభినయంపై డిఎంకె అధినేత, మాజీ సిఎం ఎంకె స్టాలిన్ తీవ్రంగా స్పందించారు. శాసనసభను రీల్స్ చేసే స్థలంగా మార్చవద్దని, అనవసరమైన వివాదాలు రేపకుండా ముఖ్యమంత్రి పదవికి ఉన్న గౌరవాన్ని కాపాడాలని ఆయన హితవు పలికారు. సభలో విజయ్ తన దవడపై చెయ్యి వేసి చూపించిన సైగపై స్పందిస్తూ జైలులో పోలీసులు జరిపిన దాడిలో తన దవడ ఎముక విరిగిపోవడం నిజమేనని, ఆ గాయాల మచ్చలు నేటికీ తన శరీరంపై ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 1976 జనవరి 31న నాటి కరుణానిధి ప్రభుత్వాన్ని కేంద్రం రద్దుచేసిన మరుక్షణమే, గోపాలాపురం ఇంట్లో ఉన్న తనను అరెస్టు చేసేందుకు పోలీసులు వచ్చారని స్టాలిన్ గుర్తుచేశారు. ఆ సమయంలో తాను ప్రచారంలో ఉండటంతో, "మా అబ్బాయి రేపు రాగానే నేనేస్వయంగా ఫోన్‌చేసి పిలుస్తానని కరుణానిధి పోలీసులకు చెప్పి, మరుసటి రోజు తనను జైలుకు పంపారని తెలిపారు. రాజకీయాన్ని డైవర్ట్ చేయడానికి విజయ్ చరిత్రను తవ్వే ప్రయత్నం చేస్తున్నారని స్టాలిన్ విమర్శించారు. మీసా నిర్బంధంలో తనతో పాటు ఉన్న ఎంపీ చిట్టిబాబుజైలులోనే ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. ఈ త్యాగాలు డిఎంకె రక్తం, భావజాలంలో భాగమని, వాటిని ఎవరూ చెరిపివేయలేరని అన్నారు.